ANN తెలుగు
Follow: @ANNTELUGU
30-06-2026
# మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 176 పేజీలు-10 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## విద్యారంగంలో లోకేష్ మార్క్
### టాపర్స్ కు పురస్కారాలు

**అమరావతి, మహా :** గత ఏడాది పదోతరగతి, ఇంటర్మీడియట్ లో ఉత్తమ ఫలితాలు కనబర్చిన విద్యార్థులను పాఠశాల విద్యాశాఖ తరపున తాడేపల్లిలోని సిఎస్ఆర్ ఫంక్షన్ హాలు వేదికగా రాష్ట్ర మంత్రి నారా లోకేష్ సత్కరించారు. 55మంది టెన్త్ షైనింగ్ స్టార్లకు రూ. 30వేలు ప్రైజ్ మనీ, మెడల్, సర్టిఫికేట్, 61మంది ఇంటర్మీడియట్ షైనింగ్ స్టార్లకు ల్యాప్ ట్యాప్, మెడల్ అందజేశాను. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ షైనింగ్ స్టార్లే మా బ్రాండ్ అంబాసిడర్లు. దేశం మొత్తం ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ గురించే మాట్లాడాలి. విద్యార్థికోణం నుంచే విద్యాశాఖలో సంస్కరణలు చేపట్టాం. మీరు గెలిచారు, నన్ను గెలిపించారు అంటూ విద్యార్థులను ప్రశంసల్లో ముంచెత్తారు. లోకేష్ తీసుకొచ్చిన విద్యారంగ సంస్కరణల పై ప్రశంసలు కురుస్తున్నాయి.

టాప్ న్యూస్

## రూ. 4 లక్షల కోట్ల ఫేక్ మార్కెట్



సీక్రెట్ ఏజెంట్లను ప్రయోగిస్తున్న బ్రాండ్లు 03

## రాజ్యసభ ప్రతిపక్ష నేతగా మరోసారి మల్లికార్జున ఖర్గే



ఈనెల 26నుంచి అమల్లోకి రానున్న ఖర్గే నియామకం 02

## బంగాళాఖాతంలో చైనా వ్యూహం



భారత్ కు పెరిగిన ముప్పు 03




## తెలంగాణలో బెంగాల్ వ్యూహం
రంగంలోకి సంఘ్ పరివార్ క్షేత్ర స్థాయికి కమల వ్యూహం 03

# రేవంతన్న భరోసా

వానాకాలం సాగు వేళ అన్నదాతల గుండెల్లో ఆనందాల హేల



02

- రైతు కళ్లల్లో పెట్టుబడి ధీమా
- నేడే సీఎం చేతులమీదుగా భరోసా నిధుల విడుదల
- మధిర సభ రద్దు..
- నేడు హైదరాబాద్ శిల్పకళావేదికగా పంపిణీ


అన్నదాత ఖాతాల్లోకి రూ.2,482 కోట్లు



(హైదరాబాద్ - మహా)

వానాకాలం సాగు జోరందుకున్న తరుణంలో తెలంగాణ అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ముఖ్యమంత్రి రేవంతన్న కానుకగా 'రైతుభరోసా' నిధుల విడుదలకు ముహూర్తం ఖరారైంది. మట్టిని నమ్ముకున్న మారాజుల చెంతకు... చేరింది 'రైతుభరోసా' సిరుల పంట, చిన్న, సన్నకారు రైతుల కళ్లల్లో... మెరిసింది సరికొత్త పెట్టుబడి ధీమా. రూపాయి అప్పు కోసం తిరిగే తిప్పలు తప్పిస్తూ... అందింది సర్కారు బీమా. నల్లరేగడి నవ్వుల సాక్షిగా... మురిసింది తెలంగాణ వ్యవసాయ రంగం,పట్టాదారుల పాసు బుక్కుల సాక్షిగా... మొదలైంది హరిత విప్లవ గమనం. చెమట చిందించే రైతన్నల శ్రమకు...

మిగతా 2వ పేజీలో





## తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కారే లక్ష్యం

- రాహుల్ గాంధీ పార్ట్ టైమ్ నాయకుడు.
- బీజేపీ కార్యకర్తలు ఫుల్ టైమ్ సేవకులు
- వరంగల్ బూత్ అధ్యక్షుల సమ్మేళనంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ దిశానిర్దేశం

02



## మూడు నెలల్లో ఎన్నికలు రావొచ్చు
డీఎంకే శ్రేణులకు స్టాలిన్ పిలుపు 03


## అన్నాడీఎంకేకు ఆరో షాక్
మరో ఎమ్మెల్యే రాజీనామా 02

## తెలంగాణ పోలీసు శాఖలో భారీ మార్పులు

- 23 మంది నాన్ కేడర్ అధికారులకు బదిలీలు.
- వరంగల్ సీపీగా శ్వేత సీఐడీ, ఏసీబీ, ఇంటెలిజెన్స్‌లో కొత్త నియామకాలు.

02



## ఏఐ టాలెంట్ లో హైదరాబాదే తోపు
- మెట్రోల నుంచి టైర్-2 నగరాల దాకా ఏఐ విస్తరణ
- ఏఐ రంగంలో మరో మైలురాయి... ముంబై, చెన్నై కంటే ముందు

02

## హరీష్‌కు డబుల్ మెంటల్



- అసెంబ్లీని ఎందుకు రద్దు చేయాలి
- ప్రజలు ఐదేళ్ళకు తీర్పునిచ్చారు
- ప్రతి ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ప్రజలు శిక్ష వేస్తూనే ఉన్నారు
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

02



## ముంబై వెళ్ళిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
భుజాల గాయాలతో ఇబ్బందులు. 03

## ఒక్క ఓటు కూడా పోవద్దు

కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్ ఛార్జి కంది శ్రీనివాస రెడ్డి బేలలో ఎస్ఐఆర్‌పై అవగాహనా సదస్సు 06





# హరీష్‌కు డబుల్ మెంటల్

- అసెంబ్లీని ఎందుకు రద్దు చేయాలి
- ప్రజలు ఐదేళ్ళకు తీర్పునిచ్చారు
- ప్రతి ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ప్రజలు శిక్ష వేస్తూనే ఉన్నారు
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, మహా :** బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతున్న తీరు చూస్తుంటే ఆయనకు మెంటల్ బ్యాలెన్స్ తప్పిందనే అనుమానం కలుగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం సచివాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేయాలన్న హరీష్ రావు వ్యాఖ్యలపై స్పందిస్తూ తెలంగాణ ప్రజలు మాకు ఐదేళ్లకు అధికారమిచ్చారు, రెండున్నరేళ్లకే ఎందుకు అసెంబ్లీని రద్దు చేస్తామన్నారు. ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది, గడచిన రెండున్నర సంవత్సరాలలో జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ప్రజల తీర్పు ఏవిధంగా ఉందో హరీష్‌రావుకు తెలుసన్నారు. ఇప్పుడు కొత్తగా వచ్చే తీర్పు ఏముంది? రెండుకాళ్లు లేనివాడు చూసుకుందాం రా.. అని సవాలు విసిరినట్లే బిఆర్ఎస్ నాయకుల సవాళ్లు ఉంటున్నాయన్నారు. ఈ ప్రభుత్వం చేసే మంచిపనులను జీర్ణించుకోలేక భవిష్యత్తులో అధికారం దక్కదనే ఆవేశం, ఆక్రోశంతో కేటీఆర్ ఉక్రోషాన్ని వెళ్లగక్కుతున్నారని మంత్రి మండిపడ్డారు. నా నియోజకవర్గం పాలేరులో కేటీఆర్ విమర్శలు ఇదే కోవలోకి వస్తాయని, బిఆర్ఎస్ నాయకులు చేసే చిల్లర విమర్శలకు ప్రతిసారీ స్పందించనని అన్నారు. ఎప్పుడో ఒకసారి కచ్చితంగా కర్ర కాల్చి వాత పెడతా. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తేనే బాంబులు పేలినట్టుకాదు. ప్రజలు ఛీ కొట్టినా బాంబులు పడ్డట్టే. ఏ వ్యక్తిమీదా వ్యక్తిగత కక్షపూరితమైన చర్యలు తీసుకోవాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. తప్పుచేసిన వాళ్ళను జైలులో వేస్తేనే శిక్షించినట్లు కాదు. ప్రతి ఎన్నికల్లో వాళ్లను ఓడించి ప్రజలు శిక్షిస్తూనే ఉన్నారు. తమిళనాడు లాంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో తీసుకురామన్నారు.

**బీజేపీవి పగటికలలు**

అధికారంలోకి వస్తామని బిజేపీ పగటికలలు కంటోందని, ఆశ ఉండడంలో తప్పులేదు కానీ ఆ పార్టీ అత్యాశకు పోతోందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కనీసం డిపాజిట్ రాని పార్టీ అధికారం గురించి ఆశ పడుతోందని ఎద్దేవా చేశారు. బిజేపీ, బిఆర్ఎస్ ఒకే తాను ముక్కలని, కాళేశ్వరం అవినీతి, థర్మల్ పవర్ ప్లాంట్ అక్రమాలపై సిబిఐ విచారణ చేయాలని అడిగితే బిజేపీ ఇప్పటివరకు స్పందించలేదన్నారు. ఈ సారి రైతు భరోసా నిధులను అనుకున్నదానికంటే రెండు మూడు రోజుల ముందే వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో జమచేస్తామన్నారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటివరకు 18 నియోజకవర్గాలలో 23 స్థలాలను గుర్తించడం జరిగిందని, కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు. భూముల ధరల సవరణలు ఎక్కడైనా పొరపాటుగా ఎక్కువ ధర నిర్ణయిస్తే సరిచేయడానికి సిద్దంగా ఉన్నామన్నారు. తాండూరులో ఇదే విధంగా జరిగితే సరిదిద్దడం జరిగిందన్నారు.

# రేవంతన్న భరోసా

( మొదటి పేజీ తరువాయి )

రేవంతన్న ప్రభుత్వం ఇస్తోంది చేదోడు.. రైతుభరోసాయే తిరుగులేని తోడు. పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్న రైతాంగానికి అండగా నిలుస్తూ, ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా వారి ఖాతాల్లోకే నగదు జమ చేసేలా ప్రభుత్వం భారీ కార్యాచరణను సిద్ధం చేసింది. మధిరలో భారీసభ నిర్వహించి పంపిణీచేయాలనుకున్న రైతుభరోసా కార్యక్రమం భారీవర్షాల కారణంగా హైదరాబాద్ శిల్పకళావేదికకు షిఫ్ట్ అయింది.



**నేటి నుండి జమ**

వానాకాలం సాగు జోరందుకున్న తరుణంలో తెలంగాణ రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. రైతుభరోసా పథకం కింద తొలి విడత నిధులను మంగళవారం నుంచి రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇస్తూ తొలి విడతలో రెండు ఎకరాల వరకు భూమి కలిగిన రైతులకు నిధులు విడుదల చేయనుండగా, మిగిలిన అర్హులందరికీ దశలవారీగా పెట్టుబడి సాయం అందించనున్నట్లు స్పష్టం చేశారు. విత్తనాలు, ఎరువుల కొనుగోలు కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఈ ప్రకటన భారీ ఊరటనిచ్చేలా మారింది. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో రెండు ఎకరాల వరకు సాగుభూమి కలిగిన 41.37 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,482 కోట్లను ప్రభుత్వం నేరుగా జమ చేయనుంది. రైతులు ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా తమ బ్యాంకు ఖాతాల్లోనే ఈ మొత్తాన్ని పొందనున్నారు. వానాకాలం సాగు ప్రారంభ దశలోనే రైతుల చేతికి పెట్టుబడి సాయం అందించాలన్న లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తుమ్మల తెలిపారు. దీంతో చిన్న రైతులు అప్పుల కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన అవసరం తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

**మొత్తం 73 లక్షల మంది రైతులకు రైతుభరోసా**

రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన తాజా అర్హుల జాబితా ప్రకారం తెలంగాణలో సుమారు 73 లక్షల మంది రైతులు రైతుభరోసా పథకం పరిధిలో ఉన్నారు. వీరి ఆధీనంలో సుమారు 1.50 కోట్ల ఎకరాల సాగుభూమి ఉంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో ప్రతి అర్హమైన ఎకరానికి రూ.6 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం సుమారు రూ.9 వేల కోట్ల నిధులను కేటాయించింది. రైతులకు సకాలంలో సాయం అందించడం ద్వారా సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తి కూడా మెరుగుపడుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

తొలి విడతలో నిధులు అందుకున్న రైతులతో పాటు ఇంకా సుమారు 31.5 లక్షల మంది రైతులకు రైతుభరోసా చెల్లింపులు జరగాల్సి ఉంది. భూవిస్తీర్ణం ఆధారంగా వీరికి దశలవారీగా నిధులు జమ చేయనున్నారు. తొలి విడత పూర్తయిన వెంటనే మిగిలిన రైతులకు కూడా విడతల వారీగా చెల్లింపులు కొనసాగుతాయని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ఇందుకోసం వ్యవసాయ, రెవెన్యూ, ఆర్థిక శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రతి అర్హుడికి పథకం ప్రయోజనం అందేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది.

**కొత్త పట్టాదారులకు ప్రత్యేక అవకాశం**

ఇటీవల కొత్తగా పట్టాదారు పాసుబుక్‌లు పొందిన రైతులను కూడా ప్రభుత్వం రైతుభరోసా పరిధిలోకి తీసుకురానుంది. అలాంటి రైతులు జులై 5లోపు సంబంధిత వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు. దరఖాస్తులు పరిశీలించి అర్హత నిర్ధారించిన అనంతరం వారికి కూడా రైతుభరోసా నిధులు జమ చేయనున్నట్లు వెల్లడించారు. కొత్తగా భూములు కొనుగోలు చేసిన రైతులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

**సాగు ఖర్చులకు భారీ అండ**

ప్రస్తుతం విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు పెరిగిన నేపథ్యంలో రైతులకు పెట్టుబడి సాయం అత్యంత అవసరంగా మారింది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సకాలంలో రైతుభరోసా నిధులు విడుదల చేస్తోంది. రైతుల చేతికి నగదు అందడం వల్ల సాగు పనులు ఆలస్యం కాకుండా పూర్తయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక లావాదేవీలు కూడా ఈ నిధుల ద్వారా ఊపందుకుంటాయని అంచనా వేస్తున్నారు. రైతుభరోసా పథకం కేవలం పెట్టుబడి సాయం మాత్రమే కాకుండా వ్యవసాయ రంగానికి ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించే కార్యక్రమంగా ప్రభుత్వం అభివర్ణిస్తోంది. వానాకాలం సాగును ప్రోత్సహించడం, రైతుల పెట్టుబడి భారాన్ని తగ్గించడం, దిగుబడులు పెంచడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ఈ పథకం ప్రధాన లక్ష్యాలుగా పేర్కొంటోంది. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అర్హులైన రైతులందరికీ నిధులు చేరేలా ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతుందని ప్రభుత్వం వెల్లడించింది. రైతుల ఖాతాల్లో నిధులు జమ అయిన వెంటనే బ్యాంకుల ద్వారా సందేశాలు కూడా పంపించనున్నట్లు అధికారులు తెలిపారు.

## రాజ్యసభ ప్రతిపక్ష నేతగా మరోసారి మల్లికార్జున ఖర్గే

**ఈనెల 26నుంచి అమల్లోకి రానున్న ఖర్గే నియామకం**

**ఢిల్లీ, మహా** రాజ్యసభకు తిరిగి ఎన్నికైన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రతిపక్ష నేతగా మళ్లీ గుర్తింపు పొందారు. ఆయన పదవీకాలం ఈనెల 25తో ముగియనుండగా ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో తిరిగి ఎన్నికయ్యారు. రాజ్యసభ ఛైర్మన్ ఛాంబర్‌లో సోమవారం ఖర్గే ప్రమాణం చేశారు. దీంతో రాజ్యసభ ఛైర్మన్ రాధాకృష్ణన్ ఖర్గేను ప్రతిపక్ష నేతగా గుర్తించారు. ఈనెల 26 నుంచి ప్రతిపక్ష నేతగా ఆయన నియామకం అమల్లోకి వస్తుందని రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీ బులెటిన్ విడుదల చేశారు.

## మూడు నెలల్లో ఎన్నికలు రావొచ్చు.

**చెన్నై, మహా :** తమిళనాడులో రాజకీయ పరిణామాలు వేగంగా మారే అవకాశం ఉందని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అన్నారు. మరో ఐదేళ్లు ఎదురుచూడాల్సిన అవసరం లేదని, మూడు నెలలు లేదా ఆరు నెలల్లో ఎన్నికలు రావొచ్చని పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశారు. ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. చెన్నైలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాజీ మంత్రి బెంజమిన్‌తో పాటు పలువురు ఏఐఏడీఎంకే నేతలు, కార్యకర్తలు డీఎంకేలో చేరారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న టీవీకే ప్రభుత్వానికి సొంతంగా మెజారిటీ లేదన్నారు. 118 సీట్ల మెజారిటీ అవసరం కాగా ఆ పార్టీకి 108 స్థానాలే వచ్చాయని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇతర పార్టీల మద్దతుతోనే కొనసాగుతోందన్నారు. ఇటీవల వరకు డీఎంకే కూటమిలో ఉన్న కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతుతోనే ప్రభుత్వం నడుస్తోందని చెప్పారు. అలాంటి ప్రభుత్వం ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేమన్నారు. ఎప్పుడు కూలిపోతుందో తెలియదని వ్యాఖ్యానించారు.

## అన్నాడీఎంకేకు ఆరో షాక్

**చెన్నై, మహా :** తమిళనాడు రాజకీయాలు అత్యంత వేగంగా మారుతున్నాయి. ద్రవిడ రాజకీయాల్లో తిరుగులేని శక్తులుగా వెలిగిన ద్రవిడ పార్టీలకు షాక్ ఇస్తూ కొత్త శకం వైపు పరిణామాలు దూసుకుపోతున్నాయి. అన్నాడీఎంకే పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మాజీ రవాణా శాఖ మంత్రి, కరూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే ఎంఆర్ విజయ భాస్కర్ సోమవారం తన శాసనసభ్యత్వానికి సంచలన రాజీనామా చేశారు. తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన కొద్ది కాలంలోనే ఏఐఏడీఎంకేను వీడిన ఎమ్మెల్యేల సంఖ్య ఆయనతో కలిపి ఆరుకు చేరడం ఆ పార్టీని తీవ్ర ఆందోళనలో పడేసింది. మాజీ మంత్రి విజయభాస్కర్ సోమవారం చెన్నైలోని రాష్ట్ర సచివాలయానికి చేరుకుని, అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌ను వ్యక్తిగతంగా కలిశారు. తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొంటూ అధికారిక పత్రాన్ని సమర్పించారు. రాజీనామా లేఖను, అసెంబ్లీ నిబంధనలను కూలంకషంగా పరిశీలించిన స్పీకర్, ఆయన రాజీనామాను తక్షణమే ఆమోదించినట్లు సచివాలయ వర్గాలు ధృవీకరించాయి. విజయభాస్కర్ నిష్క్రమణతో తమిళనాడు అసెంబ్లీలో అన్నాడీఎంకే పార్టీ అధికారిక బలం 41 స్థానాలకు పడిపోయింది.


# ఏఐ టాలెంట్ లో హైదరాబాదే తోపు

- మెట్రోల నుంచి టైర్-2 నగరాల దాకా ఏఐ విస్తరణ
- ఏఐ రంగంలో మరో మైలురాయి... ముంబై, చెన్నై కంటే ముందు

**హైదరాబాద్, మహా :** భారత్‌లో కృత్రిమ మేధ రంగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్ మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. దేశంలోని అత్యుత్తమ ఐదు కృత్రిమ మేధ ప్రతిభా కేంద్రాల్లో హైదరాబాద్ స్థానం సంపాదించింది. బెంగళూరు, పుణె, ముంబై, చెన్నైతో పాటు హైదరాబాద్ కూడా దేశ టెక్నాలజీ అభివృద్ధికి కీలక కేంద్రంగా నిలవడం తెలంగాణకు గర్వకారణంగా మారింది. ఒకవైపు టైర్2 నగరాల నుంచి కృత్రిమ మేధ నేర్చుకునే వారి సంఖ్య పెరుగుతున్నప్పటికీ, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలు, సాంకేతిక పెట్టుబడులకు హైదరాబాద్ ఇప్పటికీ ప్రధాన గమ్యస్థానంగా కొనసాగుతోంది. తాజా విశ్లేషణ ప్రకారం దేశంలో కృత్రిమ మేధ ప్రతిభను తీర్చిదిద్దుతున్న ప్రధాన నగరాల్లో బెంగళూరు మొదటి స్థానంలో నిలిచింది. దాదాపు 19 శాతం వాటాతో బెంగళూరు అగ్రస్థానంలో ఉండగా, పుణె 7 శాతం, హైదరాబాద్ 4 శాతం, ముంబై 4 శాతం, చెన్నై 3 శాతం వాటాతో దేశంలోని ప్రముఖ ఏఐ ప్రతిభా కేంద్రాలుగా గుర్తింపు పొందాయి. ఈ జాబితాలో హైదరాబాద్ కొనసాగడం రాష్ట్ర సాంకేతిక రంగం బలాన్ని మరోసారి నిరూపించింది. కృత్రిమ మేధ విద్య ఇక మెట్రో నగరాలకు మాత్రమే పరిమితం కావడం లేదు. లక్నో, పాట్నా, జైపూర్, ఇండోర్, నాగ్‌పూర్, చెంగల్పట్టు, కోయంబత్తూరు వంటి టైర్2 నగరాల నుంచి దాదాపు 20 శాతం మంది విద్యార్థులు, ఉద్యోగులు ఏఐ కోర్సులు అభ్యసిస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. దీంతో దేశవ్యాప్తంగా సాంకేతిక విద్య విస్తరిస్తోందనే విషయం స్పష్టమవుతోంది.

**పరిశోధనల్లో..**

హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి సమాచార సాంకేతిక సంస్థలు, ఔషధ పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు, స్టార్టప్‌లు, డేటా సెంటర్లు, ఆవిష్కరణ కేంద్రాలు పెద్ద సంఖ్యలో ఉండటం వల్ల కృత్రిమ మేధ రంగానికి అనుకూల వాతావరణం ఏర్పడింది. అంతర్జాతీయ సంస్థలు కూడా తమ ఏఐ పరిశోధన, అభివృద్ధి కేంద్రాలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడంతో యువతకు నాణ్యమైన ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. హైదరాబాద్‌లో అభివృద్ధి చెందిన స్టార్టప్ వ్యవస్థ, ఇంక్యుబేషన్ కేంద్రాలు, సాంకేతిక పార్కులు, పెట్టుబడులకు అనుకూలమైన విధానాలు కొత్త ఆవిష్కరణలకు ఊతమిస్తున్నాయి. కృత్రిమ మేధ ఆధారిత సేవలు అందిస్తున్న సంస్థలు వేగంగా విస్తరిస్తుండటంతో దేశ నలుమూలల నుంచి యువ నిపుణులు హైదరాబాద్‌ను కెరీర్ గమ్యంగా ఎంచుకుంటున్నారు. కృత్రిమ మేధ రంగం అభివృద్ధి తెలంగాణ ఆర్థిక వ్యవస్థపై కూడా సానుకూల ప్రభావం చూపుతోంది. అధిక వేతన ఉద్యోగాలు, విదేశీ పెట్టుబడులు, సాంకేతిక ఎగుమతులు, పరిశోధన, నూతన పరిశ్రమల ఏర్పాటుతో రాష్ట్ర ఆదాయం పెరుగుతోంది. ప్రపంచ స్థాయి సాంకేతిక కేంద్రంగా హైదరాబాద్ గుర్తింపు మరింత బలపడుతోంది. కృత్రిమ మేధ భవిష్యత్తు సాంకేతిక ప్రపంచాన్ని నిర్దేశించనున్న తరుణంలో హైదరాబాద్ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటోంది. టైర్2 నగరాల నుంచి కొత్త ప్రతిభ వెలుగులోకి వస్తున్నప్పటికీ, పరిశోధన, ఆవిష్కరణ, ఉపాధి అవకాశాల కేంద్రంగా హైదరాబాద్ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ దేశ టెక్నాలజీ అభివృద్ధికి ప్రధాన చోదకశక్తిగా నిలుస్తోంది. యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు అందించే నగరంగా హైదరాబాద్ మరోసారి తన ప్రత్యేక గుర్తింపును నిలబెట్టుకుంది.




# తెలంగాణ పోలీసు శాఖలో భారీ మార్పులు




**హైదరాబాద్, మహా :** తెలంగాణ పోలీసు శాఖలో మరోసారి భారీ పరిపాలనా పునర్వ్యవస్థీకరణ చేపట్టారు. రాష్ట్ర హోం శాఖ 23 మంది నాన్ కేడర్ పోలీసు సూపరింటెండెంట్లు, అదనపు పోలీసు సూపరింటెండెంట్లకు బదిలీలు, పోస్టింగ్‌లు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా కీలక విభాగాలైన సీఐడీ, అవినీతి నిరోధక శాఖ, ఇంటెలిజెన్స్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, గ్రేహౌండ్స్, ఆక్టోపస్, హైడ్రా, సైబర్ క్రైమ్స్, ట్రాఫిక్, నార్కోటిక్స్, ఈగల్ ఫోర్స్, పోలీసు కమిషనరేట్లలో విస్తృత మార్పులు చేపట్టింది. ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడిన వెంటనే సంబంధిత అధికారులను రిలీవ్ చేసి కొత్త పోస్టింగ్‌లలో బాధ్యతలు స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించింది. వరంగల్ సీపీ గా శ్వేతను నియమించారు.

వెయిటింగ్‌లో ఉన్న ఎ. లక్ష్మిని ఎల్‌బీ నగర్-మహేశ్వరం పరిధిలో ప్రత్యేక ఆపరేషన్ బృందం, సైబర్ నేరాలు, మహిళల భద్రత విభాగం డీసీపీగా నియమించారు. గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా మహ్మద్ అష్ఫాక్‌కు బాధ్యతలు అప్పగించారు. గ్రేహౌండ్స్‌లో పనిచేస్తున్న జె. రాఘవేందర్ రెడ్డిని హైదరాబాద్ గోల్కొండ జోన్ డీసీపీగా నియమించారు. గోల్కొండ డీసీపీగా ఉన్న జి. చంద్ర మోహన్‌ను అవినీతి నిరోధక శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా నియమిస్తూ ఆయన సేవలను ఏసీబీకి కేటాయించారు. ఎ. బాలకోటిని సీఐడీ ఎస్పీగా నియమించారు. సీఐడీలో పనిచేస్తున్న జె. అన్యను డీజీపీ కార్యాలయంలో ఏఐజీ (పరిపాలన)గా బదిలీ చేశారు. మహ్మద్ ఇక్బాల్ సిద్ధిఖీ, ఎ. రామ్ రెడ్డి, ఎస్. రమేష్‌లను ఇంటెలిజెన్స్ విభాగంలో ఎస్పీలుగా నియమించారు. పి. శ్రీనివాస్ రెడ్డిని సీఐడీ ఎస్పీగా, ఎస్. శ్రీనివాస్‌ను మరో సీఐడీ ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

**సాంకేతిక, సైబర్ విభాగాలకు ప్రాధాన్యం**

జి. మనోహర్‌ను తెలంగాణ సమీకృత కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ సాంకేతిక విభాగం ఎస్పీగా నియమించారు. కె. పుష్పను సైబర్ క్రైమ్స్ డీసీపీగా బదిలీ చేశారు. ఎస్. రవికుమార్‌ను సైబరాబాద్ ట్రాఫిక్-2 డీసీపీగా నియమిస్తూ కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి జోన్ల బాధ్యతలు అప్పగించారు. సైబర్ నేరాల పెరుగుతున్న నేపథ్యంలో ఈ పోస్టింగ్‌లకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.

**నార్కోటిక్స్, ఈగల్ ఫోర్స్‌కు కొత్త అధికారులు**

సీఐడీలో పనిచేస్తున్న పి. రవీందర్‌ను రాచకొండ నార్కోటిక్స్ కంట్రోల్ సెల్, తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఎస్పీగా నియమించారు. గతంలో అదే బాధ్యతలు నిర్వహించిన కె. పుష్ప పోస్టింగ్‌ను రద్దు చేస్తూ తాజా ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణ, అంతర్రాష్ట్ర అక్రమ రవాణాపై మరింత దృష్టి పెట్టేలా ఈ మార్పులు చేసినట్లు తెలుస్తోంది.

**విజిలెన్స్, ఆక్టోపస్, హైడ్రాలో నియామకాలు**

టి. సాయి మనోహర్‌ను అవినీతి నిరోధక శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా నియమించారు. డి. శ్రీనివాస్‌ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలో పోలీసు సూపరింటెండెంట్‌గా నియమించారు. విజిలెన్స్‌లో పనిచేస్తున్న ఎం. శ్రీనివాస్ రావును ఆక్టోపస్ విభాగానికి బదిలీ చేస్తూ పోలీసు సూపరింటెండెంట్‌గా నియమించారు.

**తక్షణమే బాధ్యతలు స్వీకరించాలి**

ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం బదిలీ అయిన అధికారులను వెంటనే ప్రస్తుత స్థానాల నుంచి రిలీవ్ చేసి కొత్త పోస్టింగ్ ప్రాంతాల్లో ఆలస్యం లేకుండా బాధ్యతలు స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌ను హోం శాఖ ఆదేశించింది. పరిపాలనా అవసరాలు, ఖాళీల భర్తీ, కీలక విభాగాల సామర్థ్యాన్ని పెంచడం, నేర నియంత్రణను మరింత సమర్థవంతంగా అమలు చేయడమే ఈ భారీ పునర్వ్యవస్థీకరణ ప్రధాన లక్ష్యంగా అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

తీవ్రవాద నిరోధక చర్యలను మరింత బలోపేతం చేసే దిశగా ఈ మార్పులు కీలకంగా భావిస్తున్నారు.

**టీజీపీఎస్సీ, హైడ్రాకు అధికారుల కేటాయింపు**

సీఐడీలో పనిచేస్తున్న కె. ప్రసాద్ సేవలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు కేటాయిస్తూ అక్కడ ఎస్పీగా నియమించారు. డి. ఆనంద్ కుమార్‌ను హైడ్రా అదనపు కమిషనర్‌గా నియమిస్తూ కమిషనర్ పరిధిలో సేవలు అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు వంటి అంశాల్లో హైడ్రా పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో ఈ పోస్టింగ్ ప్రాధాన్యం సంతరించుకుంది. సాంకేతిక విభాగంలో పనిచేస్తున్న డి. కిషన్ సింగ్‌ను వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో నేర విభాగం డీసీపీగా నియమించారు. వరంగల్ నగరంలో నేరాల నియంత్రణ, దర్యాప్తు వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ నియామకం దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

# తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కారే లక్ష్యం.



- వరంగల్ బూత్ అధ్యక్షుల సమ్మేళనంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ దిశానిర్దేశం

**వరంగల్, మహా :** గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి, కుటుంబ పాలనలో తెలంగాణ ప్రజల ఆశలు అడుగంటాయని.. ఎన్నో హామీలతో వచ్చిన ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ సైతం ప్రజా సమస్యలను గాలికి వదిలేసి రాజకీయాలకే ప్రాధాన్యమిస్తోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజల సంక్షేమం కంటే తమ స్వంత ప్రయోజనాలకే పెద్దపీట వేశాయని దుయ్యబట్టారు. సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లా వేదికగా జరిగిన బీజేపీ బూత్ అధ్యక్షుల సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నితిన్ నబిన్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే రాహుల్ గాంధీ లాంటి వాళ్లు 'పార్ట్ టైమ్' రాజకీయ నాయకులని, 24 గంటలు ప్రజల కోసం శ్రమించే బీజేపీ కార్యకర్తలే 'ఫుల్ టైమ్' ప్రజా సేవకులని అభివర్ణించారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రం అందిస్తున్న సంక్షేమ ఫలాలను ఇంటింటికీ తీసుకెళ్తూ, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య స్ఫూర్తితో ప్రతి బూత్‌ను బలోపేతం చేస్తూ.. 2028లో తెలంగాణలో 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా కమలదళం సమరశంఖం పూరించాలని ఉద్బోధించారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో 2047 నాటికి 'వికసిత్ భారత్'ను నిర్మించాలన్న లక్ష్యాన్ని కార్యకర్తల శక్తితోనే సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు మోదీ నాయకత్వంపై చూపుతున్న విశ్వాసాన్ని మరింత బలపరుస్తూ, 2028లో రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే బీజేపీ ప్రధాన లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు. జాతీయవాద భావజాలం, భారతీయ సంస్కృతీ విలువల ఆధారంగా తెలంగాణకు కొత్త దిశానిర్దేశం చేస్తామన్నారు. పోరాటాలకు, త్యాగాలకు ప్రతీక అయిన వరంగల్ గడ్డపై నుంచి ప్రసంగించడం గర్వంగా ఉందన్న ఆయన.. ఈ సందర్భంగా హైదరాబాద్‌ను అఖండ భారతదేశంలో విలీనం చేసిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్‌ను, తెలంగాణ సాధన కోసం పోరాడిన వీరులను స్మరించుకున్నారు. తెలంగాణతో బీజేపీకి ఉన్నది కేవలం రాజకీయ బంధం కాదని, అది పోరాటాలు, ప్రజా విశ్వాసంతో పెనవేసుకున్న అనుబంధమని స్పష్టం చేశారు. తెలంగాణకు బీజేపీ కొత్త పార్టీ అని విమర్శించే వారికి ఆయన గట్టి కౌంటర్ ఇచ్చారు. 1980లో బీజేపీ ఆవిర్భావం తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో దేశవ్యాప్తంగా పార్టీ రెండు ఎంపీ స్థానాలు గెలుచుకుంటే, అందులో ఒకటి తెలంగాణ ప్రజలు ఇచ్చినదేనని, ఇది ఇరు పక్షాల మధ్య ఉన్న చారిత్రాత్మక బంధానికి నిదర్శనమని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో బీజేపీ రాజకీయ లాభనష్టాలను బేరీజు వేసుకోలేదని, ప్రజల ఆకాంక్షలను గౌరవించిందని తెలిపారు. పార్లమెంటులో దివంగత సుష్మా స్వరాజ్ బలమైన గొంతుక వినిపించి రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని కొనియాడారు.

రాష్ట్రం ఏర్పడినా ప్రజల కలలు ఇంకా నెరవేరలేదని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని తమ కుటుంబ ప్రయోజనాల కోసం వాడుకుందని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ అవినీతి, వైఫల్యాలపై బీజేపీ నిరంతరం పోరాడిందన్నారు. ఎన్నో హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ప్రజా సమస్యలను గాలికి వదిలేసి రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజల కంటే తమ కుటుంబాలకే పెద్దపీట వేశాయని మండిపడ్డారు. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న ఏకైక ప్రత్యామ్నాయం భారతీయ జనతా పార్టీ మాత్రమేనని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే శక్తి బీజేపీకే ఉందని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే రాహుల్ గాంధీ లాంటి వాళ్లు 'పార్ట్ టైమ్' నాయకులని, కానీ 24 గంటలు ప్రజల కోసం శ్రమించే బీజేపీ కార్యకర్తలు 'ఫుల్ టైమ్' సేవకులని ఆయన అభివర్ణించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల గొంతుకగా నిలవడం, అధికారంలో ఉన్నప్పుడు సమర్థవంతంగా సేవ చేయడమే తమ విధానమన్నారు.

**ప్రతి బూత్ లో..**

ప్రతి బూత్‌లో కమలం వికసించేలా కార్యకర్తలు అహర్నిశలు శ్రమించాలని నితిన్ నబిన్ పిలుపునిచ్చారు. ప్రతి ఇంటికీ వెళ్లి కొత్త ఓటర్లను నమోదు చేయించడంతో పాటు, సమాజంలోని ప్రతి వర్గాన్ని బీజేపీతో మమేకం చేయాలన్నారు. యువత, రైతులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలంటే అది మోదీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. కేంద్రం అమలు చేస్తున్న పథకాలు సామాన్యుల జీవితాల్లో గొప్ప మార్పులు తెచ్చాయని వివరించారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన ద్వారా ఉచిత రేషన్, ఆయుష్మాన్ భారత్ ద్వారా నాణ్యమైన వైద్యం, పీఎం స్వనిధి ద్వారా వీధి వ్యాపారులకు అండ, జన్ ధన్ యోజన ద్వారా అవినీతి రహితంగా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ వంటి విప్లవాత్మక పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మహిళల భద్రత, ఆత్మగౌరవం కోసం దేశవ్యాప్తంగా కోట్లాది మరుగుదొడ్లు నిర్మించామన్నారు. అట్టడుగున ఉన్న చివరి వ్యక్తికి కూడా అభివృద్ధి ఫలాలు అందాలన్నదే మోదీ లక్ష్యమని, "సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్" అనే మంత్రంతో దేశం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తోందని, ఇదే స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ 2028 లక్ష్యంగా ప్రతి కార్యకర్త సమరశంఖం పూరించాలని ఆయన ఉద్బోధించారు.

# తెలంగాణలో బెంగాల్ వ్యూహం

**రంగంలోకి సంఘ్ పరివార్**
**క్షేత్ర స్థాయికి కమల వ్యూహం**



**హైదరాబాద్, మహా :** ఇప్పటిదాకా ఒక లెక్కా ఇకనుంచి మరో లెక్క బీజేపీ తాజా వ్యూహం ఇది. 2028 సార్వత్రిక ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా పని చేస్తున్న ఆ పార్టీ భవిష్యత్ లక్ష్యాన్ని భారీగా ముందు పెట్టుకుని నడవాలని లక్ష్యాంగా పెట్టుకొనుంది. గతానికి భిన్నంగా కొత్త వ్యూహంతో ప్రజాక్షేత్రంలో అడుగు పెట్టేందుకు సన్నద్ధమైంది. రాష్ట్ర స్థాయి కాషాయ దళం నేతలంతా కలిసికట్టుగా ఇక క్షేత్రస్థాయికి వెళ్లి పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా పనిచేయనున్నారు. ఇప్పటి నుంచే టార్గెట్ 2028 ను పూర్తి చేసేందుకు పశ్చిమ బెంగాల్ తరహాలో తెలంగాణ మొత్తం ఆర్ఎస్ఎస్ శ్రేణులను రంగంలోకి దింపేందుకు అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పరివార్ తో పాటు అనుబంధ సంస్థల బలగాలు కూడా అత్యంత కీలకంగా పని చేయనున్నాయి. బెంగాల్లో ఫలించిన రాజకీయ వ్యూహానికి మరింత పదును పెట్టి తెలంగాణాలో అమలు చేయాలన్న అంశంపై రాష్ట్రానికి వచ్చిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హా పార్టీ పదాధికారుల సమావేశంలో మార్గనిర్దేశం చేశారు. ఆయన ఆలోచనల ప్రకారం.. ఉత్తరాధి రాష్ట్రాల నుంచి సంఘ్ పరివార్ తో పాటు అన్ని విభాగాల బృందాలను రాష్ట్రానికి రప్పించి కీలక బాధ్యతలు అప్పగించనున్నారు.

దేశ భద్రత, జాతీయతను కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్), యువతను మేల్కొలిపేందుకు పనిచేస్తున్న 'భజరంగ్ దళ్', ప్రపంచ వ్యాప్తంగా హింధూ ధర్మ పరిరక్షణ, ప్రచార బాధ్యతలను భుజానెత్తుకుని పని చేస్తున్న 'విశ్వహిందూ పరిషత్', విదేశీ వస్తువులను బహిష్కరించి దేశ ఆర్థిక వ్యవస్థను సుస్థిర పరిచేందుకు పనిచేస్తున్న 'స్వదేశీ జాగరణ్ మంచ్', ప్రారిశ్రామిక రంగాభివృద్ధికి పనిచేస్తున్న 'లఘు ఉద్యోగ్ భారతి', గిరిజనుల సంక్షేమం, వారి అభివృద్ధి కోసం పనిచేస్తున్న 'వనవాసి కళ్యాన్ ఆశ్రమం', ఆర్ఎస్ఎస్ తరహాలోనే మహిళల కోసం ప్రత్యేకంగా పనిచేస్తున్న 'రాష్ట్రీయ సేవికా సమితి', పాఠశాల విద్యా వ్యవస్థను జాగృతం చేస్తున్న 'విద్యా భారతి' సంస్థలకు చెందిన ప్రత్యేక బృందాలు ప్రతి నెలలో రెండు పర్యాయాలు తెలంగాణాలోని అన్ని జిల్లాల్లో పర్యటించనున్నాయి. స్థానిక పరిస్థితులను, పరిణామాలను, పార్టీ బలాబలాలను అంచనా వేసి ఎప్పటికప్పుడు ఆర్ఎస్ఎస్ ద్వారా బీజేపీ అధిష్టానానికి అందజేయనున్నారు. అలాగే నాయకుల మధ్య సమన్వయ లోపం, అందుకు గల కారణాలు, సమస్యల పరిష్కారానికి అనుసరించాల్సిన మార్గాలను అధిష్టానం సూచించనుంది. అదే సమయంలో బీజేపీకి అనుబంధంగా పనిచేస్తున్న విద్యార్థి విభాగం బృందాలు రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ప్రస్తుత రాజకీయాల్లో విద్యార్థుల అవసరం, ప్రమేయాన్ని గుర్తు చేయనున్నాయి. రాజకీయ విశ్లేషకుల అంచనా ప్రకారం.. 2028 సార్వత్రిక ఎన్నికల్లో భావి భాగస్వామ్యం అత్యంత క్రియాశీలకం కానుంది.

కార్మిక రంగాన్ని మేల్కొలిపి వారి హక్కులను పరిరక్షించే దిశగా 'బీజేపీకి మరో అనుబంధ సంస్థ 'భారతీయ మజూర్ సంఘ్ పరివార్ పనిచేయనుంది. వ్యవసాయ రంగాభివృద్ధికి కేంద్రం అందిస్తున్న చేయూత, దేశ నిర్మాణంలో రైతులు భాగస్వామ్యంపై అవగాహన కల్పించి వారిని రాజకీయాల్లో క్రియాశీలకం చేసేందుకు 'భారతీయ కిసాన్ సంఘ్' రాజకీయ చదరంగంలోకి దిగనుంది. జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆలోచనల మేరకు అంతర్గతంగా పక్కా ప్రణాళికతో బీజేపీ రాజకీయ వ్యూహాన్ని రచిస్తోందని, దాని అమలు తర్వాత తమ పార్టీని తట్టుకోవడం కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు సాధ్యం కాదన్న ధీమా ముఖ్య నేతల నుంచి వ్యక్తమవుతోంది. ఆ ప్రణాళిక ప్రకారం.. ముందుగా రాష్ట్రమంతటా గ్రామ స్థాయి వరకూ కమిటీలను బలోపేతం చేయనున్నారు. బెంగాల్ లో బలంగా పాగా వేసిన టీఎంసీని దీకొన్న మాదిరిగా తెలంగాణాలో తయారువాల్లన్నది బీజేపీ వ్యూహం. వచ్చే పరిషత్, గ్రేటర్ ఎన్నికల్లో బల నిరూపణకు కసరత్తు చేసి బలాన్ని నిరూపించుకోనున్నారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాల వ్యూహాలకు, ఆలోచనలకు భిన్నంగా ఈ రెండు ఎన్నికల్లో ధీటైన పోటీ ఇవ్వనున్నారు. కేంద్ర ప్రతిపాదిత పథకాలే ప్రచారాస్త్రంగా, ప్రధాన అజెండా పార్టీ యంత్రాంగమంతా పనిచేయనుంది. ప్రాదేశిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కూడా త్వరలోనే ప్రారంభం కానుంది. సంస్థాగత సమస్యలు, సవాళ్లు సమసిపోవాలంటే క్షేత్రస్థాయిలో కార్యకర్తల మనోభీష్టం మేరకు నిర్ణయాలు జరగాలని జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ రాష్ట్ర పదాధికారులకు గత రెండు రోజులుగా దిశానిర్దేశం చేస్తూ వస్తున్నారు. ఆ ప్రకారం వారం, పది రోజుల్లోగా తెలంగాణ బీజేపీ రాజకీయ కార్యాచరణ సిద్ధం కామన్నదని తెలుస్తోంది.

**మూల సిద్ధాంతం ఆదారంగా**

జాతి ఐక్యత, హిందూత్వ వాదం ప్రత్యేక నినాదాలుగా జాతీయ స్థాయిలో పార్టీని బలోపేతం చేసే దిశగా చర్యలు వేగవంతం చేసిన భారతీయ జనతా పార్టీ తెలంగాణాలోనూ బల నిరూపణకు సంసిద్ధమవుతోంది. త్వరలోనే మొదలు కాబోతున్న పరిషత్, గ్రేటర్ ట్రై కార్పొరేషన్ల ఎన్నికలలు, వరంగల్ కార్పొరేషన్ సమరంలో బలమైన లక్ష్యంతో కదం తొక్కాలని అధినాయకత్వం నిర్ణయించింది. అందుకోసం 'కమలం' పార్టీ కొత్త వ్యూహాన్ని ఖరారు చేసుకుని గ్రామ గ్రామాన ఉనికిని చాటుకునే దిశగా ముందడుగు వేయబోతోంది. పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు రాంచందర్రావు నేతృత్వంలో ఎంపీలు, ఎమ్మెల్యేల సమన్వయంతో త్వరలోనే సమావేశమై క్షేత్రస్థాయి కార్యాచరణను ఖరారు చేయనున్నారు. గడిచిన కొద్ది రోజులుగా ఇందుకు సంబంధించిన కసరత్తు వేగవంతమైంది. జాతీయ పార్టీగా దేశమంతా అనుసరిస్తున్న వ్యూహానికి భిన్నంగా తెలంగాణాలో 'సంక్షేమంలో సగం.. అభివృద్ధిలో భాగం' అన్న నినాదంతో సామాజిక అభివృద్ధిలో, పేదరిక నిర్మూలనలో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యాన్ని ప్రజలకు వివరిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించే దిశగా వ్యూహంతో కమలనాధులు కదం తొక్కబోతున్నారు.

## సామాన్యులే లక్ష్యంగా

గ్రామ పంచాయతీ, ప్రాదేశిక ఎన్నికలకు సమయంలోనూ తాను సైతం అంటూ బల నిరూపణకు ప్రయత్నించిన బీజేపీ పరిషత్, గ్రేటర్ ఎన్నికల్లో లక్ష్య సాధనకు నడుం బిగిస్తోంది. సమయం సమీపిస్తున్న తరుణంలో రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు భిన్నంగా, ధీటుగా వారం, పది రోజుల్లోగా క్షేత్రస్థాయిలో కాషాయ దళం కదం తొక్కనుంది. మెజారిటీ కుటుంబాలకు వర్తిస్తున్న ప్రతి సంక్షేమ పథకానికీ కేంద్ర సర్కారు ఆర్థిక చేయూత అందిస్తున్న తీరును పేద, మధ్యతరగతి వర్గాలకు అర్థమయ్యే రీతిలో వివరిస్తే.. ఇప్పుడున్న ఓటు బ్యాంకును దాదాపు రెండింతలు పెంచుకోవచ్చున్న కోణంలో బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల కార్యాచరణ ప్రణాళికను సంసిద్ధం చేసింది. అదే నినాదంతో నినాదంతో భాజపా శ్రేణులంతా ప్రజల్లోకి వెళ్లడం ద్వారా కనీసం పది శాతం పంచాయతీలైనా కైవసం చేసుకోవాలన్న లక్ష్యంతో రాష్ట్ర నాయకత్వం ఉంది. దీంతో పాటు గతంలో ఎన్నడూ లేని విధంగా పార్టీకి అనుబంధంగా పనిచేస్తున్న వివిధ కార్మిక, యువజన, విద్యార్థి సంఘాలు, ధార్మిక సంస్థల పాత్ర క్రియాశీలకం చేయబోతున్నారు.

**ఇంటింటి ప్రచారం**

గ్రామ స్థాయిలో ప్రతి ఇంటికీ ఎంతో కొంత ప్రయోజనం చేకూరుస్తున్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత సంక్షేమ పథకాలు, కార్యక్రమాలపైనే ప్రధానంగా బీజేపీ నేతలు దృష్టి కేంద్రీకరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం ప్రతి కిలో ఒక్కింటికి కేంద్ర ప్రభుత్వం రూ.29 చొప్పున చెల్లిస్తున్న విషయాన్ని ప్రజలకు వివరించనున్నారు. అలాగే ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద పేదల సొంతింటి నిర్మాణానికి ఒక్కో యూనిట్కు రూ.3.50 లక్షల చొప్పున ఇస్తున్న విషయాన్ని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఇస్తున్న నిధులు, గ్రామ పంచాయతీలకు, మునిసిపాలిటీలకు రోజ్ గార్ పథకం కింద ఇస్తున్న గ్రాంట్ నిధులు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఇస్తున్న నిధులు, గ్రామీణ సడక్ యోజన పథకం కింద రహదారుల అభివృద్ధి, గడిచిన ఐదేళ్లలో దాదాపు 4వేల కిలోమీటర్ల జాతీయ రహదారుల విస్తరణ, పాలమూరు వరక్సిటీకి రూ.100 కోట్లు, తెలంగాణ వర్సిటీకి రూ.50 కోట్లు, ఇతర యూనివర్సిటీలకు ఇస్తున్న యూజీసీ గ్రాంటు నిధులు, యువజనోపాధికి ఇస్తున్న చేయూత ఇతర పథకాల ద్వారా రాష్ట్రం ప్రత్యక్ష్యంగా, పరోక్షంగా పొందుతున్న ప్రయోజనాల గురించి ప్రజలకు వివరించి విస్తృత ప్రచారం నిర్వహించడమే లక్ష్యంగా బీజేపీ రాష్ట్ర నాయకత్వం సంసిద్ధమవుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బీసీ రిజర్వేషన్లు, తదితర అంశాలపై తాజాగా చర్చించిన రాష్ట్ర మంత్రివర్గం, ఏ క్షణమైనా ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్న క్రమంలో బీజేపీ క్రియాశీలకమయ్యేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకోవడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రేటర్ హైదరాబాద్ పురపాలక సంస్థల ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న క్రమంలో ఈ ఎన్నికల్లో సత్తా చాటి రానున్న రోజుల్లో మరింత పట్టు సాధించేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకోవాలని అధిష్టానం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఎన్నికల్లో బలమైన పట్టు సాధించేందుకు అన్ని కోణాల్లో తిప్పలు పడుతోంది. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోగా రాష్ట్రంలో పార్టీని పటిష్టం చేసేందుకు అడుగులు వేస్తోంది. పార్టీ బలోపేతం కావాలంటే ప్రధానంగా క్షేత్రస్థాయిలో నేతలు, కార్యకర్తలను తయారు చేసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో బీజేపీ స్థానిక సంస్థలైన గ్రామపంచాయతీ, మండల, జిల్లా పరిషత్, మునిసిపాలిటీల్లో కేడర్ను సుస్థిరం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది.



# ముంబై వెళ్ళిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

**భుజాల గాయాలతో ఇబ్బందులు.**

హైదరాబాద్, మహా : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. గత కొంతకాలంగా రెండు భుజాల్లో తీవ్ర నొప్పితో పాటు రొటేటర్ కఫ్ కండరాల గాయాలతో బాధపడుతున్న ఆయన, వైద్య పరీక్షల నిమిత్తం ముంబై చేరుకున్నారు. అక్కడి ప్రముఖ కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో నిపుణులైన ఆర్థోపెడిక్ వైద్యులను కలిసి సమగ్ర పరీక్షలు చేయించుకోనున్నారు. పవన్ కళ్యాణ్ వెంట ఆయన సతీమణి అన్నా కొణిదెల కూడా ముంబై వెళ్లారు. గతంలో శస్త్రచికిత్స అనంతరం కోలుకుంటున్న నేపథ్యంలో ఇప్పుడు వైద్యుల తాజా పరీక్షలకు ప్రాధాన్యత ఏర్పడింది. పవన్ కళ్యాణ్ గత కొంతకాలంగా రెండు భుజాలకు సంబంధించిన రొటేటర్ కఫ్ కండరాల సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. భుజాల కదలికల్లో నొప్పి, చేతులను పైకి ఎత్తడంలో ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో నిపుణుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. ప్రస్తుతం గాయం తీవ్రత, కండరాల పరిస్థితి, కోలుకునే పురోగతిని అంచనా వేయడానికి సమగ్ర పరీక్షలు నిర్వహించనున్నట్లు సమాచారం.

## మూడు నెలల్లో ఎన్నికలు రావొచ్చు

**డీఎంకే శ్రేణులకు స్టాలిన్ పిలుపు**

**చెన్నై, మహా :** తమిళనాడులో రాజకీయ పరిణామాలు వేగంగా మారే అవకాశం ఉందని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అన్నారు. మరో ఐదేళ్లు ఎదురుచూడాల్సిన అవసరం లేదని, మూడు నెలలు లేదా ఆరు నెలల్లో ఎన్నికలు రావొచ్చని పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశారు. ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. చెన్నైలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాజీ మంత్రి బెంజమిన్తో పాటు పలువురు ఏఐఏడీఎంకే నేతలు, కార్యకర్తలు డీఎంకేలో చేరారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న టీవీకే ప్రభుత్వానికి సొంతంగా మెజారిటీ లేదన్నారు. 118 సీట్ల మెజారిటీ అవసరం కాగా ఆ పార్టీకి 108 స్థానాలే వచ్చాయని గుర్తు చేశారు.

ప్రస్తుతం ప్రభుత్వం ఇతర పార్టీల మద్దతుతోనే కొనసాగుతోందన్నారు. ఇటీవల వరకు డీఎంకే కూటమిలో ఉన్న కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతుతోనే ప్రభుత్వం నడుస్తోందని చెప్పారు. అలాంటి ప్రభుత్వం ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేమన్నారు. ఎప్పుడు కూలిపోతుందో తెలియదని వ్యాఖ్యానించారు.





# రాజ్యసభలో కొత్త సభ్యుల ప్రమాణ స్వీకారం.

రాజ్యసభలో కొత్త సభ్యుల ప్రవేశంతో పార్లమెంట్ లో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత తరుణ్ చుగ్తో పాటు ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన మరో ఆరుగురు సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యసభ చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికార, ప్రతిపక్ష పార్టీల ప్రముఖులు పాల్గొని కొత్త సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే రాజ్యసభ చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ ఛాంబర్లో ప్రత్యేకంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన చేతిలో భారత రాజ్యాంగ ప్రతిని పట్టుకుని హిందీ భాషలో ప్రమాణం చేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం చైర్మన్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి సభలో విజయవంతమైన పదవీకాలాన్ని ఆకాంక్షించారు.ఖర్గేతో పాటు భారతీయ జనతా పార్టీ నేత తరుణ్ చుగ్, గుజరాత్కు చెందిన జితేంద్ర మేఘ్జీభాయ్ కంజారియా, మాన్సింగ్ ్మెరమాన్ పర్మార్, కర్ణాటకకు చెందిన ఎం. నాగరాజా, మహారాష్ట్రకు చెందిన రాజేంద్ర హీరాలాల్ జైన్, మణిపూర్కు చెందిన అధికారమయుమ్ శారదా దేవి, రాజస్థాన్కు చెందిన అల్కా సింగ్ రాజ్యసభ ఛాంబర్లో ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్ సమక్షంలో సభ్యులందరూ రాజ్యాంగబద్ధంగా తమ బాధ్యతలను నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్, సభ నాయకుడు జె.పి. నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ హాజరయ్యారు. వీరు చైర్మన్ ఛాంబర్లో జరిగిన కార్యక్రమంతో పాటు రాజ్యసభ సభాగృహంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార వేడుకలో కూడా పాల్గొన్నారు.

మల్లికార్జున్ ఖర్గే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్పర్సన్ సోనియా గాంధీ, లోక్సభ సభ్యురాలు ప్రియాంక గాంధీ వాద్రా హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం ఖర్గేకు శుభాకాంక్షలు తెలియజేస్తూ కొత్త బాధ్యతల్లో విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

రాజ్యసభ చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ కొత్తగా ఎన్నికైన సభ్యులను సభలోకి ఆహ్వానిస్తూ అభినందనలు తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సభలో చర్చలు జరపాలని, చట్టాల రూపకల్పనలో నిర్మాణాత్మక పాత్ర పోషించాలని సూచించారు. వివిధ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కొత్త సభ్యుల రాకతో రాజ్యసభ కార్యకలాపాలకు మరింత బలం చేకూరుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## రూ. 4 లక్షల కోట్ల ఫేక్ మార్కెట్

**సీక్రెట్ ఏజెంట్లను ప్రయోగిస్తున్న బ్రాండ్లు**

**హైదరాబాద్, మహా :** అంతర్జాతీయ లగ్జరీ బ్రాండ్లు భారత్లో భారీగా విస్తరించిన నకిలీ వస్తువుల మార్కెట్ పై ఉక్కుపాదం మోపుతున్నాయి. వెర్సాచీ, మైఖేల్ కోర్స్, జిమ్మీ చూ వంటి ప్రఖ్యాత కంపెనీలు నకిలీ సరుకును అరికట్టేందుకు రహస్య ఇన్వెస్టిగేటర్లను నియమించుకుంటున్నాయి. వీరు సాధారణ కస్టమర్ల రూపంలో మార్కెట్లలోకి వెళ్లి, నకిలీ వస్తువులను విక్రయించే వారి సమాచారాన్ని సేకరించి కంపెనీలకు అందిస్తున్నారు.

ఈ సమాచారం ఆధారంగా సదరు బ్రాండ్లు పోలీసుల సాయంతో దాడులు నిర్వహించి, నకిలీ సరుకును స్వాధీనం చేసుకుని, చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాయి. గతనెలలో వెర్సాచీ కంపెనీకి ఓ ఇన్వెస్టిగేటర్ ఇచ్చిన సమాచారంతో తూర్పు ఢిల్లీలోని ఓ బల్క్ సెల్లర్పై పోలీసులు దాడి చేశారు. నగరంలోని పలు దుకాణాలకు నెలనెలా లక్షల రూపాయల విలువైన నకిలీ సరుకును సరఫరా చేస్తున్న అతడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, స్టాక్ను సీజ్ చేశారు. భారత్లో అసలైన లగ్జరీ మార్కెట్ విలువ 6 నుంచి 8 బిలియన్ డాలర్లు కాగా, 2028 నాటికి ఇది 12 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా. అయితే, దీనికి భిన్నంగా నకిలీ దుస్తులు, యాక్సెసరీల మార్కెట్ విలువ సుమారు రూ. 4 లక్షల కోట్లు ఉంటుందని 2024 ఫిక్కీ నివేదిక పేర్కొంది. రోడ్ల పక్కన అమ్మకాల నుంచి ఆన్లైన్ వేదికల ద్వారా వ్యవస్థీకృత నెట్ వర్క్గా ఈ దందా విస్తరించింది. బ్రాండ్లు తీసుకుంటున్న ఈ చర్యలను న్యాయ నిపుణులు స్వాగతిస్తున్నారు.



# బంగాళాఖాతంలో భారత్కు డబుల్ టెన్షన్

**చైనా, పాక్ల కొత్త వ్యూహం**

**మహా :** బంగాళాఖాతంలో భారత నౌకాదళానికి కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. పాకిస్థాన్ నౌకాదళంలోకి కొత్తగా చేరిన అత్యాధునిక సబ్మెరైన్ 'పీఎన్ఎస్ హ్యాంగోర్' ఈ ప్రాంతంలో సంచరించడం, అదే సమయంలో బంగ్లాదేశ్లో చైనా నిర్మించిన 'బీఎన్ఎస్ పెకువా' నౌకా స్థావరం సిద్ధమవడం భారత్కు భద్రతాపరంగా ఆందోళన కలిగిస్తోంది. ఈ రెండు పరిణామాలు కలిసి భారత తూర్పు తీరంలో వ్యూహాత్మక ఒత్తిడిని పెంచుతున్నాయి. చైనా సహకారంతో నిర్మించిన పీఎన్ఎస్ హ్యాంగోర్, పాకిస్థాన్కు అప్పగించిన 8 జలాంతర్గాములలో మొదటిది. ఇందులో ఉన్న ఎయిర్ఇండిపెండెంట్ ప్రొపల్షన్ వ్యవస్థ వల్ల, బ్యాటరీలను రీఛార్జ్ చేయడానికి ఉపరితలానికి రాకుండానే మూడు వారాల పాటు నీటి అడుగున ఉండగలదు. ఇటీవల కరాచీలో నౌకాదళంలో చేరిన ఈ సబ్మెరైన్, శ్రీలంకలోని కొలంబోను సందర్శించి బంగాళాఖాతంలోకి తిరిగి వచ్చింది. మరోవైపు, బంగ్లాదేశ్లోని కాక్స్ బజార్ సమీపంలో చైనా నిర్మించిన బీఎన్ఎస్ పెకువా నౌకా స్థావరం కూడా ఆందోళనలకు కేంద్ర బిందువుగా మారింది. ఈ స్థావరంలో 8 యుద్ధ నౌకలు, 6 జలాంతర్గాములను నిలిపే సామర్థ్యం ఉంది. బంగ్లాదేశ్ వద్ద కేవలం రెండు సబ్మెరైన్లే ఉన్న నేపథ్యంలో, ఈ స్థావరాన్ని చైనా, దాని మిత్ర దేశాల నౌకలు ఉపయోగించుకుంటాయని స్పష్టమవుతోంది. "చైనా, పాకిస్థాన్ యుద్ధనౌకలు ఇక్కడకు వస్తే భారత్ ఏమీ చేయలేదు. వాటిని పర్యవేక్షించేందుకు అదనపు బలగాలను మోహరించాల్సి వస్తుంది" అని భారత నౌకాదళానికి చెందిన ఓ రిటైర్డ్ వైస్ అడ్మిరల్ అభిప్రాయపడ్డారు

# ఎన్నికల వ్యవస్థలో భారత్ ముందంజలోనే ఉంది

**ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్.**

**ఢిల్లీ, మహా :** ప్రపంచంలో ఎన్నికలు నిర్వహించే దేశాల్లో భారతదేశం అత్యంత విశ్వసనీయమైన ప్రజాస్వామ్య దేశంగా నిలిచిందని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు. పారదర్శకత, నిష్పక్షపాత విధానం, సాంకేతికత వినియోగం, క్షేత్రస్థాయి సిబ్బంది సమర్థత కారణంగానే భారత ఎన్నికల వ్యవస్థ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా మారిందని ఆయన అన్నారు. జమ్మూకశ్మీర్లోని బుద్గాంలో బూత్ స్థాయి అధికారులతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

భారత ఎన్నికల నిర్వహణ విధానం ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోందని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. ఓటర్ల నమోదు నుంచి పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటింపు వరకు ప్రతి దశ కూడా పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని చెప్పారు. ఎన్నికల ప్రక్రియలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి ప్రతినిధులు ప్రతి అంశాన్ని స్వయంగా పరిశీలించే అవకాశం ఉండటం భారత ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతను మరింత పెంచిందని వివరించారు.

ప్రజాస్వామ్య వ్యవస్థ విజయవంతంగా కొనసాగడంలో బూత్ స్థాయి అధికారుల పాత్ర అత్యంత కీలకమని సీఈసీ అన్నారు. దేశవ్యాప్తంగా కోట్లాది ఓటర్ల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించడం, పోలింగ్ కేంద్రాల నిర్వహణ, ఓటర్లకు అవసరమైన సమాచారం అందించడం వంటి బాధ్యతలను వారు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఎన్నికల విజయానికి వారి అంకితభావమే ప్రధాన కారణమని పేర్కొన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థల అభివృద్ధికి కృషి చేసే అంతర్జాతీయ సంస్థ ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ డెమోక్రసీ అండ్ ఎలక్టోరల్ అసిస్టెన్స్కు 2026 సంవత్సరానికి భారత్ అధ్యక్షత వహించడం దేశ ఎన్నికల వ్యవస్థకు దక్కిన అంతర్జాతీయ గౌరవానికి నిదర్శనమని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భారత అనుభవాన్ని అనేక దేశాలు అధ్యయనం



చేస్తున్నాయని చెప్పారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ మూడు రోజుల పాటు జమ్మూకశ్మీర్లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా బుద్గాంలోని ఫ్యాషన్ టెక్నాలజీ కళాశాల ప్రాంగణంలో బూత్ స్థాయి అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఎన్నికల సిబ్బంది, ఓటర్లతో నేరుగా సమావేశమై వారి అభిప్రాయాలు తెలుసుకోనున్నారు. ఎన్నికల నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్లను ప్రత్యక్షంగా పరిశీలించి అవసరమైన సూచనలు ఇవ్వనున్నారు.

ఓటర్లతో ఎన్నికల సంఘం అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడం, ఓటరు జాబితాల నాణ్యతను పెంచడం, ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, ఎన్నికలపై ప్రజల్లో అవగాహన పెంచడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు.

అత్యంత విస్తారమైన భౌగోళిక పరిస్థితులు, కోట్లాది ఓటర్లు, లక్షలాది పోలింగ్ కేంద్రాల మధ్య కూడా ఎన్నికలను శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించగల సామర్థ్యం భారత ఎన్నికల సంఘం ప్రత్యేకతగా నిలిచిందని సీఈసీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ఎన్నికల నిర్వహణలో భారతదేశం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందని ఆయన స్పష్టం చేశారు.

# కమలం.. కలలు...



కలలు మనిషికి సర్వ సాధారణం. కొన్ని కలలు సంతోషం కలిగిస్తాయి. కొన్ని ఆందోళనకు కారణం అవుతాయి. ఇంకొన్ని అద్భుతమైన అనుభూతిని అందిస్తాయి. మరి కొన్ని ఆశ్చర్యానికి గురి చేస్తాయి. కలలు కనండి..వాటిల్లో అద్భుతమైన కలలను నిజం చేసుకునే దిశగా అడుగులు వేయండి అంటూ మాజీ రాష్ట్రపతి, దివంగత అబ్దుల్ కలాం అన్నారు. భవిష్యత్ కు బంగారుబాటలు వేసే కలలు వస్తే వాటిని సాధించే ప్రయత్నం చేయాలన్నది అబ్దుల్ కలాం మాటల్లోని సారాంశం. కలాం మాటలు యువత ఎంత మేరకు చెవికెక్కించుకున్నారో తెలీదు కానీ బీజేపీ లీడర్లు మాత్రం ఇప్పుడు ఆయనను గట్టిగానే ఫాలో అవుతున్నట్టు కనిపిస్తోంది. 2014 లో నరేంద్ర మోడీ ప్రధాని అయ్యారు. మరో సీనియర్ బీజేపీ లీడర్ అమిత్ షా కేంద్ర మంత్రి అయ్యారు. ఈ ఇద్దరు ఓ మహోత్తర బాధ్యతలే తీసుకొని దాన్ని అమలు చేస్తూ వచ్చారు. అదే యావత్తు దేశంలో బీజేపీ అధికారంలోకి తేవటం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉత్తరాదిలో నూటికి నూరు శాతం సక్సెస్ అయ్యారు. 125 సంవత్సరాలనుండి దేశంలో తిరుగు లేని శక్తిగా ఎదిగిన కాంగ్రెస్ పార్టీకి బీజేపీ పక్కలో బల్లెంగా మారిపోయింది. కాంగ్రెస్ ప్రాబల్యం వున్న రాష్ట్రాలు కూడా బీజేపీ ఖాతాలో చేరిపోయాయి. ఉత్తరభారత్ లో కాంగ్రెస్ ఉనికి కష్టంగా మారింది. మోడీ, అమిత్ షా వ్యూహాలకు ఉత్తరాదిలో కాంగ్రెస్ కష్టాల్లో పడింది. ఓ దశలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ కూడా బీజేపీ చేతిలో ఓటమి చవి చూడాల్సి వచ్చింది. ఎన్నికల వ్యూహ రచనలో మోడీ, అమిత్ షా ద్వయం దెబ్బను తట్టుకోవటం రాజకీయ మహా మహులకే ఓ అగ్ని పరీక్ష అయింది. ఏ ఎన్నికలు వచ్చినా బీజేపీ సునాయాస విజయం విపక్షాలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. నార్త్ లో బీజేపీ ఎన్నికల ఎత్తుగడ విజయవంతమైంది. ఇక ఇప్పుడు బీజేపీ అగ్రనేతల చూపులు దక్షిణ రాష్ట్రాల వైపు మళ్ళింది. కర్ణాటకలో బీజేపీ కాస్త బలంగానే కనిపిస్తోంది. ఇక తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మాత్రం బీజేపీ ఆశించిన స్థాయిలో పుంజుకోలేదు. ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి కలయిక నేపథ్యంలో ఇక్కడ బీజేపీకి ఇబ్బంది లేదు. ఇక కేరళ, తమిళనాడు, తెలంగాణ పైన పట్టు కోసం బీజేపీ పథక రచన సాగిస్తోంది. ప్రధానంగా తెలంగాణలో పాగా వేయాలి అనేదే బీజేపీ తదుపరి లక్ష్యం. ఆ దిశగా పావులు కదుపుతోంది. తెలంగాణలో బీజేపీ బలోపేతం కోసం ఇప్పటికే రాష్ట్ర బీజేపీ నేతలకు మోడీ, అమిత్ షా దిశానిర్దేశం చేశారు. అయినా అది ఆచరణలో అంతగా ఫలితం ఇవ్వట్లేదు. క్షేత్ర స్థాయి నుంచి బీజేపీని తిరుగులేని శక్తిగా మార్చే ప్రణాళికలో భాగంగా బూత్ స్థాయి కమిటీలు కూడా వేశారు. ఇది కమిటీల వరకే పరిమితం అయింది. ప్రజల్లోకి బీజేపీ దూసుకుపోయే పరిస్థితి రాలేదు. తెలంగాణలో బీజేపీని దీటుగా ముందుకు నడిపించే నాయకత్వం లేక పోవటం కూడా ఇక్కడ బీజేపీకి సవాల్ గా మారింది అనేది రాజకీయ నిపుణుల అంచనా.

తెలంగాణలో బీజేపీకి ఎనిమిది మంది ఎంపీ.లు ఉన్నారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు వున్నారు. ఎమ్మెల్యేల మాట ఎలా వున్నా సికింద్రాబాద్ ఎంపీ కిషన్ రెడ్డి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కేంద్ర మంత్రులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గెడం రమేష్, ధర్మపురి అరవింద్, ఎం. రఘునందన్, ఈటెల రాజేందర్, కొండా విశవేశ్వర్ రెడ్డి, డి. కె. అరుణ ఎం, పీలుగా వ్యవహరిస్తున్నారు. వీరిలో కొంతమందికి జిల్లాల వరకే పట్టు వుంది. ఇంకొందరికి నియోజకవర్గం వరకే బలం వుంది. వీరు రాష్ట్రం మొత్తం మేనేజ్ చేసే పరిస్థితి లేదు. ఇక కిషన్ రెడ్డి, ఈటెల రాజేందర్, బండి సంజయ్ లకు మాత్రమే తెలంగాణలో గట్టి గుర్తింపు వుంది. బీజేపీ సీనియర్ లీడర్ డాక్టర్ లక్ష్మణ్ పేరు తెలంగాణలో సుపరిచితమే అయినా ఆయన మాస్ లీడర్ కాదన్నది అందరి అభిప్రాయం. తెలంగాణ బీజేపీకి సారధ్యం వహిస్తున్న రాంచంద్రరావు విద్యా వంతులు. పేరున్న న్యాయవాది. సుధీర్ఘకాలంగా బీజేపీలో కొనసాగుతున్న లీడర్. ఆయన కూడా క్లాస్ లీడర్ క్యాడర్ లోనే ఉండిపోయారు అంటారు రాజకీయ పరిశీలకులు. ఇదే ఇప్పుడు బీజేపీకి తెలంగాణలో వచ్చి పడిన ఇబ్బంది. తెలంగాణలో సీనియర్ బీజేపీ లీడర్లకు కొదువ లేదు. బండారు దత్తాత్రేయ, ఇంద్రసేనారెడ్డి, సీహెచ్ విద్యాసాగర్ రావు లాంటి గొప్ప లీడర్లు వున్నారు. వీరికి తెలంగాణ పైన పట్టు వుంది. అయితే ఇప్పుడు వీరిపై వయో భారం పడింది. ఇప్పుడు తెలంగాణలో బీజేపీ లీడర్లు అంటే కిషన్ రెడ్డి, బండి సంజయ్, డాక్టర్ లక్ష్మణ్, ఈటెల రాజేందర్ అనేది మాత్రమే క్షేత్ర స్థాయి ప్రజలకు తెలుసు. మిగితా వారి పేర్లు విన్నా ప్రజలు వారిని పెద్దగా గుర్తు పట్టే అవకాశం అంతగా లేదు అన్నది నిజం. తెలంగాణలో బీజేపీకి కలిసి వచ్చిన కాలం లేక పోలేదు. పార్టీ అంచనాలకు భిన్నంగా అసెంబ్లీ ఎన్నికల్లో కొందరు బీజేపీ అభ్యర్థులు గెలిచారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఆశించిన దాని కన్నా ఎక్కువ సీట్లు బీజేపీకి వచ్చాయి. కాంగ్రెస్, టీఆర్ఎస్ లను దెబ్బ కొట్టి నెగ్గుకు వచ్చిన బీజేపీ నేతలు ఇప్పుడు ఆ పార్టీకి జీవనాడులు.తెలంగాణలో రాజకీయ పరిస్థితి వేరు. ఇక్కడ కుల, మత రాజకీయాలు అంతగా ప్రభావం చూపవు. ఇక తెలంగాణ ప్రజలు ఎన్నికల్లో పలు మార్లు భిన్నమైన తీర్పును ఇచ్చి సంచలనం కూడా రేపారు. ఇక ఇప్పుడు తెలంగాణలో బీజేపీ జెండా ఎగుర వేయాలని ఆ పార్టీ అధిష్టానం ప్రయత్నం మొదలు పెట్టింది. బెంగాల్ ఎన్నికలు ఆధారంగా చేసుకొని తెలంగాణలో అధికార పీఠం ఎక్కే మాస్టర్ ప్లాన్ తో ఆ పార్టీ అగ్ర నాయకత్వం అడుగులు వేస్తోంది. మోడీ, అమిత్ షా సూచనలు, బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ ఆదేశాలు ఇప్పుడు తెలంగాణ బీజేపీ నేతలు, శ్రేణులు పాటిస్తూ పార్టీని అధికారం వైపు నడిపించే వ్యూహంలో వున్నారు. తెలంగాణ ప్రజలకు ఇప్పుడు బీజేపీని అత్యంత చేరువ చేసే పనిలో రాష్ట్ర న్యాయకత్వం వుంది. అయితే బీజేపీ ఆలోచనలు, ప్రణాళికలు, ఎత్తుగడలు తెలంగాణలో ఎంత మేరకు పని చేస్తాయి. ప్రజలను కమలం వైపు కన్నెసేలా చేస్తాయి అన్నది అంచనా వేయటం కష్టం. బీజేపీ బలం అంతా మోడీనే. ఆయన న్యాయకత్వంతోనే ఇప్పటి వరకు నేతలు నెగ్గుకు వచ్చారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో ఇది ఎంత మేరకు ప్రభావం చూపుతుంది అనేదే ప్రశ్న. ఇక క్షేత్ర స్థాయిలో బీజేపీ బలం చెప్పుకోదగిన స్థాయిలో లేదు. హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్ నగర్ జిల్లాల్లో పట్టణ ప్రాంతాల వరకే బీజేపీ ఛాయలు కనిపిస్తున్నాయి. తెలంగాణలో అధికార దిశగా బీజేపీ సాగాలి అంటే క్షేత్ర స్థాయి వరకు పార్టీ వెళ్ళాల్సిందే. ఇందులో సందేహం లేదు. ఇక ఇప్పుడు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా తెలంగాణ పై దృష్టి పెట్టారు. బీజేపీకి మిత్ర పక్షమైన జనసేన క్యాడర్, పవర్ స్టార్ అభిమానులు వచ్చే ఎన్నికల్లో బీజేపీకి సపోర్ట్ గా వుండే అవకాశం కనిపిస్తోంది. అయితే ఇది ఎంత మేరకు బీజేపీకి కలిసి వస్తుంది అనేది తేలాల్సి వుంది. జనసేన అధినేత పవన్ తెలంగాణ గురించి పదే పదే మాట్లాడటం వెనుక కేంద్ర బీజేపీ పెద్దల ప్రమేయం ఉందనే టాక్ కూడా వుంది. తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలలోపు బీజేపీ మరింతగా బల పడే స్థాయిలో జనసేన సహకారం అందించే ప్లాన్ కూడా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఓ వైపు కాంగ్రెస్ బలంగా వుంది. మరో వైపు బీ ఆర్ ఎస్ పరుగులు పెడుతోంది. ఈ రెండు ప్రధాన పార్టీలను పక్కకు నెట్టి తెలంగాణ ప్రజల మధ్యకు బీజేపీ దూసుకుపోవాలి. ఇందుకు పెద్ద ప్రయత్నం తప్పదు. అయితే అసాధ్యం, సుసాధ్యం చేసే మోడీ, అమిత్ షా ఏదైనా చేసే సత్తా వున్న నేతలే. వారి నాయకత్వంలో బీజేపీ ఇప్పుడు అధికార పీఠం కోసం ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో తెలంగాణలో రాజకీయం ఆసక్తికరంగానే మారబోతోంది..



- జీ. వెంకటరమణ,
సీనియర్ జర్నలిస్ట్.

# కాలుష్య రహిత ఢిల్లీ దిశగా
# కొత్త అడుగు

**దేశ రాజధానిని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఢిల్లీలోని రేఖా గుప్తా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పర్యావరణహిత విద్యుత్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని భారీగా ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ప్రతిష్టాత్మక 'ఢిల్లీ ఈవీ పాలసీ-2026'కు ముఖ్యమంత్రి రేఖా గుప్తా అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం లాంఛనంగా ఆమోదముద్ర వేసింది.**

కేంద్ర ప్రభుత్వ పూర్తి మద్దతుతో రూపొందించిన ఈ నూతన విధానం, లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) తుది ఆమోదం లభించిన వెంటనే.. జులై 1, 2026 నుంచి అధికారికంగా అమల్లోకి రానుంది. ఈ నూతన పాలసీ మార్చి 31, 2030 వరకు అమలులో ఉంటుందని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**రూ.15 వేల కోట్ల మేర ప్రజలకు ప్రయోజనం**

ఈ నూతన విధానం ద్వారా రాబోయే నాలుగేళ్లలో విద్యుత్ వాహన రంగంలో నేరుగా రూ.7,000 కోట్లకు పైగా పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. పన్ను మినహాయింపులు, ఈవీ మౌలిక సదుపాయాల కల్పన వంటి చర్యల ద్వారా ఢిల్లీ ప్రజలకు మొత్తంగా రూ.15,000 కోట్లకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని ముఖ్యమంత్రి రేఖా గుప్తా తెలిపారు. పెరుగుతున్న కాలుష్యాన్ని కట్టడి చేయడంతో పాటు, పాత వాహనాల స్థానంలో పర్యావరణహిత జీరో ఎమిషన్ వెహికల్స్ ను వినియోగంలోకి తీసుకు రావడానికి భారీ స్థాయిలో స్క్రాపేజ్ ఇన్సెంటివ్‌లు, కొనుగోలు సబ్సిడీలను ఈ విధానంలో పొందుపరిచారు. ఈ ఈవీ పాలసీలో అత్యంత కీలకమైన అంశం పాత బీఎస్4 లేదా అంతకంటే పాత వాహనాల స్క్రాపేజ్ విధానం. పాత వాహనాన్ని వదిలేసి కొత్త విద్యుత్ వాహనం కొనుగోలు చేసే వారికి సాధారణ సబ్సిడీలతో పాటు అదనంగా ఆకర్షణీయమైన స్క్రాపేజ్ ఇన్సెంటివ్‌ను ప్రభుత్వం ప్రకటించింది. దీని ప్రకారం.. ఎవరైనా తమ పాత కారును ఇచ్చేసి కొత్త ఈవీ కారు కొనుగోలు చేస్తే గరిష్ఠంగా రూ.1,00,000 వరకు భారీ స్క్రాపేజ్ బోనస్ లభిస్తుంది. అదే విధంగా, వాణిజ్య ట్రక్కుల (N1 కేటగిరీ) కొనుగోలుపై రూ.50,000 వరకు ప్రయోజనం చేకూరుతుంది. ఆటోల వంటి త్రీవీలర్లపై రూ.25,000 మరియు ద్విచక్ర వాహనాలైన బైక్‌లు, స్కూటర్లపై రూ.10,000 మేర అదనపు లబ్ధిని ప్రభుత్వం అందించనుంది. **పన్నులు, రిజిస్ట్రేషన్ ఫీజుల నుంచి వంద శాతం మినహాయింపు** ఢిల్లీలో కొనుగోలు చేసే అన్ని రకాల ప్యూర్ ఎలక్ట్రిక్ వాహనాలకు రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజుల నుంచి ఏకంగా వంద శాతం పూర్తి మినహాయింపు ఇస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, ఈ పన్ను మినహాయింపు ఫోర్ వీలర్ల (కార్ల) కేటగిరీలో అందరికీ వర్తించదు. ఎక్స్‌షోరూం ధర రూ.30 లక్షల లోపు ఉన్న ఎలక్ట్రిక్ కార్లకు మాత్రమే ఈ 100% పన్ను మినహాయింపు వర్తిస్తుందని పాలసీలో ప్రత్యేకంగా వెల్లడించారు.

**32 వేల ఈవీ ఛార్జింగ్ పాయింట్ల ఏర్పాటు**

ఢిల్లీలో ఈవీ విప్లవాన్ని మరింత వేగవంతం చేయడానికి ప్రభుత్వం కొన్ని కఠినమైన, స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా నగరవ్యాప్తంగా కొత్తగా 32,000 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అలాగే వాణిజ్య వాహనాలు, డెలివరీ కోసం వాడే బైక్‌లు, ప్రభుత్వ మరియు వివిధ సంస్థాగత వాహన శ్రేణులను రాబోయే రోజుల్లో దశల వారీగా పూర్తిగా ఎలక్ట్రిక్‌గా మార్చనున్నారు. ఈ విప్లవాత్మక విధానం ద్వారా ఉద్గారాలు గణనీయంగా తగ్గిపోయి, ఢిల్లీలో గాలి నాణ్యత మెరుగుపడుతుందని ప్రభుత్వం బలంగా విశ్వసిస్తోంది.





## చైనా, మయన్మార్, బంగ్లాదేశ్ కారిడార్
# భారత్ ముందు మరో వ్యూహాత్మక సవాల్!
## 'చికెన్స్ నెక్' సమీపంలో డ్రాగన్ పాగా

ఇండోపసిఫిక్ ప్రాంతంలో అగ్రరాజ్యాల ఆధిపత్య పోరు తీవ్రమవుతున్న వేళ, భారత సరిహద్దులను చుట్టుముట్టేందుకు చైనా మరోసారి తన కుటిల వ్యూహాలకు పదును పెట్టింది. పశ్చిమ సరిహద్దుల్లో 'చైనాపాకిస్థాన్ ఆర్థిక కారిడార్' ద్వారా ఇప్పటికే భారత్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న డ్రాగన్, ఇప్పుడు తూర్పు సరిహద్దుల్లోనూ అదే తరహా వ్యూహాత్మక ఉచ్చును బిగిస్తోంది. బంగ్లాదేశ్, మయన్మార్ దేశాలను కలుపుతూ చైనా ప్రతిపాదించిన 'చైనామయన్మార్బంగ్లాదేశ్ ఆర్థిక కారిడార్' ఇప్పుడు దక్షిణాసియా భౌగోళిక రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే, బంగాళాఖాతంలో చైనా నౌకాదళ ప్రాబల్యం పెరగడమే కాకుండా, భారత సార్వభౌమాధికారానికి, ముఖ్యంగా వ్యూహాత్మక ఈశాన్య రాష్ట్రాల భద్రతకు పెద్ద ముప్పుగా పరిణమించే ప్రమాదం ఉంది.

**బీజింగ్ వేదికగా సాగిన వ్యూహాత్మక మంతనాలు**

ఇటీవల బీజింగ్‌లో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, బంగ్లాదేశ్ ప్రధాని తారిక్ రెహ్మాన్ మధ్య జరిగిన ద్వైపాక్షిక సమావేశంలో ఈ కారిడార్ ప్రతిపాదన ప్రధానంగా చర్చకు వచ్చింది. వాణిజ్య విస్తరణ, రహదారి, రైల్వే, సముద్ర మార్గాల ఆధునీకరణ ద్వారా బంగ్లాదేశ్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే ఈ ప్రాజెక్టు పైపై లక్ష్యంగా కనిపిస్తున్నప్పటికీ, దీని వెనుక చైనా యొక్క సుదీర్ఘ భౌగోళికవ్యూహాత్మక ప్రయోజనాలు దాగి ఉన్నాయి. బంగ్లాదేశ్‌లోని కీలకమైన చిట్టగాంగ్, మోంగ్లా నౌకాశ్రయాలను ఆధునీకరించేందుకు, చిట్టగాంగ్‌ను ప్రాంతీయ వాణిజ్య కేంద్రంగా మార్చేందుకు చైనా ఆసక్తి చూపడం వెనుక 'ముత్యాల హారం' వ్యూహం స్పష్టంగా కనిపిస్తోంది.

**భారత 'చికెన్స్ నెక్'కు పొంచి ఉన్న ముప్పు**

ఈ కారిడార్ చైనాలోని యున్నాన్ ప్రావిన్స్ నుండి ప్రారంభమై మయన్మార్ మీదుగా బంగ్లాదేశ్‌కు, అక్కడి నుండి నేరుగా బంగాళాఖాతానికి అనుసంధానించబడుతుంది. దీనివల్ల చైనాకు హిందూ మహాసముద్రంలోకి నేరుగా ప్రవేశం లభిస్తుంది. అయితే, ఈ ప్రాజెక్టు వల్ల భారత్‌కు ఎదురయ్యే అతిపెద్ద సవాల్ 'సిలిగుడీ కారిడార్' లేదా 'చికెన్స్ నెక్' భద్రత.

సిలిగుడీ కారిడార్ (చికెన్స్ నెక్): కేవలం 20 నుండి 22 కిలోమీటర్ల వెడల్పు ఉన్న ఈ ఇరుకైన భూభాగమే భారత ప్రధాన భూభాగాన్ని ఎనిమిది ఈశాన్య రాష్ట్రాలతో (అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, త్రిపుర, సిక్కిం) అనుసంధానించే ఏకైక మార్గం.

భారతదేశ రక్షణ వ్యవస్థలో అత్యంత సున్నితమైన ఈ 'చికెన్స్ నెక్'కు అతి సమీపంలో చైనా నిధులు, సాంకేతికతతో భారీ మౌలిక వసతుల కల్పన జరగడం రక్షణ నిపుణులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. యుద్ధం లేదా ఉద్రిక్తతల సమయంలో చైనా ఈ కారిడార్ ద్వారా ఒత్తిడి తెచ్చి, సిలిగుడీ మార్గాన్ని దిగ్బంధిస్తే, ఈశాన్య రాష్ట్రాలతో భారత్‌కు సంబంధాలు తెగిపోయే ప్రమాదం ఉంది.

**బంగాళాఖాతంలో 'డ్రాగన్' ఆధిపత్యం**

ఈ కారిడార్ ద్వారా బంగాళాఖాతం ప్రాంతంపై చైనా పట్టు మరింత బిగుస్తుంది. శ్రీలంకలోని హంబన్‌తోట పోర్టును అప్పుల ఊబిలోకి నెట్టి స్వాధీనం చేసుకున్నట్లే, భవిష్యత్తులో బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్, మోంగ్లా పోర్టులను కూడా చైనా తన సైనిక అవసరాల కోసం ఉపయోగించుకునే ప్రమాదం ఉంది.

తగ్గించుకోవడం: ప్రస్తుతం చైనా వాణిజ్యం, చమురు దిగుమతులు మలక్కా జలసంధి ద్వారా సాగుతాయి. ఒకవేళ యుద్ధం వస్తే భారత్, అమెరికాలు ఆ మార్గాన్ని మూసివేస్తాయనే భయం చైనాకు ఉంది. ఈ కొత్త కారిడార్ ద్వారా మలక్కా జలసంధితో పనిలేకుండా నేరుగా హిందూ మహాసముద్రంలోకి చైనా అడుగు పెట్టవచ్చు.

**భారత్ కు ప్రతివ్యూహం అవసరం**

చైనా విసురుతున్న ఈ సవాల్‌ను తిప్పికొట్టడానికి భారత్ కేవలం ఆందోళన వ్యక్తం చేస్తే సరిపోదు. త్వరితగతిన ప్రతివ్యూహాలను అమలు చేయాలి:

కనెక్టివిటీ ప్రాజెక్టుల వేగవంతం: భారత్ ఇప్పటికే చేపట్టిన 'కలదాన్ మల్టీమోడల్ ట్రాన్సిట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్ట్', 'ఇండియామయన్మార్థాయిలాండ్ త్రైపాక్షిక రహదారి' వంటి ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి. బంగ్లాదేశ్‌తో రవాణా సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలి.

దౌత్యపరమైన ఒత్తిడి: బంగ్లాదేశ్, మయన్మార్ దేశాలు చైనా 'రుణ వలయం' (Debt Trap) లో చిక్కుకోకుండా, వారికి ప్రత్యామ్నాయ ఆర్థిక సహాయాన్ని, మౌలిక వసతుల కల్పనను భారత్ తన మిత్రదేశాలైన అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా (క్వాడ్ కూటమి) లతో కలిసి అందించాలి.

రక్షణ సన్నద్ధత: సిలిగుడీ కారిడార్ పరిసర ప్రాంతాలలో సైనిక పహారాను, నిఘా వ్యవస్థలను మరింత బలోపేతం చేయడంతో పాటు, ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను నిరంతరం అందుబాటులో ఉంచుకోవాలి.




# పత్తి సాగులో విప్లవాత్మక మార్పులు తక్కువ కాలంలో అధిక దిగుబడులే లక్ష్యం

- **రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సంపత్.**

**పాలకుర్తి,జూన్ 29** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలోని రైతు వేదికలో సోమవారం వ్యవసాయ శాఖ, రైతు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో విత్తన మేళా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి జిల్లా రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సంపత్ హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ సంపత్ మాట్లాడుతూ పత్తి సాగులో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చే అధిక సాంద్రత పద్ధతి గురించి రైతులకు వివరించారు.తక్కువ ఎత్తు ఎక్కువ మొక్కలు తక్కువ కాలం అనేదే ఈ పద్ధతి ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. ఈ విధానం యాంత్రీకరణకు ఎంతో అనుకూలమని, దీనివల్ల రైతులు తక్కువ సమయంలో అధిక దిగుబడులను సాధించవచ్చని తెలిపారు. భూమి తయారీ నుండి విత్తనాలు విత్తే వరకు పాటించాల్సిన శాస్త్రీయ పద్ధతులను ఆయన రైతులకు క్షేత్రస్థాయిలో ప్రదర్శించి వివరించారు.

ప్రస్తుత ఎల్నినో పరిస్థితుల దృష్ట్యా వాతావరణంలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. వర్షాధార పరిస్థితులను బట్టి జొన్న, ఆముదం, కంది వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. అనంతరం అభ్యుదయ రైతులకు ఉచితంగా పత్తి విత్తన ప్యాకెట్లను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఏవో బండి ప్రమోద్, ఏఈఓలు కె. శ్రీకాంత్, జె. సుష్మ, ఎం. సువర్ణరేఖతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు




# ఎఫ్.పీ.వో ద్వారా అధునిక వ్యవసాయ పద్ధతుల పరిచయం

- **కారేపల్లి మండల రైతులకు డ్రోన్ సేవలు**

**కారేపల్లి, మహా** : రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్.పీ.వో) ద్వారా రైతులకు అధునిక వ్యవసాయ పద్ధతుల పరిచయం చేయనున్నట్లు కారేపల్లి సోసైటీ చైర్మన్ శ్రీ దుగ్గినేని శ్రీనివాసరావు, ఎఫ్.పీ.వో డొమైన్ ఎక్స్‌పర్ట్ చావా అరుంధతి లు అన్నారు. సహకార వారోత్సవాలలో భాగంగా రైతు ఉత్తత్తిదారుల సంస్థ, కారేపల్లి సోసైటీ ఆధ్వర్యంలో సోమవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వారు మాట్లాడుతూ రైతులకు అధునిక వ్యవసాయ పద్ధతులు పరిచయం చేయటానికి రైతు ఉత్పత్తిదారుల సంస్థ (FPO) ను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎఫ్ పీవో లో రూ.2 వేలు కట్టి సభ్యత్వం చేరిన రైతులకు అనేక లాభాలు ఉన్నాయన్నారు. రూ. 2వేలు కట్టి సభ్యత్వం చేరిన రైతులకు కేంద్ర ప్రభుత్వం మరో రూ.2వేల అందజేస్తుందని తెలిపారు. 750 మంది సభ్యులుగా చేరే అవకాశం ఉందని 750 మంది రూ.2వేలు చొప్పున రూ.15 లక్షలు కట్టితే కేంద్ర ప్రభుత్వం మరో రూ. 15 లక్షలు ఇస్తుందని దీంతో 30 లక్షలతో ఎఫ్.పీ.వో ద్వారా రైతులకు అవసరమైన అధునిక పరికరాలు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచవచ్చన్నారు. రైతులకు పురుగుమందులు పిచికారి చేయటానికి డ్రోన్, హార్వెస్టర్, ట్రాక్టర్ పరికరాలు తక్కువ ధరలో కిరాయి ఇవ్వటం చేయటం ద్వారా రైతు ఉత్పత్తిదారుల సంస్థకు ఆర్ధికంగా బలోపేతం అవుతుందన్నారు. వచ్చిన లాభాల పైకంలో సభ్యులుగా ఉన్న వారికి పంచటం జరుగుతుందని తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా పెద్ద పరిశ్రమలు సైతం స్థాపించవచ్చని దానికి కేంద్రప్రభుత్వం 7 శాతం వడ్డీకి రుణ సౌకర్యం మరియు 50శాతం సబ్సీడీ సైతం అందజేస్తుందని తెలిపారు. రైతులు తప్పని సరిగా ఎఫ్.పీ.వో ను వినియోగించుకోవాలని దానికి రూ.2వేలు కట్టి సభ్యులుగా చేరాలని సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో సోసైటీ కార్యదర్శి బొల్లు హనుమంతరావు, డైరక్టర్లు అడ్డగొడ ఐలయ్య, మర్సకట్ల రోషయ్య, దేగల ఉపేందర్, టేకులగూడెం సర్పంచ్ గుమ్మడి సందీఫ్, ఉపసర్పంచ్ నాగేశ్వరరావు లు పాల్గొన్నారు.



# సింగరేణి అధికారుల డిమాండ్లను పరిష్కరించాలి

- సంస్థను కాపాడుతున్న అధికారుల పట్ల నిర్లక్ష్య వైఖరి వీడాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- అధికారుల నిరసన దీక్ష శిభిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించిన కూనంనేని

**భద్రాద్రి బ్యూరో, మహా**: సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వారి పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. అఖిల భారత బొగ్గుగనుల అధికారుల సంఘం (ఐఎంఓఏ) సింగరేణి శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం అధికారులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సందర్శించి వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రింబవళ్లు శ్రమించి సింగరేణి సంస్థను లాభాల బాటలో నడిపిస్తున్న అధికారుల పట్ల యాజమాన్యం ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి వీడాలన్నారు. అధికారుల పేరివిజన్ అలవెన్సులు పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లాభాల్లో వాటా మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి అధికారుల సమస్యలపై చొరవ చూపాలని లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, నాయకులు వంగ వెంకట్, జె.గట్టయ్య, కిష్టాఫర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వరం యంగ్ ఇండియా స్కూల్

- అన్ని వర్గాలకూ ఒకే క్యాంపస్ విద్య ఆలోచన అభినందనీయం
- వచ్చే విద్యాసంవత్సరంలో అందుబాటులోకి యంగ్ ఇండియా స్కూల్
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు
- స్కూల్ నిర్మాణపనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**భద్రాద్రి బ్యూరో, మహా**: ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఏర్పాటు కానున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కొత్తగూడెం నియోజకవర్గానికి ఒక కీర్తి పతాక అని ఈ స్కూల్ ఏర్పాటుతో కొత్తగూడెం జిల్లా కేంద్రం గొప్ప విద్యా హబ్ గా మారబోతోందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. నియోజకవర్గంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణ పనులను సోమవారం ఆయన అధికారులు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు స్థానిక నేతలతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. కులమతాలకతీతంగా అన్ని వర్గాల విద్యార్థులకూ ఒకే క్యాంపస్ లో విద్యను అందించాలనే ప్రభుత్వ ఆలోచన ఎంతో అభినందనీయమని అన్నారు. ఈ ప్రాజెక్టు కింద కొత్తగూడెం క్యాంపస్ లో రూ. 200 కోట్ల అంచనా వ్యయంతో అత్యంత అత్యాధునిక హంగులతో ఈ స్కూల్ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. 25.475 ఎకరాల భారీ విస్తీర్ణంలో 5,38,246 చదరపు అడుగుల ప్లింత్ ఏరియాతో నిర్మిస్తున్న ఈ భారీ నిర్మాణాల్లో అకడమిక్ బ్లాక్ జూనియర్ సీనియర్ హాస్టల్ బ్లాకులు డైనింగ్ కిచెన్ లతో పాటు సిబ్బంది కోసం క్వార్టర్లను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి ఈ సరికొత్త స్కూల్ ను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్దేశించుకొని పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం బోధనతో పాటు డిజిటల్ స్మార్ట్ క్లాస్ రూమ్‌లు కంప్యూటర్ సెంటర్లు సైన్స్ ల్యాబ్‌లు 5000 పైగా పుస్తకాలతో కూడిన డిజిటల్ లైబ్రరీలను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల శారీరక మానసిక వికాసం కోసం 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్ క్రికెట్ గ్రౌండ్ వాలీబాల్ బాస్కెట్ బాల్ కబడ్డీ కోర్టులను ప్రత్యేకంగా నిర్మిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా పర్యావరణ హితంగా ఉండేలా సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ సౌర పవన విద్యుత్ వ్యవస్థలను నీటి సంరక్షణ కోసం రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ విధానాలను ఇక్కడ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో రవాణాసౌకర్యాన్ని మెరుగుపర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని ఇప్పటికే రోడ్లు బ్రిడ్జీలు అండర్ బ్రిడ్జీలు ఓవర్ బ్రిడ్జీలు ఔటర్ రింగు రోడ్లు కొన్ని నిర్మాణ దశలో ఉండగా మరికొన్నింటికీ మంజూరు లభించిందని తెలిపారు. అన్ని కులాలవారికి 17 కమ్యూనిటీహాలు మంజూరు చేయడం జరిగిందని ఎయిర్పోర్టు అంతర్జీతీయ క్రికెట్ స్టేడియం క్రీడామైదానాలు జిమ్ ఏర్పాటు కాబోతున్నాయని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలబెట్టేందుకు శక్తి వంచ లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. విలేకర్ల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, కమిషనర్ సుజాత, డీఈవో వాసంతి, పాఠశాలల భవనాల పర్యవేక్షణ అధికారి వెంకటేశ్వర్ రావు, వివిధ శాఖల అధికారులు హేమచంద్ర రావు, రాజగోపాల్, నాయకులు వాసిరెడ్డి మురళి, యూసుఫ్, ధర్మరాజు, కార్పొరేటర్లు ఎర్రబెల్లి శంకర్, దుర్గ, సుధాకర్, పద్మ, ఆకాంక్ష, హిమశ్రీ, బండి నర్సింహా, విజయ్, తులశమ్మ, సహేరా, కళావతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని సత్వరమే పరిష్కరించాలి

- **జిల్లా కలెక్టర్ అంకిత్**



1భద్రాద్రి బ్యూరో, మహా: ప్రజల సమస్యలను సత్వరంగా పారదర్శకంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి వినతులు ఫిర్యాదులను స్వీకరించారు. భూ సమస్యలు రెవెన్యూ అంశాలు సంక్షేమ పథకాల అమలు ఉపాధి మౌలిక సదుపాయాలు గృహ నిర్మాణం తదితర శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు సమర్పించిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖల అధికారులకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిష్కరించగల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మిగిలిన సమస్యలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజల సమస్యల పరిష్కారానికి సమర్థవంతమైన వేదికగా వినియోగించుకోవాలని తెలిపారు. ప్రజల వినతులను కేవలం నమోదు చేయడం కాకుండా వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించి ఫలితాలు సాధించేలా అధికారులు పనిచేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే సమస్యల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు.

**ప్రజావాణిలో అందిన కొన్ని దరఖాస్తులు**

చంద్రుగొండ మండలం రుద్రంపూర్ గ్రామ పంచాయతీ ప్రజలు గ్రామపంచాయతీ ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాలేదని ప్రత్యేక గ్రామసభ నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తగు చర్యల కోసం చంద్రుగొండ ఎంపీడీవోకు ఎండార్స్ చేశారు. పాల్వంచ మండలం సీతారాంపేటకు చెందిన యానబోయిన మౌనిక తాను 2017లో డిప్లొమా ఇన్ ఫార్మసీ పూర్తి చేశానని కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగోలేక ప్రభుత్వ వైద్యశాలలో ఫార్మసిస్ట్ ఉద్యోగం కల్పించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం జిల్లా ఉపాధి కల్పనాధికారికి ఎండార్స్ చేశారు. అశ్వాపురం మండలం కోండికుంట గ్రామ పంచాయతీ పరిధిలోని మొండికుంట గ్రామంలో రూ.1.50 కోట్ల వ్యయంతో 2023లో ప్రారంభించిన డ్రైనేజీ నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో మురుగునీరు నిల్వ ఉండి దోమల వ్యాప్తి పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామ సర్పంచ్ సమర్పించిన దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్ అండ్ బి శాఖ అధికారులకు ఎండార్స్ చేశారు. బూర్గంపహాడ్ మండలం లక్ష్మీపురం గ్రామంలో తన తండ్రి జక్కం కృష్ణమూర్తి పేరుపై ఉన్న సర్వే నెం.440/20/లోని 4 ఎకరల 27 కుంటల భూమిని వారసత్వంగా తన పేరుపై మార్చి పట్టాదారు పాస్‌బుక్ మంజూరు చేయాలని బూర్గంపహాడ్‌కు చెందిన జక్కం శ్యామ్ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల కోసం బూర్గంపహాడ్ తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని చట్టపల్లి ప్రాంతంలో అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారని వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని లింగాల సాయికుమార్ సమర్పించిన దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తగు చర్యల కోసం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి ఎండార్స్ చేశారు. ప్రజలు తమ వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పించడం ద్వారా సమస్యల పరిష్కార ప్రక్రియ మరింత వేగవంతమవుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు వారి సమస్యలకు సత్వర పరిష్కారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియకు ప్రజలంతా సహకరించాలి

- ప్రతి అర్హ ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారం అందేలా చర్యలు
- తహసీల్దార్ కేఆర్‌కేవీ ప్రసాద్

బూర్గంపహాడ్, మహా :ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా, తప్పుల్లేకుండా పూర్తి చేయడానికి ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు అందరూ సంపూర్ణ సహకారం అందించాలని బూర్గంపహాడ్ తహసీల్దార్ కేఆర్‌కేవీ ప్రసాద్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఎస్ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పురోగతిని వివరించారు. మండల పరిధిలో 57 పోలింగ్ కేంద్రాలు, 48,934 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం సుమారు 50% ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని, 7గురు సూపర్వైజర్ల పర్యవేక్షణలో ప్రక్రియ వేగంగా కొనసాగుతోందన్నారు.ఎన్యూమరేషన్ ఫారాలు నింపేటప్పుడు 2002 లేదా అంతకుముందు నమోదైన కుటుంబ వివరాలు తల్లిదండ్రులు, తాతయ్యఅమ్మమ్మల వివరాలు సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ప్రతి ఓటరు తన వివరాలు జాగ్రత్తగా పరిశీలించి సరైన సమాచారం అందించాలని కోరారు.బీఎల్ఓలు, బీఎల్ఏలు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రతి అర్హ ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారం చేరేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ ప్రక్రియపై ఏమైనా సందేహాలు ఉంటే ముందుగా తమ పరిధిలోని బీఎల్ఓను సంప్రదించాలని అవసరమైతే నేరుగా మండల తహసీల్దార్ కార్యాలయంలో తనను కలిసి నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు."ప్రజల సహకారంతో సమగ్ర, పారదర్శక, తప్పులేని ఓటరు జాబితా రూపొందించడం సాధ్యమవుతుంది" అని తహసీల్దార్ కేఆర్‌కేవీ ప్రసాద్ పేర్కొన్నారు.



# ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు గ్రామస్తుల కృతజ్ఞతలు...

**రాజేంద్రనగర్ మహా** ; శంషాబాద్ మండలం పిల్లోనిగూడ నుండి పాలమాకుల మోడల్ స్కూల్ విద్యార్థుల కోసం ఉదయం 8.30, సాయంత్రం 4.30 రెండు ట్రిప్పుల బస్సును గ్రామ సర్పంచ్ పానుగంటి స్వర్ణలత నరసింహ, ఉపసర్పంచ్ శ్రీశైలం ముదిరాజ్, జర్కి పటేల్, విద్యార్థుల తల్లిదండ్రు తో కలిసి ప్రారంభించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం, సాయంత్రం బస్సు సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కి గ్రామ ప్రజలు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల స్థలాల కోసం సీపీఐ(ఎం) ఆందోళన




**సత్తుపల్లి, జూన్ 29 (మహా):** మండలంలోని కాకర్లపల్లి పేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ కార్యక్రమంలో సుమారు 250 మంది మహిళలు, బాధితులు పాల్గొన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా పలువురు సీపీఐ(ఎం) నాయకులను పోలీసులు అరెస్టు చేసినప్పటికీ, వందలాది మంది కార్యకర్తలు, మహిళలు కార్యాలయానికి చేరుకుని నిరసన చేపట్టారు.ముట్టడి సందర్భంగా పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి, జిల్లా నాయకులు మోరంపూడి పాండురంగారావు, జాజిరి శ్రీనివాస్ తదితరులతో పాటు పలువురు మహిళలు అరెస్టయ్యారు. శాంతియుతంగా నిరసన తెలిపిన వారిపై అక్రమ కేసులు నమోదు చేశారని సీపీఐ(ఎం) నాయకులు ఆరోపిస్తూ ఖండించారు. పేదలకు వెంటనే ఇండ్ల స్థలాలు కేటాయించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు హెచ్చరించారు. ప్రజాస్వామ్య హక్కులను అణచివేసే చర్యలను ప్రభుత్వం విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన రాములు నాయక్

**కారేపల్లి, మహా :**మండల పరధిలోని అప్పాయిగూడెం పంచాయితీ భిక్య తండా గ్రామానికి చెందిన మండల మాజీ ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న తల్లి అజ్మీర ఈరి అనారోగ్యంతో మరణించడంతో సోమవారం వైరా మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ వారి పార్థివదేహానికి పూల మాల వేసి నివాళులార్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పిటిసి ఉన్నం వీరేందర్, ఆత్మకమిటి చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ మాలోత్ శకుంతల, మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, మాజీ సొసైటీ వైస్ చైర్మన్ దారావత్ మంగీలాల్, ఏఎంసి డైరెక్టర్ వాంకుడోత్ నరేష్, నాయకులు భూక్య రాంకిషోర్, జర్పుల ప్రసాద్, బానోతు కోటి, గుగులోత్ హారు, వాంకుడోత్ కరణ్ సింగ్, వాంకుడోత్ విజయ్, జూపల్లి రాము, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సేవలు చిరస్మరణీయం

- జిల్లా కలెక్టర్ అంకిత్
- ఉద్యోగ విరమణ పొందిన వారికి ఘన సన్మానం



**భద్రాద్రి బ్యూరో, మహా:** ప్రజలకు సుదీర్ఘకాలం పాటు అంకితభావంతో నిబద్ధతతో సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగుల సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో పదవీ విరమణ పొందుతున్న కె.సంజీవరావు (సీపీఓ), డాక్టర్ వెంకటేశ్వర్లు(డీవీఏహెచ్ఓ), చి.రమేష్‌బాబు (అసిస్టెంట్ ఇంజనీర్ హౌసింగ్), అంజనేయులు(ఆఫీస్ సబార్డినేట్ హౌసింగ్ శాఖ)లకు ఏర్పాటు చేసిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ పదవీ విరమణ అనేది ప్రతి ఉద్యోగి జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగం పొందిన నాటి నుంచి ఉద్యోగికి సమాజంలో ఒక ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని విధి నిర్వహణలో సంపాదించిన అనుభవం ప్రజల ఆదరణ జీవితాంతం వెంట ఉంటాయని అన్నారు. 30 నుంచి 40 సంవత్సరాల పాటు ప్రభుత్వ సేవలో ప్రజల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేయడం గొప్ప విషయమని ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఉద్యోగి తనవంతు కృషి చేయడం అభినందనీయమని చెప్పారు. పదవీ విరమణతో ఉద్యోగ జీవితం ముగిసినప్పటికీ సమాజానికి సేవ చేసే అవకాశాలు ఎన్నో ఉంటాయని పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమ అనుభవాలను విలువైన సూచనలను ప్రస్తుత ఉద్యోగులతో పంచుకోవడం ద్వారా వారికి మార్గదర్శకులుగా నిలవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ సేవలో క్రమశిక్షణ నిజాయితీ బాధ్యతాయుత విధి నిర్వహణతో ప్రజల విశ్వాసాన్ని సంపాదించడం ఉద్యోగ జీవితంలో అత్యంత గొప్ప విజయమని కలెక్టర్ అన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ ఆరోగ్యంగా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌లు పదవీ విరమణ పొందిన ఉద్యోగులను శాలువాలు కప్పి జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమ ఉద్యోగ జీవితంలోని అనుభవాలను పంచుకుంటూ తమకు సహకరించిన జిల్లా యంత్రాంగం సహోద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు వివిధ శాఖల అధికారులు ఉద్యోగులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

### కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ మహా:** ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. ప్రజావాణి పోర్టల్‌లో నమోదయ్యే ప్రతి ఫిర్యాదును నిర్దిష్ట గడువులోగా పరిష్కరించడం సంబంధిత అధికారుల ప్రాథమిక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సామాజిక భద్రతా పెన్షన్లు, ఉపాధి హామీ పథకం, భూభారతి సమస్యలు తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 68 ఫిర్యాదులు అందాయి. వీటిపై తక్షణ చర్యలు తీసుకుని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును 30 రోజుల్లోపు పరిష్కరించాలని సూచించారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి, సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఒకే సమస్యపై పదేపదే ఫిర్యాదులు రాకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలని, అప్పీల్ కేసులను రెండు నుంచి మూడు రోజుల్లోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులతో పాటు డాక్టరేట్ పొందిన కలెక్టరేట్ పరిపాలన అధికారిని జిల్లా అధికారుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్.ఎస్. చిత్రు, డీఆర్ఓ స్రవంతి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సహకార వారోత్సవాలు ప్రారంభం

**యాదాద్రి భువనగిరి, జూన్ 29 (మహా):** సహకార వారోత్సవాల తొలి రోజైన సోమవారం ఆలేరు పీఏసీఎస్ కార్యాలయంలో ఇంచార్జ్ చైర్మన్ మొగులగాని మల్లేష్ సహకార జెండాను ఆవిష్కరించి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలని రైతులు, ప్రజాప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం ఆలేరు మున్సిపల్ చైర్మన్ బీజాన బాలమణి భాస్కర్, వైస్ చైర్మన్ అంగడి ఆంజనేయులు, కౌన్సిలర్ బీజాన కళ్యాణ్ మధులను పీఏసీఎస్ చైర్మన్ మల్లేష్ శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ కట్టెగొమ్ముల సాగర్ రెడ్డి, సెక్రెటరీ వెంకట్ రెడ్డి, సహకార బ్యాంకు మేనేజర్ కావ్య, సంఘం డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

## గడువులోగా ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయాలి

**వలిగొండ, జూన్ 29 (మహా):** ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఎంపీడీవో జలంధర్ రెడ్డి లబ్ధిదారులకు సూచించారు. సోమవారం వలిగొండ పట్టణంలో లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంబంధిత అధికారులు గృహ నిర్మాణాల పురోగతిని ప్రతి వారం క్షుణ్ణంగా పర్యవేక్షించి వారానికోసారి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి వి. ప్రేమలత, హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్లు కిరణ్, అశోక్, గ్రామపంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల అభ్యున్నతే సహకార బ్యాంకుల ప్రగతికి పునాది: మంత్రి తుమ్మల

- కల్లూరులో పరిపాలన, మౌళిక వసతుల కేంద్రాలను తీర్చిదిద్దుతాం
- రైతు బలపడితేనే బ్యాంకింగ్ వ్యవస్థ మరింత బలోపేతం
- సత్తుపల్లి నియోజకవర్గం అభివృద్ధికి మరిన్ని ప్రాజెక్టులు తీసుకొస్తాం
- కల్లూరులో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ప్రారంభోత్సవంలో మంత్రి తుమ్మల కామెంట్స్.



**కల్లూరు, జూన్ 29: మహా :** సహకార బ్యాంకులు రైతులకు, గ్రామీణ ప్రజలందరికీ ఆర్థిక పరంగా అండగా నిలుస్తూ, పొదుపు, రుణాలు, ఇతర బ్యాంకింగ్ సేవలను సమర్థవంతంగా అందిస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు పట్టణంలో సోమవారం ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) కల్లూరు బ్రాంచ్ నూతన భవనాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు మరింత చేరువలో సౌకర్యవంతమైన బ్యాంకింగ్ సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో కల్లూరులో నూతన భవనంలో డీసీసీబీ శాఖను ప్రారంభించామని తెలిపారు. రైతు సుభిక్షంగా ఉంటేనే సహకార బ్యాంకులు అభివృద్ధి చెందుతాయని అన్నారు. రైతుల ఆదాయం పెరిగి, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించినప్పుడు బ్యాంకింగ్ వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని, తద్వారా మరింత మంది రైతులకు రుణాలు అందించే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. కల్లూరు బ్రాంచ్ ఆర్థికంగా బలమైన శాఖగా ఎదగడానికి వ్యాపారవేత్తలు, ప్రజలు తమ డిపాజిట్లను సహకార బ్యాంకులోనే ఉంచేలా అధికారులు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. బ్యాంకు బలోపేతమైతే స్థానిక వ్యాపారాలు కూడా అభివృద్ధి చెందుతాయని అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని ప్రజలు తనపై ఉంచిన విశ్వాసంతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం లభించిందన్నారు మంత్రి తుమ్మల అన్నారు. కల్లూరుకు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసిన విషయం గుర్తు చేస్తూ, త్వరలో ఇంటిగ్రేటెడ్ సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలు ఒకే ప్రాంగణంలో ఉండేలా ఆధునిక పరిపాలనా సముదాయాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని వెల్లడించారు. కల్లూరు మండలంలో సాగునీరు, తాగునీరు, రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, మౌళిక సదుపాయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని మంత్రి అన్నారు. గతంలో మండల కార్యాలయాలు, కళాశాల భవనాలు, నీటి పథకాలు, లిఫ్ట్ ఇరిగేషన్ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసిన విషయాన్ని మంత్రి తుమ్మల గుర్తు చేశారు. వేంసూరులో నిర్మాణంలో ఉన్న పామాయిల్ ఫ్యాక్టరీ త్వరలో ప్రారంభమైతే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి తెలిపారు. ఖమ్మం - అశ్వారావుపేట పాత రహదారిని నాలుగు లైన్ల జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు. గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారికి ఎగ్జిట్, ఇతర మౌళిక వసతుల కల్పనకు కూడా చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. సత్తుపల్లి నియోజకవర్గానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మంచి పేరును మరింత పెంచేలా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని, రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ద్వారా ఏ అవకాశం వచ్చినా ముందుగా సత్తుపల్లి నియోజకవర్గానికి తీసుకురావడానికి కట్టుబడి ఉంటానని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యేమట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, డిసిసిబి బ్యాంక్ ప్రయివేట్ బ్యాంకుల కంటే తక్కువ వడ్డీకే ఋణాలందిస్తున్నట్లు తెలిపారు. రైతులు సకాలంలో తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించాలన్నారు. రైతులకు ఎన్ని రకాల రుణాలు వస్తాయో అధికారులు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిఓ గంగాధర్, ఏసీపీ వసుంధర యాదవ్, బ్యాంక్ సిఇఓ ఎన్. వెంకట ఆదిత్య, డిజిఎం ఎం. సర్వేశ్వర రావు, ఎజిఎం బి. చందర్ రావు, మేనేజర్ ఎం. అనిత, కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బాగం నీరజ, కల్లూరు మునిసిపల్ చైర్మన్ ఎం. మోహన్, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క ఓటు కూడా పోవద్దు



**ఆదిలాబాద్ మహా :** అర్హుల ఓట్లు గల్లంతు కాకుండా పార్టీ మండల అధ్యక్షులు బీఎల్ఏ2లు అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సూచించారు. సోమవారం బేల మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ఎస్ ఐఆర్ ప్రక్రియ పట్ల శ్రేణులకు అవగాహన కల్పించారు. బీఎల్వోలతో టచ్ లో ఉంటూ ప్రక్రియను పరిశీలించాలన్నారు. మృతుల ఓట్లు తప్ప మిగతా ఓట్ల విషయంలో తగు జాగ్రత్త అవసరమన్నారు.ఎవరి ఓటైనా తొలగిస్తే సమాచారమందించాలన్నారు. ఒక్క ఓటు కూడా చాలా ముఖ్యమన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, కొండా గంగాధర్, కోలా నర్సింలు, శాంతన్ రావు, నిమ్మల గౌతమ్ రెడ్డి, అశోక్, అరవింద్ ,జైనథ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విలాస్ పాటిల్,బేల మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లే, సర్పంచులు దంతెలా వినోద్, గంభీర్ టాక్రె, శంకర్ భోక్రె, టెకం సత్యపాల్, ఉపసర్పంచుల అధ్యక్షులు సాగర్ టాక్రె, ఉప సర్పంచులు ప్రకాష్, బండి సుదర్శన్, నాయకులు నగేష్ రెడ్డి ,నానాజీ వైద్య, మాడవి చంద్రకాంత్, బూబాన్ రమేష్, దోటె ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు

## బాలల సంరక్షణకై అన్ని డిపార్ట్ మెంట్‌లు సమన్వయంతో పని చేయాలి

- ఆపరేషన్ ముస్కాన్ పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**భద్రాద్రి బ్యూరో, మహా:** బాలల సంరక్షణకై అన్ని డిపార్ట్మెంట్లు సమన్వయంతో పని చేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. నెల రోజుల పాటు నిర్వహించబడే ఆపరేషన్ ముస్కాన్ 12వ విడత కార్యక్రమంపై జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం కాన్ఫరెన్స్ హాల్ నందు అధికారులతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో ముందుగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆపరేషన్ ముష్కన్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా ఆపరేషన్ స్మైల్ అండ్ ముస్కాన్ భారతదేశ వ్యాప్తంగా తప్పిపోయిన పిల్లలను భిక్షాటన చేయుచున్న పిల్లలను నిరాదరణ కలిగిన పిల్లలకు బాల కార్మికులను సంరక్షించే ప్రాథమిక ఉద్దేశాలతో నిర్వహించడం జరుగుతుందని ఈ యొక్క కార్యక్రమం వలన బాధితులైన పిల్లల్ని సంరక్షించి వారి కుటుంబాలకు అప్పగించడం జరుగుతుందని వివరించారు. బాలల సంరక్షణ కొరకు ప్రత్యేకంగా పోలీస్ టీంలను ఏర్పాటు చేయడం జరిగిందని అంతేగాక హాజరైన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచనలు చేశారు. కొత్తగూడెంజిల్లా పరిధిలో ఎవరైనా 18 సంవత్సరాలలోపు పిల్లల్ని హింసించిన భిక్షాటన చేపించిన పిల్లల్ని బాల కార్మికులుగా మార్చిన అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారము కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నందు కొత్తగూడెం డిసిఆర్బి డిఎస్పి మల్లేష్‌స్వామి, డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ లెనినా స్వర్ణలత, డీసీపీవో హరి కుమారి, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ రాము, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్స్ నాగరాజు, శాస్త్రి, ఏసుపాదం, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ డిస్టిక్ కో ఆర్డినేటర్ సైదులు, కేఎస్సిఎఫ్ కో ఆర్డినేటర్ రాజేష్, కమిటీ మెంబెర్స్, ఎస్సైలు రమాదేవి, రాంబాబు, రామ్మూర్తి, రావూఫ్, వెంకన్న, సారంగపాణి, లక్ష్మణ్, పోలీస్ సిబ్బంది, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, చైల్డ్ హెల్ప్ లైన్1098, కైలాష్ సత్యర్థి చిల్డ్రన్ ఫౌండేషన్ ఎన్జీవో, విద్యాశాఖ, వైద్య శాఖ, కార్మిక శాఖకి చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌కు భువనగిరిలో ఘన స్వాగతం

**యాదాద్రి భువనగిరి జూన్ 29 మహా :** బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ కు యాదాద్రి భువనగిరి జిల్లా బిజెపి శ్రేణులు సోమవారం ఘనస్వాగతం పలికారు. జాతీయ అధ్యక్షులుగా మొట్టమొదటిసారిగా రాష్ట్రానికి రావడం,పార్టీ బలోపేతం కై మూడు రోజుల పర్యటన లో భాగంగా సోమవారం హనుమకొండ వెళుతున్న సందర్భంగా భువనగిరి పట్టణ శివారులోని టోల్ ప్లాజా వద్ద డప్పు,డోలు వాయిద్యాలతో కళాకారుల నృత్యాలతో పార్టీ వర్గాలు గజమాల, శాలువాలతో పెద్ద ఎత్తున స్వాగతం పలికారు ... తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు గుర్తులైన బతుకమ్మ,బోనంతో స్వాగతం పలికారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కు భువనగిరిలో ఘన స్వాగతం ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్, రాష్ట్ర నాయకులు గూడూరు నారాయణరెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, చందుపట్ల వెంకటేశ్వరరావు, పాశం భాస్కర్, వేముల అశోక్, పడమటి జగన్మోహన్ రెడ్డి, చందా మహేందర్ గుప్తా, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కస్తూరి మాధురి, రచ్చ శ్రీనివాస్ లు వున్నారు జిల్లాలోని బిజెపి ముఖ్య నాయకులు పరిచయం చేసుకుని జ్ఞాపికలను అందజేశారు. అనంతరం పట్టణం ప్రధాన రహదారి గుండా వరంగల్ వెళ్ళారు. ఈ కార్యక్రమంలో ఏలే చంద్రశేఖర్. మాయ దశరథ, శ్యాంసుందర్ రెడ్డి, పట్నం శ్రీనివాస్, ఫకీర్ రాజేందర్ రెడ్డి, కిషన్ నాయక్, గూడూరు సర్వోత్తమ్ రెడ్డి, పన్నాల చంద్రశేఖర్ రెడ్డి, కొప్పుల యాదిరెడ్డి, కాటూరి అచ్చయ్య, కె లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.





## ప్రతి ఒక్కరు ఒక ఓటు హక్కు కలిగి ఉండాలి

- బి.ఎల్.ఏ.లతో కార్మిక శాఖ మంత్రి సమీక్ష సమావేశం

**మందమర్రి, మహా :** ప్రతి ఒక్కరికి ఒక ఓటు మాత్రమే కలిగి ఉండాలని తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. సోమవారం మందమర్రి సింగరేణి అతిథి గృహం బి1లో ఆయన బి.ఎల్.ఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్.) ను పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. బిఎల్ఏ లు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల పూర్తి వివరాలు సేకరించాలని సూచించారు.2002 కి ముందు ఉన్న ఓటరు వివరాలు ఓటర్లకు చేరవేసే బాధ్యత తీసుకోవాలని వెల్లడించారు. 18 సంవత్సరాలు నిండిన కొత్త ఓటర్లను గుర్తించి, ఓటరుగా నమోదు చేయాలని పేర్కొన్నారు. వలస ఓట్లను గుర్తించి వారి వివరాలు సేకరించే బాధ్యత తీసుకోవాలని అన్నారు.కొంతమందికి రెండు లేదా అంతకన్నా ఎక్కువ ఓట్లు ఉన్నాయని చెప్పారు. అలాంటి వారి వివరాలు సేకరించి పేర్లను తొలగించాలని స్పష్టం చేశారు.



## ప్రజావాణి ఆర్జిదారుల సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మహా :** ప్రజావాణి ఆర్జిదారుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి చంద్రయ్య, వి రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. కోటపల్లి మండలం రొయ్యలపల్లి గ్రామానికి చెందిన రామటెంకి రాజమల్లు తన తండ్రి నుంచి ఆధీనంలో ఉన్న ఇల్లు, పెరడును కొంతమంది అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఈ విషయపై తగు చర్యలు తీసుకోవాలని అర్జీ సమర్పించారు. మందమర్రి మండలం రామకృష్ణాపూర్ ప్రాంత వాసులు గుడిపేట లోని కేంద్రీయ విద్యాలయంకు వెళ్లే ఆర్.టి.సి. బస్సు సేవలను రామకృష్ణాపూర్ వరకు పొడిగింపు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి మండల కేంద్రానికి చెందిన గొర్రె శ్రీనివాస్ తనకు లొంగిపోయిన మావోయిస్టుల కోటాలో కేటాయించిన స్థలం కబ్జాకు గురైనందున తగు చర్యలు తీసుకొని భూమిని తిరిగి ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కోటపల్లి మండలం పంగిడిసోమారం గ్రామానికి చెందిన బోయిని లచ్చయ్య తన భూమిని అక్రమంగా పట్టా చేయించుకుని బెదిరింపులకు గురి చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం బట్వాన్ పల్లి గ్రామానికి చెందిన కాడం బీరయ్య తమ గ్రామంలోని కురుమ గూడెంలో మురుగు కాలువలు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కోటపల్లి మండలం సర్వాయిపేట గ్రామానికి చెందిన ఉప్పరి ఆశ్రిత తనకు సాంఘిక సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాలలో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి మండలం రామకృష్ణాపూర్ లోని వల్లభాయినగర్ కు చెందిన వెల్దండి మల్లేశ్వరి తన భర్త మరణించినందున ఆయన పేరిట ఉన్న పింఛన్ తన పేరిట మార్చి ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 48 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే విధంగా సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మండల శాశ్వత భవనాలకు నిధులు మంజూరు

- హర్షం వ్యక్తం చేసిన కంది శ్రీనివాస రెడ్డి
- కంది శ్రీనివాస రెడ్డిని సత్కరించిన మండలాల నాయకులు

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు.భోరజ్ ,సాత్నాల మండల కేంద్రాలలో ఆఫీసుల శాశ్వత భవనాలకు రెండున్నర కోట్ల నిధులు మంజూరు కావడం హర్షనీయమన్నారు. సోమవారం ఆయా మండలాల నాయకులు కార్యకర్తలు క్యాంపు కార్యాలయానికి వచ్చి నిధుల కోసం ప్రత్యేక చొరవ తీసుకున్నందుకు కంది శ్రీనివాస రెడ్డిని శాలువాలతో సత్కరించారు.కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కేంద్రం నిధులు గా చెప్పడం సిగ్గు చేటని కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆయనకు దమ్ముంటే కేంద్రం నుండి నిజంగా నిధులు తెచ్చి అభివృద్ధికి కేటాయించాలన్నారు. జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు కృషితో నిధులు మంజూరు అయినట్టు తెలిపారు. సీయం రేవంత్ రెడ్డికి, జూపల్లి కృష్ణారావుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు ,శాంతన్ రావు, మునిగెల విఠల్ భోరజ్ , సాత్నాల మండలాలలకు చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాలి

**యాదాద్రి భువనగిరి జూన్ 29 మహా :** ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ప్రజా ప్రతినిధులు సహకరించాలని జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి అన్నారు. గతంలో మూతపడిన భువనగిరి మండలంలోని బాలంపల్లి ప్రాథమిక పాఠశాలను తిరిగి ప్రారంభించి, ఆయన మాట్లాడారు.సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉండే ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నందువలన అందరు తమ పిల్లలను పంపించాలని ఆయన కోరారు. ఈరోజు తిరిగి ప్రారంభించిన పాఠశాలకు పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం మొదలైన అన్ని సదుపాయాలను, ఉపాధ్యాయులను వెంటనే సర్దుబాటు చేయాలని మండల విద్యాధికారిని ఆదేశించారు. పాఠశాల తిరిగి ప్రారంభం కావడానికి పూనుకున్న గ్రామ సర్పంచ్ శ్రీరామ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నదనీ, ప్రైవేటు పాఠశాలలకు పంపించే తల్లిదండ్రులు అందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి పెసరు లింగారెడ్డి,ఉపసర్పంచ్ కృష్ణ,మండల విద్యాధికారి ఆర్.రంగరాజన్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎన్.అండాలు,ఉప సర్పంచ్ కృష్ణ, వార్డు సభ్యులు,సి.ఆర్పీ.అన్నపూర్ణ, అంగన్వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**యాదాద్రి భువనగిరి జూన్ 29 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సోమవారం విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మండల ప్రజల రవాణా సౌకర్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో చేపడుతున్న రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, నూతనంగా నిర్మించిన రహదారిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని గట్టు మైసమ్మ ఆలయం వరకు చేపట్టనున్న బీటీ రోడ్డు రెన్యూవల్ పనులకు బీర్ల అయిలయ్య శంకుస్థాపన చేశారు. అనంతరం మాల్యాల గ్రామం నుండి బొమ్మలరామారం మండల కేంద్రం వరకు చేపట్టనున్న బీటీ రోడ్డు రెన్యూవల్ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. అలాగే మాల్యాల గ్రామం నుండి ధర్మరెడ్డి గూడెం గ్రామం వరకు నూతనంగా నిర్మించిన బీటీ రహదారిని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి మెరుగైన రహదారులు ఎంతో కీలకమని పేర్కొంటూ, నూతనంగా నిర్మిస్తున్న మరియు రెన్యూవల్ చేస్తున్న ఈ రహదారులు పూర్తయితే ప్రజల ప్రయాణం సౌకర్యవంతంగా మారడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, విద్యార్థులు, ఉద్యోగులు, అత్యవసర సేవలకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



## సమస్యలపై జోనల్ కమిషనర్‌తో ఎమ్మెల్యే సమీక్ష

- **పెండింగ్ పనులు, పారిశుద్ధ్యం, రోడ్ల మరమ్మతులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచన**

**కుషాయిగూడ, మహా :** ఉప్పల్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోమవారం ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తాను కలిసి చర్చించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చేపట్టాల్సిన పారిశుద్ధ్య చర్యలు, దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు, ప్రజల నుంచి అందిన పలు వినతులను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను ప్రాధాన్య క్రమంలో త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు. మెరుగైన పౌర సేవలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ రాధికా గుప్తా ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.



## మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు వారసత్వ విధానాన్ని అమలు చెయ్యాలి

- **మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి జైపాల్ రెడ్డి..**

**రాజేంద్రనగర్ మహా ;** తెలంగాణ రాష్ట్రంలోని మున్సిపాలిటీలో పని చేస్తూ మరణించిన, 60 సంవత్సరాలు నిండిన వారి స్థానంలో కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని సోమవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్(సిడిఎంఏ) కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ టీఎస్ వీఎన్ త్రిలేశ్వరావుకు తెలంగాణ మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని గతంలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యానికి గురై మరణించిన, 60 సంవత్సరాలు వయోపరిమితి నిండిన కార్మికుని స్థానంలో వారి కుటుంబంలో ఒకరికి వారసత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. గత ప్రభుత్వం అమలుపరిచిన విధంగానే వారసత్వ ఉద్యోగాలు అమలు చేయాలి. కార్మికులందరికీ 15 క్యాజువల్ సెలవులు, 8 పండుగ సెలవులు, 120 రోజులు మహిళలకు ప్రసూతి సెలవులు అమలు చేయాలి. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు కమతం యాదగిరి, ఎం మద్దిలేటి, రాష్ట్ర కార్యదర్శులు బొడ్డుపల్లి కిషన్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## జీడబ్ల్యూఎంసీ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన టీ వెంకన్న

**శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్**

**మహా వరంగల్ కార్పొరేషన్;** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన టి. వెంకన్న సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయ్ ను హన్మకొండ కలెక్టరేట్ లో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ నూతన కమిషనర్ కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నగర అభివృద్ధి, ప్రజలకు



మెరుగైన మున్సిపల్ సేవల అందజేత, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా తదితర అంశాల పై వారు కూలంకషంగా చర్చించారు.

## విద్యార్థికి క్రమశిక్షణ,కఠోరశ్రమ ఎంతో కీలకం

- **ఫ్రెషర్స్ పార్టీలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**




**యాదాద్రి భువనగిరి జూన్ 29 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం రంగాపూర్ గ్రామ సమీపంలోని హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీ జూనియర్ కాలేజీలో సోమవారం నిర్వహించిన ఫ్రెషర్స్ పార్టీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిఫెన్స్ అకాడమీ యజమాని రాజు కుమార్ తోపాటు విద్యార్థులు, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు బీర్ల అయిలయ్యకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, ఫ్రెషర్స్ పార్టీ అనేది కొత్తగా కళాశాలలో అడుగుపెట్టిన విద్యార్థులకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే వేదిక అని అన్నారు. విద్యార్థి జీవితంలో క్రమశిక్షణ, కఠోర శ్రమ, సమయపాలన ఎంతో కీలకమని పేర్కొన్నారు. డిఫెన్స్ రంగంలో కెరీర్‌ను ఎంచుకోవడం గొప్ప నిర్ణయమని, దేశ సేవే పరమోన్నత లక్ష్యంగా భావించి ప్రతి విద్యార్థి ముందుకు సాగాలని సూచించారు. దేశ సరిహద్దులను కాపాడే సైనికుల త్యాగాలు, సేవా భావం ప్రతి యువతకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. విద్యార్థులు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ధైర్యాన్ని కూడా పెంపొందించుకోవాలని, ప్రతి సవాలును ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనేలా తమను తాము తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కష్టపడే వారికి విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని, లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకు నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన వీక్షించి అభినందించారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసలు తెలియజేసి, వారి ఉజ్వల భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు,కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, డిఫెన్స్ ట్రైనర్లు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, బనాయకులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

- **అధికారుల నిర్లక్ష్యంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌కు వినతి**

**కుషాయిగూడ, మహా :** ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ శివసేన తెలంగాణ మెడ్చల్ ఇన్‌చార్జ్ అక్కల సురేష్ కుమార్ సోమవారం ఉప్పల్ జోన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రాధికా గుప్తాకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు.ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, నాగారం డివిజన్ టౌన్ ప్లానింగ్ అధికారులు, ఏసీపీ రాజీవ్‌రెడ్డికి పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ చట్టపరమైన చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. అలాగే జీహెచ్‌ఎంసీ యాప్, అధికారిక గ్రీవెన్స్ పోర్టల్, ఇన్‌వార్డ్ ఫిర్యాదులు, సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా కూడా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. అధికారుల జాప్యం కారణంగా అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని, దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లడంతో పాటు భవన నిర్మాణ నిబంధనల అమలుపై ప్రజల్లో విశ్వాసం దెబ్బతింటోందని అన్నారు. సంబంధిత అధికారుల పనితీరుపై స్వతంత్ర విచారణ జరిపి, నిర్లక్ష్యం నిర్ధారణ అయితే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను అక్కల సురేష్ కుమార్ కోరారు.

## నీట్ లీకేజీపై కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

- **విద్యార్థుల గొంతును అణిచే ప్రయత్నాలు మానుకోవాలి**
- **ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల అధ్యక్షుడు రేశ్వంత్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్‌లను ముందస్తు అరెస్టు**




**మొయినాబాద్ మహా:** నీట్ పరీక్షల లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో లోక్‌భవన్' కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా ముందస్తు అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైన చర్య అని ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల అధ్యక్షుడు రేశ్వంత్, మండల కార్యదర్శి చరణ్ గౌడ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తూ విద్యార్థి నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది. విద్యార్థుల సమస్యలపై గొంతెత్తిన నాయకులను అరెస్టు చేయడం ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను దాచిపెట్టడం సాధ్యం కాదని తెలిపారు. నీట్ పరీక్షల లీకేజీలతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, కేంద్ర విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. అక్రమ అరెస్టులతో విద్యార్థుల గొంతును అణచివేయడం, విద్యార్థి ఉద్యమాలను అడ్డుకోవడం ఎవరి వల్లా సాధ్యం కాదని విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ తన పోరాటాన్ని మరింత ఉధృతంగా కొనసాగిస్తుందని తెలిపారు.

## నాడు కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలిచ్చింది నేడు పట్టాలను లాక్కుంటుంది

- **19 ఏళ్ల అన్యాయం పేదలకు న్యాయం కావాలి**
- **టిఆర్ఎస్ పార్టీ చేవేళ్ల నియోజకవర్గం నాయకులు బేగరి రాజు**
- **హిమాయత్ నగర్ ప్రజల శాంతియుత ఉద్యమానికి టిఆర్ఎస్ మద్దతు**

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీ హిమాయత్ నగర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 60 గజాల స్థలాల కోసం రిలే నిరాహార దీక్ష నాల్గవ రోజుకు చేరుకుంది ఈ సందర్భంగా మొయినాబాద్ మండల టిఆర్ఎస్ పార్టీ పూర్తి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కుమ్మరి శివశంకర్, టిఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం నాయకులు బ్యాగరి రాజు మాట్లాడుతూ2007లో మంజూరైన 60 గజాల ఇంటి స్థలాల పట్టాలు ఇచ్చి ఇప్పటికీ స్థలాలు చూపకపోవడం నాయకులు మరియు అధికారులు 19 సంవత్సరాలుగా కాలయాపన చేస్తూ వచ్చారని తమకు ఇచ్చిన పట్టాలకు ఇకపై ఆలస్యం చేయకుండా తక్షణమే స్థలాలు ప్రజలకు చూపించాలని డిమాండ్ చేస్తున్నారు.గృహ స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలి. పేదలకు న్యాయం జరగాలి.ఈ ఉద్యమం శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగుతుందన్నారు తక్షణమే ప్రభుత్వం ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చిన పేద ప్రజలకు 60 గజాల స్థలాలు చూపించి న్యాయం చేయాలి లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు షేక్ మహ్మద్ నూర్ భాయ్, తెలంగాణ జాగృతి మొయినాబాద్ మండల అధ్యక్షులు నాగేష్,ఏనుగుల సంజీవరెడ్డి, బొక్క సురేందర్ రెడ్డి, టిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు ప్రవీణ్,బొక్క రవీందర్ రెడ్డి కావాలి శ్రీనివాస్ ముదిరాజ్, దర్శన్ గౌడ్, యండి యూనుస్,బోనాల ప్రభాకర్, గాండ్ల సంతోష్ కుమార్, టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నిర్వాకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.





## ఇండ్ల స్థలాల కోసం చలో ఆర్డీవో ఆఫీస్

**మొయినాబాద్ మహా:** చేవెళ్ల మండల కేంద్రంలోని భారత కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో మండల పార్టీ సహాయ కార్యదర్శి ఎం డి మక్బూల్ అధ్యక్షతన నిర్వహించిన ప్రెస్ మీట్ లో ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చేవెళ్ల నియోజకవర్గం ఇన్చార్జి కే రామస్వామి హాజరై మాట్లాడుతూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని ఇంటి స్థలాలు లేని వారికి ఇంటి స్థలాలు కేటాయించాలని గుడిసెలు వేసుకున్న గుడిసె వాసులకు వెంటనే పట్టాలు ఇవ్వాలని గతంలో పట్టాలు ఇచ్చి స్థలాల పొజిషన్ చూపించని వారికి స్థలాల పొజిషన్ చూపించాలని డిమాండ్ చేస్తూ జూలై 1వ తేదీన వేలాది మందితో చేవెళ్లలోని ఆర్డీవో కార్యాలయం ముందు ఉదయం 10 గంటలకు ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ధర్నా కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ శ్రేణులు ప్రజా సంఘాల నాయకులు కార్మికులు రైతులు ఇండ్లు లేని నిరుపేదలు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఈ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం ప్రభు లింగం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సత్యనారాయణ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు వడ్ల మంజుల పాల్గొన్నారు.



## జిల్లా ప్రజావాణికి 108 అర్జీలు

- **ఫిర్యాదులకు సత్వర పరిష్కారం అందించాలి**
- **జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి రంగారెడ్డి**

**జిల్లా ప్రతినిధి మహా:** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి108 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కిరణ్మయి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డితో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ... ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి అనంత రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ప్రజాప్రతినిధులు సహకరించాలి

**ఎంఈఓ భాస్కర్**

**వలిగొండ జూన్ 29 మహా న్యూస్** వలిగొండ మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజాప్రతినిధులు సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రభుత్వ పాఠశాలను కాపాడుకోవాలని వలిగొండ ఎంఈఓ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు ప్రైవేట్ పాఠశాలలకు పంపించే తల్లిదండ్రులు అందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని ఆయన కోరారు ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని ఆయన అన్నారు




## చైన్ స్నాచర్ ను పట్టించిన నిఘా కెమెరా

**వృద్ధురాలి మెడలో నాలుగు తులాల పుస్తెలతాడు లాక్కెళ్లిన నిందితుడి అరెస్టు**

**కుషాయిగూడ, మహా :** చిర్యాల గ్రామంలో వృద్ధురాలి మెడలోని నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లిన నిందితుడిని కీసర పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి నాలుగు తులాల బంగారు పుస్తెలతాడుతో పాటు నేరానికి ఉపయోగించిన హోండా యాక్టివా ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిర్యాల గ్రామానికి చెందిన సింగిరెడ్డి మల్లమ్మ ఇంట్లోకి ఈ నెల 26న తెల్లవారుజామున ఓ వ్యక్తి ప్రవేశించాడు. ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితుడు కత్తి అనిల్‌కుమార్‌ను సోమవారం అదుపులోకి తీసుకుని విచారించగా, అప్పుల బాధతోనే దోపిడీకి పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం అతడిని అరెస్టు చేసి, దోచుకున్న బంగారు పుస్తెలతాడుతో పాటు నేరానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన కీసర ఇన్‌స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు, ఎస్ఐ అనిల్‌కుమార్‌తో పాటు దర్యాప్తు బృందాన్ని మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ అభినందించారు.

## కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ..

**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ గండిపేట్ మండలనికి చెందిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేశారు.ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భారం కాకుండా ఉండేందుకు తెలంగాణ ప్రభుత్వం ఈ సంక్షేమ పథకాలను ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.పేదింటి యువతుల వివాహానికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఎంతోలబ్ధిచేకూరుస్తున్నాయన్నారు. 29మందిలబ్ధిదారులకు రూ 29లక్షల 3364 రూపాయల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మండల తహసిల్దార్, పార్టీ నాయకులు సిబ్బంది లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈరి మృత దేహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యేలు

**కారేపల్లి, మహా :** బీఆర్ఎస్ మండల మాజీ ప్రధాన కార్యదర్శి, జర్నలిస్టు అజ్మీర వీరన్న మాతృమూర్తి అజ్మీర ఈరి అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైరా మాజీ ఎమ్మెల్యేలు లావుడ్యా రాములు నాయక్, బానోత్ చంద్రవతి మృత దేహాన్ని సందర్శించి నివాళ్లు అర్పించారు. ఈరి కుమారులు అజ్మీర వీరన్న, అజ్మీర బిచ్చానాయక్, సురేష్ లకు సానుభూతిని తెలిపారు. ఫోనులో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎంపీ పిఏ లక్ష్మణ్ లు పరామర్శించారు. ఈరికి నివాళ్ళు అర్పించిన వారిలో వైరా ఎమ్మెల్యే తనయుడు మాలోత్ విఘ్నేష్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, వైరా బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు లాకవత్ గిరిబాబు, యాదవ సంఘం రాష్ట్ర నాయకులు మేకల మల్లి బాబు యాదవ్, సింహాద్రి తదితరులు ఉన్నారు.



## భవన నిర్మాణ పనులకు కంది శ్రీనివాస రెడ్డి భూమిపూజ

**ఆదిలాబాద్ మహా :** బేల మండలం దహెగాం గ్రామంలో 10లక్షల నిధులతో నిర్మించే వీవో భవననిర్మాణ పనులకు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి బేల మండల నాయకులతో కలిసి భూమి పూజ నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో అన్ని గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, కొండా గంగాధర్, కోలా నర్సింలు, శాంతన్ రావు, నిమ్మల గౌతమ్ రెడ్డి, అశోక్, అరవింద్ ,జైనథ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విలాస్ పాటిల్,బేల మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లే, సర్పంచులు దంతెలా వినోద్, గంభీర్ టాక్రె, శంకర్ భోక్రె, టెకం సత్యపాల్, ఉపసర్పంచుల అధ్యక్షులు సాగర్ టాక్రె, ఉప సర్పంచులు ప్రకాష్, బండి సుదర్శన్, నాయకులు బాపూరావు ,నగేష్ రెడ్డి ,నానాజీ వైద్య, మాడవి చంద్రకాంత్, బూబాన్ రమేష్, దోటె ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే గడ్డం వినోద్



**బెల్లంపల్లి, మహ:** ఎస్ ఐ ఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సోమవారం నాడు బెల్లంపల్లి పట్టణంలో పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ప్రక్రియ లక్ష్యం అని, ఎన్నికల జాబితాలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు.సోమవారం బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 31వ, 33వ వార్డుల్లో నిర్వహిస్తున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను ఎమ్మెల్యే స్వయంగా ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఏలు, బీఎల్వోలతో కలిసి ఓటర్ల వివరాల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో తప్పనిసరిగా నమోదు కావాలని, అర్హులైన ఒక్క ఓటరు కూడా మిగిలిపోకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఓటరు జాబితా పారదర్శకంగా, తప్పులులేకుండా రూపొందించేందుకు ప్రతి ఇంటిని సందర్శించి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.ప్రజలు కూడా ఈ ప్రక్రియకు పూర్తి సహకారం అందించి, అవసరమైన పత్రాలు సమర్పించి తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ముందుకు రావాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి విజ్ఞప్తి చేశారు.ప్రతి బూత్ లో పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలంతో సమన్వయంతో పనిచేయాలని ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమంలో చేరవేస్తూ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ దావ స్వాతి రమేష్ బాబు , మార్కెట్ కమిటీ చైర్మన్ రత్నం సుకుమారి , బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు, బండి ప్రభాకర్ , కౌన్సిలర్లు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బి ఎల్ ఏ లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## బాధలో బాసటగా.. కంది శ్రీనివాస రెడ్డి పరామర్శలు

**ఇద్దరికి ఆర్థిక సాయాలు**

**ఆదిలాబాద్ మహా :** ఆపదలో ఉన్నా , అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిసినా , ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్నారని సమాచారం అందినా వారి నివాసాలకు వెళ్ళి కొండంత అండగా నిలబడతారు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి. సోమవారం ఆదిలాబాద్ రూరల్ , సాత్నాల,బేల మండలాలలో పర్యటించారు.ఆదిలాబాద్ రూరల్ మండలంలోని తంతోలి గ్రామంలో ఇటీవల అనారోగ్యతో మృతి చెందిన శివయ్య,ప్రమాదవశాత్తు మృతిచెందిన సాయిరామ్ ల నివాసాలలో కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.సాత్నాల మండలం న్యూ రాంపూర్ గ్రామంలో ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన బడాలా సురేందర్ రెడ్డి , బేల మండల కేంద్రంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన బేతం సాయిదీప్ ల నివాసాలకు వెళ్లి వారి కుటుంబాలను పరామర్శించారు. అలాగే పిట్ గావ్ , దహెగావ్ గ్రామాలలో పర్యటించిన ఆయన పలువురిని పరామర్శించారు. ఆయన వెంట ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, న్యూ రాంపూర్ సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి సుందరిగిరి ఉపసర్పంచ్ నిమ్మల గౌతమ్ రెడ్డి, మాజీ జడ్పిటీసి కొండా గంగాధర్, కోలా నర్సింలు,అల్చేట్టి నాగన్న, రంగినేని శాంతన్ రావు, అశోక్, అరవింద్, డేరా కృష్ణ రెడ్డి తదితరులున్నారు.





## బిజెపి జాతీయ అధ్యక్షుడికి ఘన స్వాగతం పలికిన ఎర్రబెల్లి ప్రదీప్ రావు

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా బూత్ అధ్యక్షుల విజయసంకల్ప సమ్మేళన కార్యక్రమానికి విచ్చేసిన భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ కు బిజెపి రాష్ట్ర నాయకులు, వరంగల్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా కార్యక్రమ ప్రాంగణానికి చేరుకున్న జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ ను ఎర్రబెల్లి ప్రదీప్ రావు శాలువాతో సత్కరించగా రాష్ట్ర నాయకులు డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు జ్ఞాపికను బహూకరించి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బూత్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ విజయసంకల్ప సమ్మేళనం ద్వారా పార్టీని బూత్ స్థాయిలో మరింత బలోపేతం చేయాలని, రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని బిజెపి నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, పార్టీకి చెందిన పలువురు ప్రముఖులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యూనివర్సిటీ టౌన్‌షిప్‌ల ఏర్పాటుపై నీట్‌లో కీలక సమావేశం

**ముఖ్య అతిథిగా పాల్గొన్న కుడా చైర్మన్, డీసీసీ అధ్యక్షులు ఇనగాల**



**హన్మకొండ మహా;** వరంగల్ లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బోర్డ్ రూమ్ లో భారతదేశంలో యూనివర్సిటీ టౌన్‌షిప్‌ల ఏర్పాటు అనే అంశం పై ఉన్నత స్థాయి కీలక సమావేశం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడింది. దేశవ్యాప్తంగా విద్యా, పారిశ్రామిక రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో కేంద్ర బడ్జెట్ 202627 ప్రతిపాదనల ఆధారంగా రూపొందించిన ఈ ప్రాజెక్ట్ కాన్సెప్ట్ నోట్ తో పాటు సైట్ సెలెక్షన్ ప్రక్రియ పై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న ఈ అధికారిక కార్యక్రమానికి వరంగల్ కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ 202627 లో భాగంగా దేశంలోని ప్రధాన పారిశ్రామిక, లాజిస్టిక్ కారిడార్ల సమీపంలో సుమారు 50,000 కోట్ల రూపాయల భారీ అంచనా వ్యయంతో ఐదు ప్రతిష్టాత్మక యూనివర్సిటీ టౌన్‌షిప్‌లను నిర్మించాలని నిర్ణయించారు. ఒక్కొక్కటి దాదాపు 1,000 ఎకరాల విస్తీర్ణంలో గ్రీన్ ఫీల్డ్ , బ్రౌన్ ఫీల్డ్ విధానాలలో ఈ టౌన్‌షిప్‌లు రూపుదిద్దు కోనున్నాయి. ఈ బృహత్తర ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ ఫ్రేమ్‌వర్క్ అలాగే ల్యాండ్ వయబిలిటీ అసెస్‌మెంట్‌ను దేశంలోని తొమ్మిది ప్రముఖ జాతీయ సాంకేతిక విద్యాసంస్థలు (నిట్ లు) ఉమ్మడిగా సమన్వయం చేస్తున్నాయి. ఇందులో భాగంగా నిట్ వరంగల్ తో పాటు త్రిచి, జైపూర్, సూరత్కల్, రూర్కెలా, గోవా, సూరత్, భోపాల్, కాలికట్ సంస్థలు సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్ రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇప్పటికే భోపాల్, సూరత్, గోవా నగరాలలో విజయవంతంగా సంప్రదింపులు పూర్తి కాగా, ప్రస్తుతం వరంగల్ వేదికగా ఈ కీలక ప్రాంతీయ సమావేశం జరిగింది. ఈ యూనివర్సిటీ టౌన్‌షిప్‌లు కేవలం సంప్రదాయ విద్యాసంస్థలుగా కాకుండా, (చదువు ఉద్యోగం సహజీవనం) అనే అత్యాధునిక కాన్సెప్ట్‌తో సరికొత్త మల్టీవర్సిటీ ఎకోసిస్టమ్‌లుగా అభివృద్ధి చెందనున్నాయి. అకడమిక్ రీసెర్చ్ కోర్, మల్టీడిసిప్లినరీ ఇన్‌స్టిట్యూట్‌లు, పరిశ్రమల భాగస్వామ్యంతో కూడిన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్లు, ఎంఎస్ఎంఈ ప్రాధాన్యతలతో పాటు నివాస గృహాలు, వైద్యం, రిటైల్, వినోద రంగాలతో కూడిన సివిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ను ఇక్కడ ఒకే చోట అందుబాటులోకి తీసుకురానున్నారు. వాకబుల్ డిజైన్స్, పునరుత్పాదక ఇంధన వనరులు స్మార్ట్‌సస్టైనబుల్ సాంకేతికతతో కూడిన సరికొత్త డిజిటల్ మౌలిక వసతులను ఇక్కడ కల్పిస్తారు. దేశవ్యాప్తంగా పరిశీలిస్తున్న ఐదు అభ్యర్థిత్వ ప్రాంతాలలో భోపాల్, కోట, మంగళూరు, సూరత్ లతో పాటు తంజావూరు రేసులో ఉన్నాయి. వరంగల్ కారిడార్ సామీప్యత, మల్టీమోడల్ కనెక్టివిటీ, ఉన్నత విద్యాసంస్థల సాంద్రత, భూమి లభ్యత వంటి అంశాల ఆధారంగా ఈ సైట్ సెలెక్షన్ ప్రక్రియ సాగుతోంది. ఈ మహోన్నత ప్రాజెక్టు ద్వారా 2047 నాటికి గ్లోబల్ సర్వీసెస్ వాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రతిష్టాత్మక సమావేశంలో ఎన్ఐటీ డైరెక్టర్, రిజిస్ట్రార్, వివిధ విభాగాల ప్రొఫెసర్లు, పరిశోధకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని వరంగల్ ప్రాంతంలో ఈ ప్రాజెక్ట్ అభివృద్ధికి ఉన్న అనుకూలతల పై క్షేత్రస్థాయిలో చర్చించారు.

## మృతుని కుటుంబానికి సర్పంచ్ ఆర్థిక సాయం

**కారేపల్లి, మహా:** కారేపల్లి మండలం అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ బీక్యాతండాలో అనారోగ్యంతో మృతి చెందిన అజ్మీర ఈరి కుటుంబానికి సర్పంచ్ దండు ప్రవీణ్ కుమార్ సోమవారం రూ.5వేల ఆర్థికసాయం అందించారు. ఈరి మృతదేహాన్ని సందర్శించిన సర్పంచ్ మృత దేహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కుటుంబ సభ్యులు సాంత్వన నిధి క్రింద రూ.5,000/ ఆర్థిక సాయన్ని అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామపంచాయతీలో మృతి చెందిన కుటుంబాలకు సాంత్వన నిధి క్రింద ఆర్థిక సాయం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎట్టి సంధ్య రాణి, వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన బాలశౌరి

**తల్లాడ, జూన్ 29 (మహా):** ఖమ్మం జిల్లా తల్లాడ మండలం లక్ష్మీపురం గ్రామ ఉపసర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు బండి బాలశౌరి సోమవారం హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.అనంతరం లక్ష్మీపురం గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని ముఖ్యమంత్రికి అందించారు. గ్రామ సమస్యలపై సీఎంకు వివరించినట్లు బండి బాలశౌరి తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని, సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని చెప్పారు



## డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.!

- **లేదంటే వేలాది మందితో సచివాలయాన్ని ముట్టడిస్తాం..**
- **దాసోజు శ్రవణ్ మంచిరెడ్డి కిషన్ రెడ్డి క్యామ మల్లేష్**
- **రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా**
- **బండరావిరాల డంపింగ్ యార్డ్ ను రద్దు చేయాలని డిమాండ్**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రభుత్వం వెంటనే బండరావిరాల డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని దాసోజు శ్రవణ్, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, క్యామ మల్లేష్ డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల గ్రామ పరిధిలో ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన డంపింగ్ యార్డు (ఎకో టౌన్ ప్రాజెక్టు)కు వ్యతిరేకంగా పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన బాట పట్టారు. సోమవారం బండరావిరాల గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సుమారు 15 గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో తరలివచ్చి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ప్రజలు డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ ఆందోళనకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు మద్దతు తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, కమ్యూనిస్టు, బీఎస్పీ పార్టీలకు చెందిన స్థానిక నాయకులు రాజకీయాలకు అతీతంగా ప్రజల పక్షాన నిలిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంచిరెడ్డి కిషన్ రెడ్డి, దాసోజు శ్రవణ్, భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామా మల్లేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే వేలాది మంది ప్రజలతో కలిసి సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం దాసోజు శ్రవణ్, క్యామా మల్లేష్ మాట్లాడుతూ, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం సరికాదన్నారు.బండరావిరాల, చిన్నరావిరాల, పిల్లాయిపల్లి, బాచారం, పెద్దగూడెం తదితర గ్రామాల ప్రజలు ఇప్పటికే మూసీ కాలుష్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పుడు మరోసారి డంపింగ్ యార్డు భారాన్ని మోపడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనింగ్ జోన్ కారణంగా నష్టపోయిన బాధితులకు తగిన నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ప్రజావాణిలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బండరావిరాల సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్, చిన్నరావిరాల సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్, పిల్లాయిపల్లి సర్పంచ్ పెరుమాళ్ల మహాలక్ష్మి దానయ్య, దేశముఖి సర్పంచ్ దుర్గం జంగయ్య యాదవ్, జగత్‌పల్లి సర్పంచ్ ఇట్టమోని మహేష్ యాదవ్, పెద్దగూడెం సర్పంచ్ నర్సిరెడ్డి, కవాడిపల్లి సర్పంచ్ కొలను ప్రసన్నలక్ష్మి రవీందర్ రెడ్డి, బలిజగూడ సర్పంచ్ కొప్పు మాధవి నవీన్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సంఘటితంగా పనిచేసి నగరాభివృద్ధికి కృషి చేద్దాం: జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న



**వరంగల్, మహా:** గ్రేటర్ వరంగల్ నగర సమగ్ర అభివృద్ధికి అధికారులు సంఘటితంగా పనిచేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న సూచించారు. సోమవారం కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో ఎక్కడా ముంపు సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా శానిటేషన్, ఇంజనీరింగ్ విభాగాలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. రెవెన్యూ వసూళ్లలో నిర్లక్ష్యానికి తావులేదని, స్థానిక సంస్థల సుస్థిర నిర్వహణకు పన్నుల వసూళ్లు కీలకమని పేర్కొన్నారు. గ్రేటర్ వరంగల్‌ను పరిశుభ్రంగా, ప్రణాళికాబద్ధంగా, ప్రజానుకూల నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని కమిషనర్ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారుల పూర్తి సహకారం అవసరమని, ఉద్యోగులు విధుల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ శాఖల పనితీరును సమీక్షిస్తామని తెలిపారు. అంతకుముందు మీడియాతో మాట్లాడిన కమిషనర్ నగరాభివృద్ధిలో మీడియా పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రజావాణిలో మొత్తం 78 ఫిర్యాదులు స్వీకరించగా, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలకు చెరో 29, రెవెన్యూ 10, హెల్త్‌శానిటేషన్ 5, నీటి సరఫరాకు 5 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్ఓ డా. రాజారెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, ఇన్‌చార్జి సీపీ రవీందర్ రాడేకర్, పన్నుల అధికారి రామకృష్ణ, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, సమ్మయ్య, సెక్రటరీ అనిల్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## పాత భవనాల తొలగింపు పై సమీక్ష

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**



వరంగల్ క్రైం; వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం లో నూతన కమిషనరేట్ భవనం పరిసరాల్లోని పాత భవనాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సంబంధిత అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఈ పాత భావనాల్లో కొనసాగిస్తున్న వివిధ కార్యాలయాలను ఇతర ప్రాంతాలకు తరించాల్సి వస్తే సంబంధిత విభాగాలకు సంబందించిన కార్యకలాపాల పై ఎలాంటి ప్రభావం ఉంటుందనే దాని పై పోలీస్ కమిషనర్ అధికారులతో చర్చించారు. ఈ సమీక్ష లో అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్, ఏసీపీ సురేంద్ర, అంతయ్య, ఆర్.ఐ లు శ్రీధర్, సతీష్, స్పర్జన్ రాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బండరావిరాల గ్రామ ప్రజల పోరాటానికి అండగా నిలిచిన మంచిరెడ్డి!

- **కాంగ్రెస్ పార్టీ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి డిమాండ్.!**
- **లేదంటే సచివాలయాన్ని ముత్తడి చేస్తాం..**
- **జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి**

**ఇబ్రహీంపట్నం జూన్ 29 మహా:** ప్రజల అభిప్రాయాన్ని కాలరాస్తూ, గ్రామాల భవిష్యత్తుతో చెలగాటమాడే కాంగ్రెస్ ప్రభుత్వ అరాచక విధానాలను వెంటనే నిలిపివేయాలని, మంచిరెడ్డి కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు మండలం బండరావిరాల గ్రామంలోని సర్వే నంబర్ 268లో ఉన్న 494 ఎకరాల భూమిని, స్థానిక గ్రామస్థుల అభిప్రాయాన్ని పూర్తిగా పక్కనపెట్టి, జీవో నెం.20 పేరుతో డంపింగ్ యార్డు కోసం కేటాయించిన కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ, బండరావిరాల గ్రామస్తులు చేపట్టిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్, రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్ హాజరయ్యారు. అనంతరం మంచిరెడ్డి మాట్లాడుతూ... ప్రజల అభిప్రాయాన్ని కాలరాస్తూ, గ్రామాల భవిష్యత్తుతో చెలగాటమాడే కాంగ్రెస్ ప్రభుత్వ అరాచక విధానాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రజల హక్కులను కాపాడడంలో ప్రభుత్వం విఫలమైతే... బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సచివాలయాన్ని ముట్టడించేందుకు కూడా వెనుకాడబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్టు మండలానికి చెందిన 14 గ్రామాల సర్పంచ్‌లు, ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## బిజెపి జాతీయ అధ్యక్షుడికి త్రిశూలం బహుకరించిన జిల్లా అధ్యక్షుడు

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ జిల్లా బూత్ అధ్యక్షుల విజయసంకల్ప సమ్మేళన కార్యక్రమానికి విచ్చేసిన బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ కు వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సభ ప్రారంభంలో నితిన్ నబిన్ ను గంట రవికుమార్ శాలువాతో సత్కరించి, ప్రత్యేకంగా తయారు చేయించిన త్రిశూలాన్ని ఆయనకు బహూకరించారు.

## విద్యుద్ఘాతంతో పాడి గేదెలు మృతి

**కారేపల్లి, మహా :** విద్యుద్ఘాతంతో పాడి గేదెలు మృతి చెందిన ఘటన కారేపల్లి మండలం కమలాపురం సమీపంలో చోటుచేసుకుంది. బాధితులు తెల్పిన వివరాల ప్రకారం... కామేపల్లి మండల నెమలిపురి కి చెందిన భూక్య రాములు, గుగులోత్ రవీందర్ కు చెందిన పాడి గేదెలు ఆదివారం మేతకు కమలాపురం సమీపంకు వెళ్ళాయి. వ్యవసాయ బోర్లకు వెళ్ళు విద్యుత్ లైన్ ఆదివారం వీచిన గాలులకు తెగి చేనులో పడింది. ఆ ప్రాంతానికి మేతకు వెళ్లిన గేదెలు విద్యుత్ వైరు తాకి మృత్యువాత పడ్డాయి. పాలిచ్చే గేదెలు మృతితో జీవనాధారం పోయిందని తమను అదుకోవాలని బాధితులు విద్యుత్ అధికారులను వేడుకున్నారు.



## అధికారులకు సహకరించండి.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించండి

- **ఓటు ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు.**
- **కాంగ్రెస్ సీనియర్ నాయకులు బల్లి శ్రీనివాస్.**

**కుషాయిగూడ, మహా :** ఓటు ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు లాంటిదని ఎస్ఐఆర్ లో భాగంగా ప్రభుత్వ ఓటింగ్ అధికారులకు సహకరించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బల్లి శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. అంబేద్కర్ నగర్ లో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా కాంగ్రెస్ శ్రేణులతో సోమవారం ఎస్ఐఆర్ ప్రక్రియపై ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బల్లి శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటరే విలువైన శక్తి అన్నారు. అంబేద్కర్ నగర్లో 100% ఎస్ ఐ ఆర్ నమోదే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గజ్వేల్ శంకర్, చాగంటి వెంకటేష్, ఇండ్ల శ్రీనివాస్, సైదులు బాలరాజు, వెంకటేష్, నరేష్ బాలమణి, నీరజా తదితరులు పాల్గొన్నారు.



## సహకార వారోత్సవాల ప్రారంభం

**ఇబ్రహీంపట్నం, జూన్ 29 (మహా):** సహకార సంఘాల వారోత్సవాల సందర్భంగా సోమవారం తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘంలో అధ్యక్షులు కొత్తకుర్మ సత్తయ్య సహకార జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధే సహకార సంఘాల లక్ష్యమని పేర్కొంటూ, రైతులు సంఘం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతులతో ప్రతిజ్ఞ చేయించారు.

# ఇన్వెస్టర్లకు షాక్.. భారీగా మారనున్న గోల్డ్, సిల్వర్ ధరలు!




మీరు బంగారం లేదా వెండిలో పెట్టుబడి పెట్టాలని ఆలోచిస్తున్నారా? అయితే వచ్చే వారం మార్కెట్ చాలా కీలకంగా మారబోతోందని విశ్లేషకులు చెబుతున్నారు. వచ్చే వారం బులియన్ మార్కెట్ తీవ్ర హెచ్చుతగ్గులకు లోనయ్యే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికాఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల్లో మార్పులు, ప్రపంచ దేశాల ఆర్థిక గణాంకాలు రాబోయే రోజుల్లో బంగారం, వెండి ధరల దిశను శాసించనున్నాయని చెబుతున్నారు.

### యూఎస్ ఫెడ్ నిర్ణయాలు.. కీలక గణాంకాలు

ఆర్థిక విశ్లేషకుల అంచనా ప్రకారం.. వచ్చే వారం అమెరికా, యూరప్ దేశాల మ్యానుఫ్యాక్చరింగ్, సర్వీస్ రంగాల పీఎంఐ (PMI) డేటా, యూరోజోన్ ద్రవ్యోల్బణ గణాంకాలు, అమెరికా నాన్‌ఫార్మ్ పేరోల్, నిరుద్యోగిత రేటు వివరాలు విడుదల కానున్నాయి. ఈ గణాంకాలను బట్టి అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై ఎలాంటి నిర్ణయం తీసుకోబోతుందనే సంకేతాలు లభిస్తాయి. దీంతో ఇన్వెస్టర్లు అంతా ఈ డేటా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు అమెరికా - ఇరాన్ దేశాల మధ్య నెలకొన్న సైనిక ఉద్రిక్తతలు, నిలిచిపోయిన చర్చలు బులియన్ మార్కెట్‌పై ప్రభావం చూపనున్నాయి. ఈ రెండు దేశాల మధ్య వివాదం మరింత ముదిరితే, అది అంతర్జాతీయంగా ముడి చమురు ధరలను పెంచుతుంది. చమురు ధరలు పెరిగితే ఆ ప్రభావం నేరుగా గోల్డ్, సిల్వర్ రేట్లపై పడుతుందని స్పష్టం చేశారు.

### గత వారంలో భారీగా పతనమైన ధరలు

ప్రస్తుతం బంగారం, వెండి ధరలు 'కరెక్షన్' దశలో ఉన్నాయి. గత వారం అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర దాదాపు 3.5% తగ్గి 4,096.3 డాలర్ల వద్ద ముగియగా.. వెండి ధర ఏకంగా 10.7% క్షీణించి 59.67 డాలర్లకు పడిపోయింది. ఇక దేశీయంగా మల్టీ కమోడిటీ ఎక్స్చేంజ్‌లో ఆగస్టు డెలివరీ గోల్డ్ ధర 2.06% తగ్గి రూ.1.44 లక్షల (ప్రతి 10 గ్రాములకు) వద్ద ముగిసింది. అలాగే సెప్టెంబర్ డెలివరీ సిల్వర్ ధర 6.4% పతనమై రూ.2.23 లక్షల వద్ద స్థిరపడింది.

### ధరలు తగ్గడానికి.. పెరగడానికి కారణాలు..

అంతర్జాతీయ మార్కెట్లో అమెరికన్ డాలర్ బలోపేతం కావడం బంగారం ధరలు తగ్గడానికి కారణం అయ్యింది. అలాగే క్రూడ్ ఆయిల్ ధరలు 10% తగ్గడంతో ద్రవ్యోల్బణ భయాలు తగ్గి.. సురక్షిత పెట్టుబడిగా ఉన్న బంగారం వైపు ఇన్వెస్టర్లు మొగ్గు చూపలేదు. ఇదే సమయంలో వచ్చే వారం బంగారం ధరలు పెరగడానికి కారణాలు కూడా ఉన్నాయి. అమెరికా పర్సనల్ కన్జంప్షన్ ఎక్స్‌పెండిచర్ (PCE) ద్రవ్యోల్బణ గణాంకాలు కాస్త ఆశాజనకంగా రావడం వల్ల దిగువ స్థాయిల్లో కొనుగోళ్లు పెరిగాయి. దీనికి తోడు చైనా సెంట్రల్ బ్యాంక్ నిరంతరం బంగారాన్ని కొనుగోలు చేయడం, యూరోపియన్ యూనియన్‌పై 100% టారిఫ్ విధిస్తామన్న అమెరికా అధ్యక్షుడి హెచ్చరికలు బంగారానికి మద్దతుగా నిలిచే అవకాశం ఉంది. మొత్తంమీద వచ్చే వారం బులియన్ మార్కెట్లో ఒడిదుడుకులు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నాయని, ఇన్వెస్టర్లు గ్లోబల్ పరిణామాలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

# జూలైలో బ్యాంక్‌లకు ఏకంగా 12 రోజులు హాలిడేస్..

జూలై నెలలో మీకు బ్యాంకుకు వెళ్లాల్సిన పని ఉందా? అయితే ఈ సమాచారం మీకోసమే. జూలై నెలలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, నగరాల్లో మొత్తం 12 రోజులు బ్యాంకులు క్లోజ్ కానున్నాయి. ఇందులో 4 ఆదివారాలు, 2 శనివారాలు, 6 ప్రాంతీయ పండుగలు, ప్రత్యేక సెలవులు ఉన్నాయి. అయితే ఈ 6 అదనపు ప్రాంతీయ సెలవులు అన్ని రాష్ట్రాల్లో ఒకేసారి వర్తించవు. కేవలం ఆయా రాష్ట్రాలు, నగరాల్లోని బ్యాంకులకు మాత్రమే ఇవి వర్తిస్తాయి. జూలై నెలలో ఏ ఏ రోజుల్లో బ్యాంకులు మూతపడనున్నాయో ఆ పూర్తి హాలిడే లిస్ట్‌ను ఈ స్టోరీలో తెలుసుకుందాం.

### దేశవ్యాప్తంగా శని, ఆదివారాల సెలవులు

భారతీయ రిజర్వ్ బ్యాంక్ నిబంధనల ప్రకారం.. ప్రతి నెలలో రెండు, నాలుగో శనివారాలు, అన్ని ఆదివారాలు దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులకు సాధారణ సెలవులు ఉంటాయి. ఆ ప్రకారం జూలైలో వీకెండ్ సెలవుల వివరాలు




జూలై 5: ఆదివారం
జూలై 11: రెండో శనివారం
జూలై 12: ఆదివారం
జూలై 19: ఆదివారం
జూలై 25: నాలుగో శనివారం
జూలై 26: ఆదివారం

### ప్రాంతీయ పండుగల సెలవులు


వీకెండ్స్ కాకుండా జూలైలో వివిధ రాష్ట్రాల్లో స్థానిక పండుగలు, ధార్మిక ఉత్సవాలు, ప్రాంతీయ వేడుకల కారణంగా మరో 6 రోజులు బ్యాంకులు పనిచేయవు. ఇవి ఆయా రాష్ట్రాల సంస్కృతి, పండుగలను బట్టి మారుతుంటాయి. కాబట్టి ఖాతాదారులు తమ పరిధిలోని స్థానిక సెలవుల వివరాలను ఒకసారి బ్యాంక్ బ్రాంచ్‌లో లేదా ఆర్‌బీఐ వెబ్‌సైట్‌లో సరిచూసుకోవడం మంచిది.

### డిజిటల్ బ్యాంకింగ్ సేవలు యథాతథం

బ్యాంకులు మూతపడినప్పటికీ కస్టమర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉంటాయని ఆర్‌బీఐ వెల్లడించింది. నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ, ఎన్‌ఈఎఫ్‌టీ, ఆర్‌టీజీఎస్, ఏటీఎం సేవలు 24 గంటలూ యథాతథంగా పనిచేస్తాయని చెప్పింది. వీటి ద్వారా డబ్బులు బదిలీ చేయడం, బిల్లుల చెల్లింపులు, నగదు ఉపసంహరణ వంటి పనులను సులువుగా చేసుకోవచ్చు. మీరు నేరుగా బ్యాంక్ బ్రాంచ్‌కు వెళ్లి చెక్కులు డిపాజిట్ చేయడం, డిమాండ్ డ్రాఫ్ట్ తీసుకోవడం, కేవైసీ అప్‌డేట్ చేయడం లేదా లాకర్లకు సంబంధించిన పనులు చేయాల్సి ఉంటే.. ఈ సెలవుల లిస్ట్‌ను దృష్టిలో ఉంచుకుని ముందే ప్లాన్ చేసుకోండి.

# జీతం రూ.20 లక్షలు.. అయినా ట్యాక్స్ కట్టేది సున్నా..

భారీగా జీతం వచ్చే వారు కూడా సరైన ఆర్థిక ప్రణాళికలు అనుసరించడం ద్వారా తమ పన్ను భారాన్ని చట్టబద్ధంగా గణనీయంగా తగ్గించుకోవచ్చు. ఆదాయపు పన్ను చట్టంలోని వివిధ సెక్షన్లను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ట్యాక్సబుల్ ఇన్‌కమ్‌ను ఎలా తగ్గించుకోవచ్చో ఛార్టెడ్ అకౌంటెంట్ నిపుణులు వివరిస్తున్నారు. ఉదాహరణకు, రూ. 20 లక్షల వార్షిక ప్యాకేజీ ఉన్న ఒక వ్యక్తి పాత పన్ను విధానాన్ని ఎంచుకుని, సరైన పెట్టుబడులు పెడితే పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయాన్ని సుమారు రూ. 12.5 లక్షలకు తగ్గించుకోవచ్చు.



**పన్ను ఆదా చేసే ముఖ్యమైన మార్గాలు..**

**హెచ్‌ఆర్‌ఏ మినహాయింపు:** సెక్షన్ 10(13A) కింద అద్దె ఇళ్లలో ఉండే ఉద్యోగులు తాము చెల్లించే అద్దెపై భారీగా మినహాయింపులు పొందవచ్చు. స్టాండర్డ్ డిడక్షన్‌లో భాగంగా.. వేతన జీవులందరికీ రూ. 50,000 ఆటోమేటిక్ మినహాయింపు లభిస్తుంది.

**సెక్షన్ 80C పెట్టుబడులు:** ఈపీఎఫ్ (EPF), ఈఎల్ఎస్ఎస్ (ELSS) మ్యూచువల్ ఫండ్స్, పీపీఎఫ్ వంటి వాటిల్లో పెట్టుబడి పెట్టడం ద్వారా రూ. 1.5 లక్షల వరకు ఆదా చేయవచ్చు.

**హెల్త్ ఇన్సూరెన్స్ (Section 80D):** తనకు, కుటుంబ సభ్యులకు , సీనియర్ సిటిజన్లయిన తల్లిదండ్రులకు చెల్లించే ప్రీమియంలపై గరిష్టంగా రూ. 75,000 వరకు క్లెయిమ్ చేయవచ్చు.

**నేషనల్ పెన్షన్ సిస్టమ్ (NPS):** సెక్షన్ 80CCD(1B) కింద అదనంగా మరో రూ. 50,000 పొదుపు చేసుకోవచ్చు.

**హోమ్ లోన్ సదుపాయం:** సెక్షన్ 24(b) కింద గృహ రుణంపై చెల్లించే వడ్డీని జీతంలో సర్దుబాటు చేయడం ద్వారా భారీ ఊరట లభిస్తుంది.

**ఇతర అలవెన్సులు:** లీవ్ ట్రావెల్ అలవెన్స్ (LTA), సేవింగ్స్ ఖాతా వడ్డీల (80TTA) ద్వారా కూడా పన్ను తగ్గించుకోవచ్చు.

ఎక్కువ పెట్టుబడులు, మినహాయింపులు ఉన్నవారికి పాత విధానం, ఎలాంటి పెట్టుబడులు లేని వారికి కొత్త పన్ను విధానం ప్రయోజనకరంగా ఉంటాయి. పన్ను ప్లానింగ్ అనేది చట్టాన్ని గౌరవిస్తూ ఆర్థిక క్రమశిక్షణతో పొదుపును పెంచుకునే ఒక అద్భుతమైన మార్గం.

# సామాన్యుడికి జూలై షాక్.. 1వ తేదీ నుంచే ఈ 5 కీలక మార్పులు

జూన్ నెల ముగింపుకు వచ్చేసింది.. మరో నాలుగు రోజుల్లో కొత్త నెల అదే జూలై రాబోతోంది.. జూలై 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా పలు కీలక నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఈ మార్పులు సామాన్యుల రోజువారీ జీవితంతో పాటు వారి ఖర్చులపై కూడా ప్రభావం చూపనున్నాయి. ఎల్పీజీ సిలిండర్ ధరల నుంచి క్రెడిట్ కార్డు నిబంధనలు, ఆధార్ సేవలు, విమాన ప్రయాణాలు, కార్ల ధరల వరకు మొత్తం ఐదు ప్రధాన మార్పులు అమల్లోకి రానున్నాయి.

### ఎల్పీజీ సిలిండర్ ధరల మార్పు..

ప్రతి నెల మొదటి తేదీ మాదిరిగానే జూలై 1న కూడా చమురు సంస్థలు ఎల్పీజీ సిలిండర్ ధరలను సవరించనున్నాయి. అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో వాణిజ్య ఎల్పీజీ ధరల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

### ఏటీఎఫ్ ధర సవరణ

ఇక, ఎయిర్ టర్బైన్ ఫ్యూయల్ ధరలను కూడా సవరించనుండటంతో విమాన టికెట్ ధరలపై ప్రభావం పడే అవకాశముంది.. అంటే.. ఎయిర్ టర్బైన్ ఫ్యూయల్ ధరలు తగ్గింతే విమాన టికెట్ల ధరలు తగ్గడం అటుంచితే.. ఫ్యూయల్ ప్రైస్ పెరిగితే మాత్రం.. విమాన టికెట్ల ధరలు మరింత ప్రియం కావడం తప్పదన్నమాట..

### హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిట్ కార్డ్ నిబంధనలు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రెగాలియా గోల్డ్ క్రెడిట్ కార్డు వినియోగదారులకు కూడా కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఉచిత దేశీయ విమానాశ్రయ లాంజ్ సదుపాయాన్ని పొందాలంటే, గత త్రైమాసికంలో కనీసం రూ.60 వేల ఖర్చు చేసిన వారికే ఈ సౌకర్యం కొనసాగుతుంది.

### 1వ తేదీ నుండి ఉచిత ఆధార్ అప్‌డేట్


ఆధార్ కార్డు వినియోగదారులకు మాత్రం ఊరట లభించనుంది. UIDAI నిర్ణయం ప్రకారం ఆధార్‌లో ఈమెయిల్ ఐడీని అప్‌డేట్ చేసుకునే సేవ జూలై 1 నుంచి డిసెంబర్ వరకు ఉచితంగా అందుబాటులో ఉంటుంది. గతంలో ఈ సేవకు రూ.75 రుసుము వసూలు చేసేవారు.

### కారు కొనడం మరింత ఖరీదు..

ఇక కారు కొనుగోలు చేయాలనుకునే వారికి జూలై నెల నుంచి అదనపు భారం తప్పదు. కియా, టాటా మోటార్స్ వంటి ప్రముఖ ఆటోమొబైల్ సంస్థలు తమ వాహనాల ధరలను 1.5 శాతం నుంచి 2 శాతం వరకు పెంచనున్నట్లు ప్రకటించాయి. దీంతో జూలై నుంచి కొత్త కారు కొనుగోలు మరింత ఖరీదుగా మారనుంది.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# పట్టాలు కరిగేంత వేడి.. యూరప్ హీట్‌వేవ్ షాక్




*యూరప్ అంతటా తీవ్రమైన హీట్‌వేవ్ కారణంగా సాధారణ జీవనం అస్తవ్యస్తమైంది. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో రోడ్లు కరిగిపోవడం, రైల్వే పట్టాలు వంకరలు తిరగడం, రవాణా వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతినడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అనేక దేశాల్లో 40 డిగ్రీల సెల్సియస్‌ను దాటి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.*

వెస్ట్రన్ యూరప్‌లో మొదలైన ఈ హీట్‌వేవ్ క్రమంగా సెంట్రల్, ఈస్ట్రన్ యూరప్‌కు వ్యాపించి పలు దేశాల్లో ఉష్ణోగ్రత రికార్డులను బద్దలు కొట్టింది. డెన్మార్క్‌లో 1874 తర్వాత ఇప్పుడే అత్యధికంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. స్విట్జర్లాండ్‌లో 38.8 డిగ్రీలు, చెక్ రిపబ్లిక్‌లో 40.8 డిగ్రీలతో ఆల్‌టైమ్ రికార్డులు నమోదయ్యాయి. యూకేలో జూన్ నెలలోనే 37.3 డిగ్రీలతో చరిత్రాత్మక రికార్డు నమోదైంది. జర్మనీలో వేడిమి ప్రభావంతో ఆటోబాన్ హైవేపై కాంక్రీట్ స్లాబ్స్ పేలిపోవడంతో పలు రహదారులు మూసివేయాల్సి వచ్చింది. ఫ్రాన్స్‌లో రోడ్లు కరిగిపోవడం, విద్యుత్ అంతరాయాలు, రైళ్ల ఆలస్యాలు తీవ్రంగా నమోదయ్యాయి. అణుశక్తి కేంద్రాల్లో కూలింగ్ సమస్యల కారణంగా విద్యుత్ ఉత్పత్తి తగ్గించాల్సి వచ్చినప్పటికీ సరఫరాకు ఇబ్బంది లేదని అధికారులు తెలిపారు. హీట్‌వేవ్ ప్రభావంతో ఆసుపత్రులు కూడా ఒత్తిడికి గురయ్యాయి. ఫ్రాన్స్‌లో వేలాది మంది హీట్ సంబంధిత సమస్యలతో ఆసుపత్రులను ఆశ్రయించగా, అత్యవసర సేవలు అలర్ట్‌లోకి వెళ్లాయి. కొన్ని ప్రాంతాల్లో ప్రజా కార్యక్రమాలు వాయిదా పడ్డాయి. జర్మనీలో ఓ నర్సింగ్ హోమ్‌ను ఖాళీ చేయాల్సి రాగా, ఒక వ్యక్తి మరణించగా దాని కారణం వేడిమేనా అన్నది స్పష్టంగా తెలియలేదు. ఇటలీ, యూకేలోనూ రెడ్, ఆరెంజ్ అలర్ట్‌లు కొనసాగుతున్నాయి. పలు నగరాల్లో ప్రజలు నీడ కోసం తలదాచుకుంటూ, ఫౌంటెన్ల వద్ద సమయం గడుపుతున్నారు. ఇదే సమయంలో నదులు, సరస్సుల్లో స్నానానికి వెళ్లిన కొందరు ప్రమాదాల్లో మృతి చెందిన ఘటనలు కూడా నమోదయ్యాయి. యూరప్ అంతటా ఈ హీట్‌వేవ్ ప్రజా జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.యూరప్‌లో హీట్‌వేవ్‌ల వల్ల మరణాలు ఇటీవల సంవత్సరాల్లో గణనీయంగా పెరుగుతున్నాయి. తాజా అధ్యయనాలు మరియు 2026 జూన్‌లో వచ్చిన తాజా ఘటనల ఆధారంగా ముఖ్య విషయాలు ఇలా ఉన్నాయి. ఫ్రాన్స్‌లో మాత్రమే సుమారు 1,000కి పైగా అదనపు మరణాలు నమోదయ్యాయి కొన్ని నివేదికల ప్రకారం ప్యారిస్ ప్రాంతంలో మరణాల సంఖ్య వేగంగా పెరిగింది. జర్మనీ, పోలాండ్, చెక్ రిపబ్లిక్, హంగేరీ వంటి దేశాల్లో 40□C పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి యూరప్ మొత్తం మీద లక్షలాది మంది ప్రజలు తీవ్రమైన వేడికి గురయ్యారు 2024లో యూరప్‌లో సుమారు 62,775 హీట్‌వేవ్ సంబంధిత మరణాలు జరిగాయని అంచనాలు ఉన్నాయి. 2022-2023 వేసవుల్లో మొత్తం లక్షల సంఖ్యలో హీట్‌సంబంధిత మరణాలు జరిగినట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం, యూరప్‌లో వేడి కారణంగా ప్రతి సంవత్సరం మరణాలు పెరుగుతున్న ట్రెండ్ ఉంది. హీట్‌వేవ్ కారణంగా వృద్ధులు (65+ వయస్సు) ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. రాత్రి పూట కూడా ఉష్ణోగ్రతలు తగ్గకపోవడం గమనార్హం.

# 15 ఏళ్ల డాలర్ బంధానికి ముగింపు!

**ఒక దేశపు కరెన్సీ విలువను మరో దేశపు కరెన్సీతో స్థిరంగా అనుసంధానించి ఉంచడం.. ఆ తర్వాత ఆ బంధాన్ని తెంచుకోవడం సాధారణ నిర్ణయం కాదు. అలాంటి కీలక అడుగే ఇప్పుడు బొలీవియా వేసింది. 15 ఏళ్లుగా కొనసాగిన డాలర్ పెగ్ విధానానికి ముగింపు పలికింది. ఈ నిర్ణయం వెనుక ఉన్న బలమైన కారణం ఏంటి? డాలర్ పెగ్‌ను వదిలేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? ఈ మార్పు బొలీవియా ఆర్థిక వ్యవస్థను ఎలా ప్రభావితం చేయనుంది? పరిశీలిస్తే..**



సాధారణంగా ఒక దేశ కరెన్సీ విలువ మార్కెట్లో డిమాండ్, సరఫరా ఆధారంగా మారుతూ ఉంటుంది. అయితే కొన్ని దేశాలు తమ కరెన్సీ విలువను అమెరికన్ డాలర్‌కు స్థిరంగా కట్టిపెడతాయి. దీనినే "డాలర్ పెగ్" అంటారు. బొలీవియా కూడా గత 15 ఏళ్లుగా తన కరెన్సీ అయిన "బొలివియానో" విలువను డాలర్‌తో స్థిరంగా కొనసాగించింది. మార్కెట్లో పరిస్థితులు ఎలా మారినా.. ఒక నిర్దిష్ట మారకపు రేటును ప్రభుత్వం కొనసాగిస్తూ వచ్చింది. ఇందుకోసం భారీ మొత్తంలో డాలర్ నిల్వలు అవసరమవుతాయి.

### సడన్‌గా ఎందుకు?..

ఇటీవలి కాలంలో బొలీవియా తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోంది. దేశ విదేశీ మారక నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయి. ఇంధన దిగుమతులు, విదేశీ చెల్లింపుల కోసం అవసరమైన డాలర్లను సమకూర్చడం ప్రభుత్వానికి భారంగా మారింది. మరోవైపు మార్కెట్లో డాలర్ల కొరత తీవ్రమైంది. అధికారిక మారకపు రేటు ఒకలా ఉండగా, బ్లాక్ మార్కెట్లో డాలర్ ధర మరింత ఎక్కువగా పలుకుతోంది. దీంతో ప్రజలు అధికారిక బ్యాంకింగ్ వ్యవస్థపై నమ్మకం కోల్పోయి బ్లాక్ మార్కెట్ వైపు మొగ్గు చూపడం ప్రారంభించారు. ఈ పరిస్థితుల్లో పాత విధానాన్ని కొనసాగించడం సాధ్యం కాదని ప్రభుత్వం భావించింది.

### ఇకపై..

డాలర్ పెగ్ విధానాన్ని రద్దు చేయడంతో ఇకపై బొలీవియా కరెన్సీ విలువ మార్కెట్ పరిస్థితులను బట్టి నిర్ణయించబడుతుంది. అంటే డిమాండ్, సరఫరా ఆధారంగా కరెన్సీ విలువ పెరగవచ్చు లేదంటే తగ్గవచ్చు. ఈ నిర్ణయం తర్వాత బొలివియానో విలువ గణనీయంగా పడిపోయే అవకాశాలు ఉన్నాయని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. అలాగే దీని ప్రభావంగా.. దిగుమతి వస్తువుల ధరలు పెరిగి ద్రవ్యోల్బణం అధికమయ్యే అవకాశం ఉంది. అయితే దీర్ఘకాలంలో కరెన్సీ నిజమైన మార్కెట్ విలువను ప్రతిబింబించడం వల్ల ఆర్థిక వ్యవస్థ మరింత పారదర్శకంగా మారుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

### మరికొన్ని దేశాలు..

బొలీవియా నిర్ణయం ప్రపంచానికి కొత్తేమీ కాదు. గతంలో అనేక దేశాలు డాలర్‌తో ఉన్న స్థిర అనుబంధాన్ని వదిలేశాయి. దక్షిణ అమెరికా దేశమైన అర్జెంటీనా 1990లలో తన కరెన్సీ పెసోను డాలర్‌కు 1:1 నిష్పత్తిలో కట్టిపెట్టింది. కానీ తీవ్రమైన ఆర్థిక సంక్షోభం కారణంగా 2002లో ఆ విధానాన్ని రద్దు చేయాల్సి వచ్చింది. అనంతరం అర్జెంటీనా కరెన్సీ భారీగా విలువ కోల్పోయింది. అలాగే కజకిస్తాన్ 2015లో, ఈజిప్ట్ 2016లో తమ కరెన్సీలను మార్కెట్ ఆధారిత విధానానికి మార్చాయి. నైజీరియా కూడా గత కొన్నేళ్లుగా విదేశీ మారక సంక్షోభం నేపథ్యంలో కరెన్సీపై నియంత్రణలను సడలిస్తోంది. అయితే మరోవైపు సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, హాంకాంగ్ వంటి దేశాలు ఇప్పటికీ డాలర్ పెగ్ విధానాన్ని కొనసాగిస్తున్నాయి. ఈ దేశాల వద్ద భారీ విదేశీ మారక నిల్వలు ఉండటం ఇందుకు ప్రధాన కారణం. ఒక దేశం తన కరెన్సీని డాలర్‌కు కట్టిపెట్టడం ఎంత కష్టమో, ఆ బంధాన్ని తెంచుకోవడం కూడా అంతే కీలక నిర్ణయం. బొలీవియా తీసుకున్న తాజా నిర్ణయం ఆ దేశ ఆర్థిక పరిస్థితి ఎంత క్లిష్టంగా మారిందో చెబుతూనే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో డాలర్ ఆధిపత్యం, కరెన్సీ విధానాలపై మరోసారి చర్చకు దారితీసింది. భారత్ డాలర్ పెగ్ విధానాన్ని అనుసరించదు. మన కరెన్సీ రూపాయి 'మేనేజ్డ్ ఫ్లోట్' విధానంలో ఉండటంతో.. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా దాని విలువ మారుతుంటుంది. అయితే రూపాయిలో తీవ్ర ఒడిదొడుకులు రాకుండా అవసరమైనప్పుడు ఆర్‌బీఐ జోక్యం చేసుకుంటుంది.

# 17 ఏళ్లుగా అతడు అదృశ్యం.. ఇప్పటికీ పోరాడుతున్న కుమార్తె

**పారిస్: బలోచ్ నేషనల్ మూవ్‌మెంట్ (బీఎన్ఎమ్) సీనియర్ నేత డాక్టర్ దీన్ ముహమ్మద్ బలోచ్ అదృశ్యమై 17 ఏళ్లు అవుతోంది. బలోచ్ స్వేచ్ఛ కోసం గొంతెత్తిన వారిని అదృశ్యం చేసి, వారి ఆచూకీని తెలియకుండా చేసే పాకిస్థాన్ చర్యలకు ఈ ఘటన మరో ఉదాహరణగా నిలిచింది. తన తండ్రి ఆచూకీ తెలుసుకోవాలని, అదృశ్యమైన వారందరికీ న్యాయం చేయాలని ఆయన కుమార్తె సమ్మీ దీన్ బలోచ్ 17 ఏళ్లుగా శాంతియుతంగా పోరాడుతున్నా, ఆమెకూ బెదిరింపులు ఎదురవుతున్నాయని బలోచ్ నేషనల్ మూవ్‌మెంట్ ఆరోపిస్తోంది.**

ముహమ్మద్ బలోచ్ అదృశ్యానికి 17 ఏళ్లు పూర్తైన సందర్భంగా బీఎన్ఎమ్ అధ్యక్షుడు డాక్టర్ నసీమ్ బలోచ్ స్పందించారు. బలోచిస్థాన్‌లో అదృశ్యమైన వారు పడుతున్న బాధలకు ఈ ఘటన ఇప్పటికీ ప్రతీకగా నిలుస్తోందని అన్నారు. ఎక్స్ లో డాక్టర్ నసీమ్ బలోచ్ దీనిపై మాట్లాడుతూ.. "ఇన్నేళ్లుగా ఓ వ్యక్తి అదృశ్యమైతే ఏ కుటుంబమైనా భరించలేదు. దాదాపు 2 దశాబ్దాలుగా ఆయన కుటుంబ సభ్యులు అనిశ్చితి, వేద న మధ్య జీవిస్తున్నారు. ఆయనకు ఏమైందో తెలుసుకునే కనీస హక్కు కూడా వారికి దక్కలేదు" అని అన్నారు. డాక్టర్ దీన్ ముహమ్మద్ కుమార్తె సమ్మీ దీన్ బలోచ్‌ను నసీమ్ బలోచ్ ప్రస్తావిస్తూ.. "తన తండ్రితో పాటు.. అదృశ్యమైన వారిని తిరిగి తీసుకురావాలన్న శాంతియుత పోరాటానికి ఆమె ధైర్యంగా అంకితమైంది. న్యాయం దక్కాల్సిన చోట కూడా ఆమె బెదిరింపులను ఎదుర్కొంటోంది. ఆమె మానవ హక్కుల పోరాటాన్ని, తన తండ్రి తిరిగి రావాలన్న ఉద్యమాన్ని విడిచిపెట్టేలా బెదిరింపులు, భయపెట్టే చర్యలు ఎదుర్కొంటోంది" అని ఆరోపించారు. ఈ ఘటన పాకిస్థాన్‌లో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలకు నిదర్శనమని ఆరోపించారు. ఇది కఠిన వాస్తవాన్ని బయటపెడుతోందని, పాకిస్థాన్‌లో ప్రభుత్వ తీరును ప్రశ్నించే వారికి మానవ హక్కులు, న్యాయం లేకుండా చేస్తున్నారని తెలిపారు. అదృశ్యమైన కుటుంబ సభ్యుడి గురించి సమాచారం అడగడాన్నే నేరంగా చూస్తున్నారని, మానవ హక్కుల పరిరక్షకులను గొంతెత్తినందుకు బెదిరిస్తున్నారని చెప్పారు. పాకిస్థాన్ పాలనలో తమ బలోచ్ ప్రజలు మౌలిక హక్కులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛను సాధించలేరని బీఎన్ఎమ్ నమ్ముతోందని అన్నారు. "చివరకు సత్యం, న్యాయమే గెలుస్తాయని మేము నమ్ముతున్నాం. మా లక్ష్యాలు నెరవేరే వరకు మా శాంతియుత పోరాటాన్ని కొనసాగిస్తాం" అని తెలిపారు.



## 'ఓజీ 2'లో సుభాష్ చంద్రబోస్ ఎలిమెంట్?




పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న ఓజీ 2 సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. పవన్ స్వయంగా తన సోషల్ మీడియా ఖాతా ద్వారా ఈ చిత్రాన్ని ప్రకటించడంతో అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. దర్శకుడు సుజీత్, సంగీత దర్శకుడు తమన్‌తో చర్చలు, మ్యూజిక్ సిట్టింగ్స్ వేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమా కథలో ఈసారి ఊహించని మలుపులు ఉండనున్నాయని ఇండస్ట్రీలో ఓ టాక్ వినిపిస్తోంది. జపాన్ నుంచి వచ్చిన విలన్, ఓజీ గురించి వెదుకుతాడట. అనంతరం అతడికి, ఓజాస్ గంభీరాకు మధ్య జరిగే యుద్ధమే పార్ట్ 2 కథ అని చాలామంది భావిస్తున్నారు. కానీ అంతకుమించి మరో ఆసక్తికరమైన ట్విస్ట్ కూడా ఉందని సమాచారం. ఓజీ కథ 1940లలో మొదలై, 1973 ప్రాంతంలో సాగి 1993లో ముగిసిన విషయం తెలిసిందే. ఇప్పుడు సీక్వెల్‌లో మరోసారి 1940ల కాలాన్ని టచ్ చేస్తూ, ఆ కాలంలో సుభాష్ చంద్రబోస్ ఎలిమెంట్‌ను జోడించినట్టు తెలుస్తోంది. అయితే గంభీరాకు, బోస్‌కు కథలో ప్రత్యక్ష లింక్ లేకపోయినా, దర్శకుడు సుజీత్ మాత్రం ఈ కథలో ఓ చిన్న మేజిక్ చేసి ప్రేక్షకులను ఆశ్చర్యపరచనున్నారని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ చిత్రాన్ని పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై ఆయనే నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పవన్ చేస్తున్న దీక్ష ముగిసిన వెంటనే ఈ సినిమా లాంచింగ్ జరగనుందని సమాచారం.

## 'చంద్రప్పన్' సినిమా ట్రైలర్ లాంచ్

డా.పి.యష్మన్, సోనాలీ హీరో హీరోయిన్లుగా చేసిన సినిమా 'చంద్రప్పన్'. యష్మన్ హీరోగా నటించడంతో పాటు స్టోరీ, స్క్రీన్ ప్లే, డైలాగ్స్, లిరిక్స్, డైరెక్షన్ చేస్తున్నారు. జూలై 24న ఈ మూవీ థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ క్రమంలోనే తాజాగా ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో నిర్వహించారు. దర్శకుడు వి. సముద్ర, నిర్మాత కేఎల్ దామోదర ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హీరో, డైరెక్టర్ యష్మన్ మాట్లాడుతూ..మేం చాలా జాగ్రత్తగా మంచి కంటెంట్‌తో ప్రేక్షకుల అభిరుచికి తగినట్లు మూవీ చేశాం. చాలా మంచి కాస్టింగ్ ఉంది. వాళ్లంతా డైరెక్టర్‌గా నేను ఎలా చెబితే అలా ఫెర్ఫార్మెన్ ఇచ్చారు. మా మూవీ అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందని నమ్ముతున్నాం. ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాం. జూలై 24న రిలీజ్ అవుతున్న మా సినిమాను కూడా ఇలాగే సపోర్ట్ చేయండి అని అన్నారు.






## కుర్రాళ్లు రెడీ.. విడుదల తేదీ ప్రకటన

తెలుగులో అప్పుడప్పుడు చిన్న సినిమాలే మంచి సక్సెస్ అందుకుంటూ ఉంటాయి. అలాంటి వాటిలో తరుణ్ భాస్కర్ తీసిన 'ఈ నగరానికి ఏమైంది' ఒకటి. విశ్వక్ సేన్ హీరోగా నటించిన ఈ మూవీ యూత్‌లో మంచి ఫాలోయింగ్ సొంతం చేసుకుంది. అయితే చాన్నాళ్ల తర్వాత గతేడాది దీనికి సీక్వెల్ మొదలైంది. ఇప్పుడు రిలీజ్ డేట్ కూడా అధికారికంగా ప్రకటించారు. ఇకపోతే తొలి భాగంలో విశ్వక్ సేన్, అభినవ్, వెంకటేశ్, సుశాంత్, సిమ్రాన్ చౌదరి, అనీషా ఆంబ్రోస్ తదితరులు ప్రధాన పాత్రలు చేశారు. ఇప్పుడు సీక్వెల్ విషయానికొచ్చేసరికి సుశాంత్ బదులు శ్రీనాథ్ మాగంటి వచ్చి చేరాడు. తొలి పార్ట్ గోవా నేపథ్యంగా తీయగా.. ఈసారి మాత్రం థాయ్‌ల్యాండ్ బ్యాక్‌డ్రాప్‌లో తీశారు. ఈ ఏడాది నవంబర్ 19న థియేటర్లలోకి మూవీని తీసుకొస్తున్నట్లు వెల్లడించారు.

## బుల్లిరాజు రేవంత్.. గట్టిగానే డిమాండ్!



కొన్నిసార్లు సినిమాలో చిన్న పాత్ర చేసినప్పటికీ కొందరు యాక్టర్స్ వైరల్ అయిపోతుంటారు. మంచి గుర్తింపు తెచ్చుకుంటూ ఉంటారు. బుల్లిరాజు అలియాస్ రేవంత్.. ఏ క్షణాన 'సంక్రాంతికి వస్తున్నాం' చేశాడో గానీ ఓవర్ నైట్ స్టార్ అయిపోయాడు. అందుకు తగ్గట్లే తెలుగులో వరస చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నాడు. అయితే ఇతడు తీసుకుంటున్న రెమ్యునరేషన్ ఇప్పుడు హాట్ టాపిక్ అయిపోయింది. 'సంక్రాంతికి వస్తున్నాం' హిట్ తర్వాత చిరంజీవి 'మన శంకరవరప్రసాద్', నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒకరాజు', సింగిల్ తదితర చిత్రాల్లో కనిపించిన బుల్లిరాజు.. అనిల్ రావిపూడి తీస్తున్న వెంకటేశ్‌కల్యాణ్ రామ్ మూవీలోనూ అవకాశం అందుకున్నాడట. ఇప్పుడీ బాలనటుడు రోజుకు రూ.లక్ష పారితోషికం అందుకుంటున్నాడట. కేవలం సినిమాలే కాదు మాల్స్ ఓపెనింగ్, టీవీ షోలు, యాడ్స్ కూడా చేస్తూ రెండు చేతులా సంపాదిస్తున్నాడని ఇండస్ట్రీలో మాట్లాడుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ఏలూరు జిల్లా చానమిల్లి అనే ఊరికి చెందిన రేవంత్.. ప్రస్తుతం 6వ తరగతి చదువుతున్నాడు. ఓ వీడియో వల్ల వైరల్ అయిన ఇతడిని చూసిన అనిల్ రావిపూడి సినిమాలోకి తీసుకున్నాడు. అదే 'సంక్రాంతికి వస్తున్నాం'. ఇది రిలీజైన తర్వాత బుల్లిరాజుగా హీరో వెంకటేశ్ కంటే ఎక్కువ వైరల్ అయిపోయాడనే చెప్పొచ్చు.

## రిలీజ్ డేట్ ఫిక్స్ చేసిన ఫౌజీ?

సలార్, కల్కి 2898 చిత్రాలతో సక్సెస్ అందుకున్న ప్రభాస్‌కి 'రాజాసాబ్' రూపంలో ఘోరమైన డిజాస్టర్ తగిలింది. అయితే దీని నుంచి త్వరగానే బయటపడ్డ ఈ హీరో.. ప్రస్తుతం స్పిరిట్, ఫౌజీ, కల్కి 2 చిత్రాలతో బిజీగా ఉన్నాడు. అయితే వీటిలో 'స్పిరిట్' ఇప్పటికే రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకోగా.. 'ఫౌజీ' కూడా విడుదల తేదీని ఖరారు చేసుకుందనే టాక్ వినిపిస్తోంది. ఈ ఏడాదిలో ఇప్పటికే ఆరు నెలలు పూర్తి కాగా కేవలం మూడు నాలుగు మూవీస్ మాత్రమే హిట్ అయ్యాయి. దీంతో బాక్సాఫీస్ ఆకలి తీర్చే సినిమాల కోసం సినీ ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. ప్రభాస్ 'ఫౌజీ'పై ముందు నుంచి కాస్త బజ్ ఉంది. 'సీతారామం' తీసిన హను రాఘవపూడి దర్శకుడు కావడం, స్వాతంత్ర్యం రావడానికి ముందు జరిగే పీరియాడిక్ వార్ బ్యాక్‌డ్రాప్ కావడం లాంటివి ఆసక్తి కలిగిస్తున్నాయి. లెక్క ప్రకారం ఈ ఆగస్టులోనే వస్తుందని అంతా అనుకున్నారు. కానీ షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ సమస్యల కారణంగా అక్టోబరు నవంబరులో వచ్చే అవకాశముందన్నారు. కానీ తాజాగా డిసెంబరు 3ని రిలీజ్ డేట్‌గా నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అధికారికంగా బయటకు చెప్పనప్పటికీ ఇదే తేదీని ఫిక్స్ చేయొచ్చని మాట్లాడుకుంటున్నారు. గత కొన్నేళ్లలో చూసుకుంటే సలార్, అఖండ, పుష్ప, పుష్ప 2 మూవీస్ ఇదే నెలలో వచ్చి బ్లాక్‌బస్టర్ సక్సెస్ అందుకున్నాయి. మరి 'ఫౌజీ' ఒకవేళ డిసెంబరులో వస్తే ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి?





## దక్షిణాదిపై ఫోకస్ పెట్టిన జాన్వీ కపూర్

సినిమా ప్రాంతీయ భాషలని దాటి చాలా కాలమైపోయింది. హాలీవుడ్ నటీనటులు, సాంకేతిక నిపుణులు కూడా భారతీయ చిత్రాల్లో నటిస్తున్నారు. బాలీవుడ్ నటీనటుల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. చాలామంది హిందీ యాక్టర్స్.. దక్షిణాదిలో నటించేందుకు గత కొన్నాళ్ల నుంచి చాలా ఆసక్తి చూపిస్తున్నారు. ఆమిర్ ఖాన్, షారూఖ్ ఖాన్‌ల నుంచి ప్రియాంక చోప్రా, కియారా అడ్వాణీ వరకు సౌత్‌లో నటించిన వాళ్లే. రీసెంట్ టైంలో అయితే అతిలోక సుందరి శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ కూడా తెలుగులో 'దేవర', 'పెద్ది' చేసింది. తెలుగు సినిమాల్లో యాక్టింగ్ కంటే తన అందచందాలతో ఆకట్టుకున్న జాన్వీ కపూర్.. ఇప్పడు తమిళంలోకి ఎంట్రీ ఇచ్చేందుకు రెడీ అయింది. చాలామంది దర్శకనిర్మాతలు ఈమె కోసం ప్రయత్నించగా చివరకు డైరెక్టర్ సర్గుణం కోలీవుడ్‌లోకి జాన్వీని పరిచయం చేస్తున్నట్లు తెలుస్తోంది. కలవాణి, వాగై చుడవా తదితర మూవీస్ తీసిన ఈయన ఈ మధ్యే 'ఎగ్జామ్' వెబ్ సిరీస్ తీశారు. ఇప్పడు మరొకటి తీసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులోనే జాన్వీ కపూర్ కీలక పాత్ర చేయనుందట. ఈ వెబ్ సిరీస్‌ని ప్రముఖ దర్శకుడు పా.రంజిత్‌కి చెందిన నీలం ప్రొడక్షన్స్ నిర్మించనుందట. కురత్తి అనే టైటిల్ కూడా నిర్ణయించినట్లు తెలుస్తోంది. జాన్వీ కపూర్ కూడా నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసిందట. త్వరలో అధికారిక ప్రకటన రావొచ్చు. మరి తెలుగులో గుర్తింపు కంటే విమర్శలు ఎక్కువగా అందుకున్న జాన్వీ.. తమిళంలో ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి?



## బన్నీ-రష్మిక మరోసారి.. యాక్షన్‌తో షురూ!

అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న ఫాంటసీ అండ్ యాక్షన్ సినిమా 'రాకా'. ఈ చిత్రంలో అల్లు అర్జున్ తొలిసారి త్రిపాత్రాభినయం చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. దీపికా పదుకొనె, మలయాళ నటి ఫెమినాజార్జ్ ఈ మూవీలో భాగమయ్యారు. జాన్వీ కపూర్, రష్మికా మందన్నా, మృణాల్ ఠాకూర్ సైతం 'రాకా'లో నటించనున్నారనే టాక్ వినిపిస్తోంది. ముంబైలో జూలైలో ప్రారంభం కాబోయే కొత్త షూటింగ్ షెడ్యూల్‌లో రష్మిక మందన్నా జాయిన్ అవుతారని, ఆమె పాత్రకు సంబంధించి తొలుత యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించేందుకు అట్లీ సన్నాహాలు చేస్తున్నారని బాలీవుడ్ సమాచారం. అంతేకాదు.. రష్మిక క్యారెక్టరైజేషన్ లో నెగటివ్ షేడ్స్ ఉంటాయని, సరికొత్త గెటప్‌లో ఆమె కనిపిస్తారని తెలిసింది. అయితే ఈ అంశాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మిస్తున్న 'రాకా' సినిమా 2027లో రిలీజ్ కానుందని తెలుస్తోంది. ప్రస్తుతం 'మైసా' సినిమా చిత్రీకరణతో బిజీగా ఉన్నారు రష్మిక. అలాగే విజయ్ దేవరకొండ సరసన 'రణబాలి' చిత్రంలో ఆమె హీరోయిన్ గా నటిస్తున్న సంగతి తెలిసిందే.



## స్పీడ్ తగ్గించిన అందాల అనుపమ..

ప్రేమమ్ సినిమాతో సినీరంగుల ప్రపంచంలోకి అడుగుపెట్టిన అనుపమ.. 2015లో స్టార్ స్టేటస్ అందుకుంది. తెలుగు, తమిళం, మలయాళంలో వరుస ఆఫర్స్ అందుకుని ఈ బ్యూటీ రోజు రోజుకు మరింత పాపులర్ అయ్యింది. చూడచక్కని రూపం.. అద్భుతమైన నటనతో కట్టిపడేసింది.కానీ అనుపమకు అనుకున్నంతగా సరైన బ్రేక్ మాత్రం రాలేదు. ఇప్పటివరకు అనేక హిట్ చిత్రాల్లో నటించిన అనుపమకు.. స్టార్ హీరోల సినిమాల్లో మాత్రం ఛాన్స్ రాలేదు.2015లో 'ప్రేమమ్' సినిమాతో ఆమె సినీరంగుల జీవితాన్ని ప్రారంభించింది. ఈ మూవీ భారీ విజయాన్ని అందుకుంది.ఆ తర్వాత తెలుగులో శతమానం భవతి సినిమాతో కథానాయికగా పరిచయమైంది. తెలుగుతోపాటు తమిళం, కన్నడ, మలయాళం భాషలలో పలు చిత్రాల్లో నటించి మెప్పించింది.అనుపమ పరమేశ్వరన్ కేవలం 19 సంవత్సరాల వయసులోనే హీరోయిన్ అయ్యింది. మలయాళ 'ప్రేమమ్' ఆమె జీవితాన్ని మార్చేసింది. ప్రేమమ్ సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ అభిమానులను అలరిస్తుంది అనుపమ. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com